# కథామంజరి


## పది కథల సమాహారం



ఆగస్టు 2022

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**


జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త



**ఆగస్టు 2022**

సంపుటి : 3 ♦ సంచిక : 8

ఈ నెల కథామంజరి సంచికకి

వదాన్యులైన కథాభిమాని

**శ్రీ వి.వి.యస్.ఆర్.శర్మ గారు**

వారి తల్లిదండ్రులు

**కీ.శే. శ్రీ వెంపటి వెంకట నర్సయ్య**

**శీమతి లలితాంబ**

జ్ఞాపకార్థం

*

వారికి మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**



# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**

**కృపాకర్ పోతుల**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**

**కొచ్చెర్ల వి.ఆర్.**

**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

- శ్రీ పప్పు భోగారావు గారు
- శ్రీ వెంపటి కామేశ్వరరావు గారు
- శ్రీ భువనపల్లి రంగనాథం గారు
- శ్రీమతి కరవది సరస్వతి గారు
- శ్రీ బి.ఎస్. మూర్తి గారు
- శ్రీ అవసరాల రాఘవరావు గారు

శ్రావ్యసంచిక కోసం ఇక్కడ నొక్కండి

శ్రావ్యసంచిక సబ్ స్క్రైబ్ చేయడానికి ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | ... ... ... ... | i |
| విశిష్ట అతిథి | ... ... ... ... | iii |
| కథా మార్గదర్శి | ... ... ... ... | v |
| కథా పరిచయం | ... ... ... ... | vii |
| వినదగునెవ్వరు చెప్పిన | ... ... ... ... | x |


## కథలు, వ్యాసాలూ


| | | |
|---|---|---|
| జగమంత కుటుంబం ... | చలపాక ప్రకాష్ ... ... | 1 |
| దిశానిర్దేశం ... | కొత్తపల్లి రవికుమార్ ... | 6 |
| శ్రమకు నీరాజనం ... | సింగరాజు శ్రీనివాసరావు ... | 12 |
| శిక్ష ... | నామాని సుజనాదేవి ... | 17 |
| అనుకోని బంధం ... | శానాపతి(ఏడిద) ప్రసన్నలక్ష్మి | 21 |
| డిగ్నిటీ అఫ్ లేబర్ ... | పద్మ చిల్లరిగె ... ... | 23 |
| అపురూప వరమిది ... | నందూరి సుందరీ నాగమణి ... | 26 |
| బొమ్మ రూపాయి ... | చాగంటి తులసి ... ... | 29 |


## యువ కలం


| | | |
|---|---|---|
| చిరంజీవి ... | గాయత్రి రామోజీ ఆర్. ... | 42 |
| దేవుడు ... | ఎన్. రేవతి ... ... | 45 |


Cover Page Credits : Stijn Dijkstra, Netherlands

# కథాకీయం

కథ గురించి తెలుసుకోవాలని వ్యాసాలు, పుస్తకాలు తిరగేస్తుంటే.. ఎన్నో ఆసక్తికరమైన విషయాలు తెలుస్తున్నాయి. మూడొంతుల జీవితం అయిపోయిన తర్వాత ఇలాంటి విషయాలు తెలుస్తుంటే, జీవితం ఒక్కసారిగా ఓ ఏభై సంవత్సరాలు వెనక్కి వెళ్తే, ఎంత బావుండుననిపిస్తుంది. మనిషిని, సమాజాన్ని అర్థం చేసుకోడానికి శతాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతునే ఉన్నాయి. వీరి మధ్య సంబంధాలను తెలిపే ఎన్నో శాస్త్రాలు, గ్రంథాలు ఉన్నా సరే, మరెన్నో గాథలు కథలు ఉన్నాసరే, ఇంకా ఏదో వెలితి కనబడుతునే ఉంది. దీనికి తోడు మరో సమస్య ఎదురుగా కనబడుతుంది. అది.. ముఖ్యంగా మన జీవితాలను ప్రభావితం చేసే, కథాసాహిత్యం. ఈ కథ, అందులో తెలుగు కథ కొంచెం వాడిపోతున్నదని, మన తెలుగు సాహితీవేత్తలే వాపోతున్నారు. గడిచిన రెండు మూడు దశాబ్ధాలలో కథ నడిచిన తీరు ఆశాజనకంగా లేదనే మాట వినబడుతోంది.

ఈ పరిస్థితులకు కర్ణుడు చావులా సవాలక్ష కారణాలు చెప్తున్నారు. వాటన్నిటి జోలికి పోకుండా.. రెండు విషయాలు.. ముఖ్యంగా కథకి ఉండవలసిన ఆ విషయాలు గురించి ప్రస్తుతించాలనిపించింది.

అవి... కథావస్తువు, శిల్పం!

శిలలో నుంచి వచ్చిందే శిల్పం! శిలని కావలసిన రీతిలో చెక్కి, మెరుగులు పెట్టి, అందంగా మలిస్తే అది శిల్పంగా మారుతుంది. కథ కూడా అంతే! కథావస్తువు శిల అన్నమాట. ఎంచుకున్న కథావస్తువులో ఏది అవసరమో, ఎంత అవసరమో, ఎలా చెప్పడమో, ఏ స్వరంతో చెప్పాలో, పాత్రలు ఏవుండాలో, పాత్రల ప్రవర్తన ఎలా ఉండాలో, ఎత్తుగడ ముగింపులు ఎలా ఉండాలో.. వీటిని ఎలా క్రమ పద్ధతిలో ప్రవేశపెట్టాలో.. వంటి విషయాలే కథాశిల్పం! ఇంకా సులువుగా అర్థమవాలంటే.. పాటకు శృతి ఎలాంటిదే కథకి శిల్పం కూడా అలాంటిదే!

కథావస్తువు ఎంపికలో కూడా కథకుడికి మంచి అవగాహన ఉండాలి. శిల్పం బాగా పండాలంటే, కథావస్తువు బలంగా ఉండాలి. ప్రతీ విషయాన్ని కథావస్తువుగా తాడుకట్టి, లాగి బిగించకూడదు. కథలోని పాత్రలు, సంఘటనలు, సంభాషణలు చదివేవాడికి కళ్ళకు కట్టినట్లు కనబడాలి. చెప్పదలచుకున్న కథావస్తువు మీద రచయితకి అనుమానం, మీమాంస ఉండకూడదు. అనుభవాలనో, సహజ సంఘటనలనో కథావస్తువుగా ఎంపిక చేసుకున్నప్పుడు, అది పాఠకులను ఆకర్షిస్తుందా, లేదా అనే విషయం రచయితలకి అవగాహన ఉండాలి. మంచి కథావస్తువు దొరికినా, శిల్పం అందంగా రాకపోతే, ఆ కథకి ఆదరణ రాదు. వస్తువు బాగాలేకపోయినా, శిల్పం బావున్నా ఆ కథ అంతే! రూపంలేని జీవం, జీవంలేని రూపం ఎలాంటివో, కథకి వస్తువు, శిల్పం కూడా అంతే!

కథలు రాయడానికి విదేశాలలో ట్రెయినింగ్ సెంటర్స్ ఉన్నాయిట! కాని మన దేశంలో ఇప్పటికీ అలాంటివి లేవు. అలనాటి గురజాడవారి నుంచి నేటి మేటి రచయితల వరకు, స్వయంప్రకాశంతో తమ రచనాపటిమను ఎక్కువ సాహిత్యాన్ని చదివి, తెలుసుకుని ఆ అనుభవాలతో మెరుగులు దిద్దుకుని, మేటి కథకులుగా వాసికెక్కారు. ఇప్పుడిప్పుడే.. కథారచన మీద సదస్సులు, ఉపన్యాసాలు జరుగుతున్నాయి. ఇది కొత్తగా రచనలు చేసేవారికి ఉపయోగపడుతోంది.

కానీ.. మారిన కాలమాన పరిస్థితులలో రాస్తున్న రచయితలలో ఎక్కువ శాతంమంది మనోభావాలను గమనించాలి. అవి... జీవితాన్ని, కథాసాహిత్యాన్ని అధ్యయనం చేయకపోవడం, అసలు చదవవలసిన అవసరం లేదంటూ మనిషిని చదివి కథలు

రాస్తున్నామని  భావించి, వాదించే వారు ఉండటం, మనుషులను ఏ దృక్పథంలో చదవాలో ఆ రీతిలో చదవలేకపోవడం.. వంటి లోటుపాటుల ప్రభావం తెలుగు కథాసాహిత్యం మీద పడుతున్నది. ఊబిలాంటి ఈ పరిస్థితి నుండి బయటపడి, మన పూర్వీకులు ఎలా రాసేవారో, వారి అనుభవాలు ఏవిటో, వారు మనకి ఏం చెప్పారో తెలుసుకుని అనుకరిస్తే.. తెలుగు కథ విశ్వకథగా విరాజిల్లుతుందనే నమ్మకంవుంది.

ఆ దిశగా పయనం సాగిద్దాం.

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**చాగంటి తులసి గారు**

"మన ప్రాచీన కవులు, రచయితలు వాళ్ల జీవితాల్నీ, అనుభవాలనీ, వారు ఏదైతే నమ్మారో... అవి రాసారు. రాసింది సమాజానికి ఉపయోగపడాలని వాళ్ళు అనుకున్నారు, మేం అనుకున్నాం! ఆ పద్దతిలోనే నేను రచనలు చేసాను. అది ప్రగతిశీలంగా ఉండాలని భావించాను. అది అలా ఉండకపోతే సమాజం పట్టించుకోదు, వదిలేస్తుంది. మనం ఇప్పుడు తాపత్రయపడినా, బుజాలు తడుముకున్నా, ఒకొరికొకరు అభినందించుకున్నా, పోగడుకున్నా.. కాలం గుర్తిస్తుంది! రచయితలన్నవారు ఒక విషయం గుర్తించుకోవాలి.. రచయిత అన్నవాడు ఏవరికి భయపడకూడదు. చెప్పగలిగింది చెప్పాలి. అది ఎవరైనా సరే..అంటే మన చూట్టూ ఉన్న సమాజానికి భయపడక్కర్లేదు, మనల్ని పరిపాలిస్తున్న పాలకులకి భయపడక్కర్లేదు. వ్యవస్థలో ఉన్నటువంటి అక్రమాలనీ, అన్యాయాలనీ భయం లేకుండా ఖండించాలి. అప్పుడే నిజమైనటువంటి కవి, రచయిత వారిలో కనబడతాడు!" అంటూ వ్రాసేవారికి, చదివేవారికి చెప్పడమే కాదు, తాను నూరుశాతం ఆ సిద్ధాంతాన్ని తన రచనలలో చూపించిన తెలుగు సాహితీ ప్రపంచంలో మరో మణిరత్నం, చాగంటి వంశీయులలో మరో సాహితీ ఋషీమణి, అభ్యుదయ సాహిత్యవేత్త చాగంటి తులసి గారు!

సాహిత్యపరంగా ముమ్మూర్తుల చాసోగారి కూతురని సాహితీవేత్తలు ఘంటా పథంగా అంటారనడంలో అతిశయోక్తి లేదు. చాసో, అన్నపూర్ణమ్మ దంపతుల అమ్మాయిగా 1937లో విజయనగరంలో జన్మించిన తులసిగారు ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్.ఏ. (హింది) చదివి, ఆంధ్ర యూనివర్సిటీలో డాక్టరేట్ చేసి, ఒరిస్సా ప్రభుత్వ విద్యాశాఖలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేసారు. పదవీవిరమణ తర్వాత విజయనగరంలోనే స్థిరపడ్డారు. ఇంట్లో ఉండే సాహితీ వాతావరణ ప్రభావంతో సహజంగానే బాల్యం నుంచి సాహిత్యం వైపు మక్కువ పెరిగింది. తర్వాత కాలంలో గురజాడ అడుగుజాడలలో పెరిగి, ఆయన బాటపట్టి, ఎన్నో కథలు, అనువాదాలు చేసారు.

తులసిగారు నాలుగో తరగతి చదువుతున్నప్పుడు 'భరతపక్షి' అనే కథ రాసి, శ్రీరంగం నారాయణబాబుగారికి చూపెడితే, ఆయనే "బాల" పత్రికకు ఇచ్చారుట. ఆ విషయం చాసోగారికి చెప్పొద్దని కూడా చెప్పారుట. అలా సాహిత్యరంగంలో అరంగేట్రం చేసిన తులసిగారు తర్వాత కాలంలో.. మాంజాదారం, అప్పన్న, ఆడదాయికి నోరుండాల, కొయ్యపడవలూ చేగోడీలు, తిరోగామి, బొమ్మ రూపాయి, మనువు, వడదెబ్బ, శరణ్యం వంటి ఎన్నో కథలు రాసారు. అందులో "బొమ్మ రూపాయి" కథ చాలా ప్రశస్తి పొందింది. ఆ కథని నేషనల్ బుక్ ట్రస్ట్ వారు "Masterpieces of Indian Literature" అంటూ వారు 1997 లో ప్రచురించిన పుస్తకంలో ప్రస్తుతించారు. తులసిగారు హిందీ, తెలుగు, ఒరియా భాషల్లో ఎన్నో

అనువాదాలు చేసారు. అందులో మహాదేవివర్మ గారి గీతాలని తెలుగులోకి, చాసో కథలు, మెడికో శ్యామ్ కథలను హిందీలోకి చేసిన అనువాదాలు చాలా ప్రశంసలు పొందాయి. వీరి రాసిన కథలు, వ్యాసాలు, కూనలమ్మ పదాలు, పిల్లల పాటలు, పిల్లల కథలు, నాటికలు, ఇతర భాషల అనువాదాలతో పలు పుస్తకసంకలనాలు కూడా వెలువడ్డాయి. అందులో తులసికథలు, యాత్ర(నవలిక), రంగంటే ఇష్టం(వ్యాస సంకలనం) మొదలగు వాటికి మంచి ప్రశంసలు లభించాయి. "తులసికథలు" మళయాళం, ఇంగ్లీషు, హిందీ, ఒరియా, బెంగాలీ మొదలైన భాషలలో అనువాదమై, మంచి పేరు కూడా తెచ్చాయి.

తులసిగారు.. తాను రాసిన ప్రతీ అక్షరం మీద శ్రద్ధ తీసుకుంటారు, భాషా పదాలూ, పేర్లూ, ఏవీ తప్పులు రాకూడదని ఎంతో ఓపికగా చూస్తారు. తులసిగారు వచనాన్ని ఎక్కువ రాసినా, కవిత్వం పట్ల ప్రత్యేకమైన అకర్షణ ఉంది. నిజానికి కవితాహృదయం కలిగిన రచయితలు ఏ విధమైన వచనం రాసినా, అది అందంగా, సాఫీగా, ఒడుదుడుకులు లేకుండా సాగిపోతుంది. ఆ సౌకర్యం తులసీగారి కథలలో కనబడుతుంది. ఆవిడ రాసిన వ్యాసమైనా, విమర్శైనా.. పాఠకులను చదివిస్తుంది. ఆ శైలిలో ఓ అందం, ఆహ్లాదం కనబడతాయి. "శ్రీపాద కథల్లో తెలుగు తర్వాత దానితో సరితూగే జానతెలుగు తులసి గారి కథల్లో నన్ను చాలా ఆకట్టుకుంది. ఈ భాషలో విసురు, పరుగు, దూకుడు, గలగలాపారే సెలయేరులాగా ఎంతో హృద్యం గా ఉంటుంది" అంటూ ప్రఖ్యాత రచయిత ఆర్. ఎస్. సుందరం గారు తులసి గారి కథలకి కితాబ్ ఇచ్చారు. "దాదాపు నలభై ఏళ్ల క్రిందట చదివిన తులసిగారి 'బొమ్మ రూపాయి' కథ మీద నా అభిప్రాయం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఇందులో జీవితం ఉంది, విమర్శ ఉంది, ఆదర్శం ఉంది!" అంటూ ప్రఖ్యాత రచయిత్రి రంగనాయకమ్మగారు ఆ కథని మెచ్చుకున్నారు. "తులసిగారిలా రాయగలిగిన వారు తెలుగులో చాలా తక్కువమంది ఉన్నారు" అంటూ పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు అంటే.. "చాసో కథల కంటే, నాకు తులసి కతలంటేనే చాలా ఇష్టం" అంటూ రోణంకి అప్పలస్వామిగారు అన్నారంటే.. తులసి గారి కథల గురించి వేరే చెప్పక్కర్లేదు.


"ఇప్పుడు వస్తున్న కథావస్తువులో వైవిధ్యం పెరిగింది. ఆయా సమూహాల గురించి వారి వారి తాత్వికతను బలపరుచుకోవడానికి రాసినట్టుంటున్నాయి. బతుకులోంచి వచ్చినవికాక, మెదడులోంచి వచ్చి, తయారుచేయబడ్డ కథల్లా కనబడతున్నాయి! ఇది సమాజానికి మంచి చేయదు!" అంటూ నేటి కథలపై తులసిగారు నిర్మొహమాటంగా తన అభిప్రాయాన్ని తెలియచేసారు. "కారా మాష్టారి కథలలో తన భావాలను పాత్రలకు ఆపాదించడమే జరిగింది. రాజకీయ చైతన్యంతో ప్రజలలో పరిణామం కలిగినట్లు ఏ పాత్రలోనూ ద్యోతకం కాలేదు!" అంటూ తన అభిప్రాయం వ్యక్తపరచడంలో ఆవిడ ఎప్పుడూ మొహమాటం పడలేదు.

కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా సమితి సభ్యురాలుగా, జ్యూరీ మెంబరుగా సేవలందించిన తులసిగారు, చాలా దేశాలలో పర్యటించి, సాహితీ ఉపన్యాసాలు చేసారు. ఇక అవార్డులు, రివార్డుల గురించి రాస్తే, జాబితా ఎక్కువే అవుతుంది.

హిందుస్తానీ భాష అన్నా, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కథలన్నా ఇష్టపడే తులసిగారు ఆరు శతాబ్దాలుగా నిరంతరం ఏదో ఒకటి రాస్తూ(సాహిత్య సేవ చేస్తూ), సాహిత్య సంభాషణలు చేస్తూ, ఈ వయసులో(ఇప్పటికీ) వీసమెత్తు కూడా.. నమ్మిన సిద్ధాంతాలతో రాజీ పడకుండా తెలుగు కథా వికాసానికి కృషిచేస్తున్నారు. సహస్ర పున్నమిల జీవితాన్ని తనవితీరా అనుభవించి, ఆ అనుభావాల్ని మన అందరికి పంచుతూ, తనదంటూ ఓ ప్రత్యేక బాట వేసుకున్న చాగంటి తులసిగారి గురించి ఎన్ని పేజీలు రాసినా తక్కువే అవుతుంది. సాహిత్యంలో పుట్టి, సాహిత్యంలో పెరిగి, సాహిత్యమే తన దైనందిన జీవితంగా అందులో మమైకమైపోయిన కొద్దిమంది కథకులలో తులసిగారు ఒకరు. ఆ తపస్వికి, ఈ సంచిక విశిష్ట అతిథిగా అంగీకరించునందులకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ.. తులసిగారికి నవల, నాటకం రాయలనే కోరిక త్వరలోనే తీరాలని మనసారా కోరుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



**కీ.శే. పాలగుమ్మి పద్మరాజు గారు**

ఆయన ఉద్యోగ జీవితం మొదలెట్టిన కొత్తలో, తాను పనిచేస్తున్న కళాశాల యాజమాన్యం ఇచ్చిన కొద్దిపాటి స్థలంలో నాలుగు గోడలు కట్టుకుని, పైన తాటాకులతో నివాసం ఏర్పరుచుకున్నారు. ఓ రోజు రాత్రి పెద్ద గాలివాన వచ్చి, ఆ ఇంటి గోడలు పడిపోయాయి. ఆ శిధిలాల మధ్య ఆయన భార్య ఉండిపోయింది. దాంతో ఆయన కంగారు పడిపోయాడు. శరీరం అంతా టెన్షన్ వచ్చేసింది. ఆ చీకటిలో తాను ఒక్కడూ ఏం చేయలేని నిస్సహాయ స్థితి! అంతలో ఆ కళాశాల విద్యార్థులు, తోటి అధ్యాపకులు పరుగుపరుగున వచ్చి, ఆ శిధిలాలు తొలగించి ఆయన భార్యని రక్షించారు. ఈ సంఘటన నేపధ్యంలో ఆయన స్వయంగా అనుభవించిన భయం, ఆవేదన, అనుభూతులతో ఓ కథ రాసారు. ఆ కథే.. తెలుగు కథని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళి, న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ నిర్వహించిన కథలపోటిలో ఎంపికైంది. మొత్తం ఇరవైమూడు దేశాలకు చెందిన కథలు ఎంపిక కాగా, మన దేశానికి సంబంధించి మూడు కథలు ఆ పోటిలో ఎంపికయ్యాయి. ఆ మూడింటా ఈ "గాలివాన" కథ ఒకటి. అంతకు ముందుగాని, తర్వాత గాని మరే ఇతర తెలుగుకథకు అంతటి గౌరవం దక్కలేదనే చెప్పాలి. అలా తెలుగు కథకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన ఆ "గాలివాన" కథ పేరు చెప్పగానే, అందరికి జ్ఞాపకం వచ్చే ఆ కథా రచయిత కీ.శే. పాలగుమ్మి పద్మరాజుగారు. గడిచిన వందేళ్ల చరిత్రలో, గొప్ప తెలుగు కథారచయితల గురించి చెప్పాలంటే మొదటి పదిమంది రచయితలలో పాలగుమ్మిగారి పేరు ఉన్నతంగా నిలిచిపోయింది. మరో వందేళ్ల తర్వాత కూడా ఆ పేరే ఉంటుందని ఖచ్చితంగా చెప్పగలం కూడా!

పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలుకాలోని తిరుపతిపురం గ్రామంలో 1915 జూన్ 4 తేదిన పద్మరాజుగారు జన్మించారు. బెనారస్ యూనివర్శిటీ నుంచి రసాయనిక శాస్త్రంలో ఎమ్.ఎస్సీ. చేసి, కాకినాడ పి.ఆర్. కాలేజీలో, తర్వాత భీమవరం కాలేజీలో అధ్యాపకుడిగా పని చేసారు.

తన పద్నాలుగో ఏట నుంచే కవితలు, పద్యాలు రాయడం మొదలుపెట్టి, తాను రాసిన పద్యాలని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి గారికి వినిపించి, వారి ఆశీసులు పొందారు. తర్వాత బెనారస్‌లో చదువుతున్నప్పుడు, ఆంగ్లసాహిత్యం వైపు ఆకర్షితుడై, పద్యాలతో పాటు కథలు రాయడం కూడా 1937లోనే ఆరంభించారు. పద్మరాజుగారి మొదటి కథ "సుబ్బి". నూట ఏభై కి పైగా కథలు రాసారు. సాంఘిక, పరిశోధన నవలలు, కవితలు, నాటికలు కూడా రాసిన పద్మరాజు గారు, ప్రఖ్యాత దర్శకనిర్మాత బి.యన్.

రెడ్డిగారి అభ్యర్థన మేరకు 1954లో మొదటిసారిగా "బంగారుపాప" సినిమాకి రచనా సహకారం అందించారు. తర్వాత కాలంలో అధ్యాపక ఉద్యోగానికి రాజీనామా చేసి, తెలుగు చిత్రపరిశ్రమలో పూర్తి స్థాయిలో అడుగుపెట్టి, మూడు దశాబ్దాలు పాటు, పలు చిత్రాలకు మాటలు, పాటలు రాసి, రచనా సహకారం అందించారు. "బికారి రాముడు" సినిమాకు దర్శకత్వం వహించిన పద్మరాజుగారు, అజ్ఞాతరచయితగా కూడా చాలా కాలం పనిచేసారు.

పద్మరాజుగారి రచనలో సహజత్వం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. అన్ని వర్గాల మనుషులలో మంచి చెడులు ఉంటాయని నమ్మిన పద్మరాజుగారి కథలలో ఆ మంచి చెడులే కనబడతాయి. ఆయన ఏ పనైన చాలా శ్రద్ధగా చేసేవారు. ఆయన ఇష్టపడి టైలరింగు కూడా నేర్చుకున్నారు. ఆ టైలర్ ఇంట్లో దొంగతనం, ఆ దొంగ, వాళ్ళ పనిమనిషి... ఇలా ఆయనకి జీవితంలో తన చూట్టూ కనబడిన మనుషులందరు ఆయన కథలలో మనకి తారసపడతారు. ఆయా పాత్రలలో సజీవంగా ఉండిపోయారు. అలా ఆయన కలం నుంచి జాలువారిన కథలన్నీ ఆణిముత్యాలే. ఉద్వేగాలు, కోర్దుపక్షి, కరణం కనకయ్య వీలునామా, చేతికి చిక్కిన పిట్ట, దారితప్పిన బస్సు, వాసనలేని పువ్వులు, పడవ ప్రయాణం.. ఇలా కథల శీర్షికలలో కూడా ఓ ఒరవడిని సృష్టించారు. బతికిన కాలేజీ, నల్లరేగడి, రామరాజ్యానికి రహదారి.. వంటి పాలగుమ్మి గారి నవలలు పాఠకుల్ని చదివిస్తాయి. అలాగే.. సినిమారంగ ప్రవేశం తర్వాత బంగారు పాప, భక్త శబరి, శాంతి నివాసం, బంగారు పంజరం, రంగుల రాట్నం, శ్రీ రాజేశ్వరి విలాస్ కాఫీక్లబ్, సర్దార్ పాపారాయుడు వంటి ఎన్నో చిత్రలకు మాటలు అందించారు.

తన కథలకు అవార్డులు, రివార్డులు అందుకున్న పాలగుమ్మి పద్మరాజు గారికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం కూడా లభించింది. ఫిబ్రవరి17, 1983 తేదిన మరణించిన పద్మరాజుగారికి తెలుగు సాహితీలోకంలోనే ప్రపంచస్థాయిలో కూడా ఉన్నతమైన గుర్తింపు ఉంది. అలాంటి మహోన్నతమైన రచయితని జ్ఞాపకం చేసుకుంటూ, వారికి నివాళులను అర్పించుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

### చాసో గారి కథ "బండపాటు"

విజయనగరం అందించిన సాహితీపరులలో గురజాడ తరువాత వచ్చిన ముఖ్యమైన వారిలో అగ్రగణ్యులు చాగంటి సోమయాజులుగారు. 'చాసో' గా ఆయన అందరికీ పరిచితులు.

'కథాశిల్పి, 'తెలుగు కథకు తూర్పు దిక్కు', 'కథకులకు కథకుడు' అన్నారు చాసోని. ఆయనకు ఎన్ని బిరుదులిచ్చినా తక్కువే. సుమారు ఒక యాభై ఏళ్ళ సాహితీజీవనంలో ఆయన రాసిన కథలు సుమారు డెబ్బై మాత్రమే. అయితే ప్రతీ కథా, ఒక ఆణి ముత్యమే. అన్నీ వైవిధ్యమున్న కథలే. ఆయన రాసిన కొద్ది కథలు ప్రచురితమైన తొలిరోజుల్లోనే, ఆయనకు గొప్ప కథకుడిగా పేరొచ్చింది.

చాసోగారి కథల్లో రచయిత వ్యాఖ్యానాలు, పాఠకుడికి విడిగా అందిచ్చే మెస్సేజ్‌లేమీ ఉండవు. కథ చదివి పాఠకుడు మిగల్చుకునే ఆలోచనే ఆయనిచ్చే మెసేజ్. సంభాషణల్లో ఉత్తరాంధ్ర పల్లెజనాలు మాట్లాడుకునే యాస దొర్లుతుంది. చాసో గారు రాసిన చాలా కథల్లోని మాండలీకం అదే.

కొడవటిగంటి కుటుంబరావుగారు చాసో కథల శిల్పాన్ని సమీక్షిస్తూ ఇలా అన్నారు. "చాసో ఈ కథల ద్వారా ఆధునిక జీవితాన్ని వాస్తవదృష్టితో చూసి, చూపించాడు. ఈనాటి జీవితంలో గల కల్మషాన్ని కడగటానికి అవసరమైన అభ్యుదయ భావాలను పుష్కలంగా అందించారు. ఎక్కడా తిరోగమన వాదంతో రాజీపడలేదు, కళాస్రష్టగా అభూతకల్పనలు చేయలేదు, తాను ద్వేషించే అంశాలపై హద్దుమీరిన ఆవేశం చూపలేదు, తనకు సానుభూతి ఉన్న విషయాలను అందలాలెక్కించి ఊరేగించలేదు."

1968లో వెలువడిన చాసో కథలసంపుటానికి పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు రాసిన ముందుమాటలో అంటారు కదా "ఆయన కథలను చదివితే చాలదు, తిరిగి తిరిగి చదివి అధ్యయనం చెయ్యవలసినదే! ఎందుకంటే 'ప్రతి వాక్యం, ప్రయోగించిన ప్రతి పదము సాభిప్రాయంగా తూచి వాడబడతాయి" అని. పై ఇద్దరు ప్రముఖ కథకుల మాటలూ అక్షర సత్యాలు.

'ఎందుకు పారేస్తాను నాన్నా', 'కుంకుడాకు', 'రథయాత్ర', 'చిన్నాజీ', 'దమ్ములగొండె', 'కుక్కుటేశ్వరం', 'వాయులీనం' మొదలైన కథలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. ఇందులో 'ఎందుకు పారేస్తాను నాన్నా' అన్న కథలో హైస్కూల్లో చేరాలనే తపనతో తల్లడిల్లిపోయే ఒక కుర్రాడి పాత్ర, అలాగే 'కుంకుడాకు' కథలో గవిరి, సాహితీ ఉద్యానవనంలో వడలిపోని పూలు.

'ఎందుకు పారేస్తాను నాన్నా' అన్న కథ ఎలా రాసిందీ చెబుతూ, చాసో గారంటారు "కథ సామాన్య పాఠకులని ఉద్దేశించే రాస్తాము. ఈ కథను చదవవలసిన వారు సామాన్యులే.... కాని సామాన్యుడికి శిల్పం అవగతం కాదు. కథ బాగుంటే ఎందుకు బావున్నది సామాన్యుడికి తెలియదు. కథ ఎందుకు బాగులేనిది కూడా తెలియదు. సాహిత్యంలో నిష్ణాతులైన విమర్శకులు ఏ అభిప్రాయాన్ని ఇస్తారో.. ఆ అభిప్రాయమే సరియైనది అవుతుంది. వాళ్ళను మెప్పించేది, సామాన్య పాఠకుణ్ణి మెప్పించేది అయిననాడే రచన ఉత్తమ సాహిత్యమవుతుంది.... ముఖ్యంగా శ్రీ రోణంకి అప్పలస్వామిని మెప్పించి ఏ కథ రాసినా చాలు అనుకునే వాణ్ణి! అప్పట్లో అనగా ప్రారంభంలో, ఆయన మెచ్చుకోని కథ నేను ప్రచురించలేదు." అని. పాఠకుడికి తనను చదివించగలిగే కథని చదువుతున్నప్పుడు కథ ఎలా రాయబడిందీ అన్నది ఆలోచించడు. కథావస్తువు సులభంగానే అర్థమవుతుంది. కాని కథాశిల్పం "కథ ఎలా రాయబడింది?" అని బుద్ధిపూర్వకంగా రచయిత మస్తిష్కంలోకి తొంగి చూస్తేనే అర్థం అవుతుంది. సామాన్య పాఠకుడికి అది అనవసరం కదా! అందుకే చాసో గారు నిష్ణాతులైన విమర్శకుడి అభిప్రాయం కోరుకున్నది.

చాసోగారు రాసిన ఒక కథ 'బండపాటు'. ఇదొక చిన్న కథ. మొత్తం మూడు పేజీలకు మించి లేదు. బండపాటు కథ కూడా చాసోగారి రచనా పాటవత్వానికి ఒక మంచి ఉదాహరణ. ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే, కథ పూర్తయే సరికి మనమెంత మానవత్వంతో ఆలోచిస్తామనుకున్నా, చివరికి ఆర్థికావసరాలకు మనమెంత బానిసలమో, అసలు మానవత్వానికీ ఆర్థికత్వానికీ ఎంత దగ్గర సంబంధమో, ఒక్కసారి మన ఆలోచనా పరిధిలో మెరుపులా మెరుస్తాయి. కథని విడచి మనం దూరంగా పోలేం.

రామిగాడు బండరాళ్ళు కొట్టి బతికే రోజు కూలి. ఓ రోజు బండ ఒకటి దొర్లుకొచ్చి రామిగాడి తలకి తగిలింది, తల బద్దలైంది. శవాన్ని ఇంటికి తీసుకొచ్చారు. 'నానే సెర్లో పడ్డం దేముడో!' అంటూ పెళ్ళాం పార్వతి ఒకటే ఏడుపు. మేస్త్రీ సత్యం అన్ని ఏర్పాట్లూ చూస్తూ, ఏడ్చే మనుషుల్ని ఓదారుస్తున్నాడు, నాగన్న లాంటి తోటి కార్మికులని, ఆవేశపరులని శాంతపరుస్తున్నాడు. అంతకు ముందు రోజు కొండను కొన్ని చోట్ల బ్లాస్టు చేసి ముక్కలుగా చేసేరు. అయితే ఒక బండ దొర్లుకుంటూ వచ్చి రామిగాడి తలను తాకడం, దాని వల్ల తగిలిన దెబ్బకు వాడి బుర్ర ముక్కలవడం, 'పుణికెంలోంచి కొబ్బరిపువ్వులాగా మెదడు బైటకొచ్చేయడం, మోచెయ్యి తెగి రెండు గజాల అవతల పడడం', జరిగిపోయాయి. ఇలాంటి ప్రమాదాలు అక్కడ కార్మికులకు కొత్తేమీ కాదు. అదే ఏడు కనీసం అయిదారుగురు చనిపోవడం జరిగింది.

మేస్త్రీ సత్యం తన బాధ్యతగా శవానికి కావలసిన అన్ని ఏర్పాట్లూ చేస్తాడు. పాకలో కావససిన పానకం (సారా) కూడా ఏర్పాటు చేస్తాడు. ఆవేశంతో తప్పంతా కాంట్రాక్టరుదేనని, వాణ్ణి బెదరించాలని సత్యం మీద అరిచే నాగన్న లాంటి వాళ్ళకు కూడా కావలసినది అదే.

శవం బయల్దేరుతుంది. డప్పులు మొదలవుతాయి. పార్వతి (రామిగాడి భార్య) ఏడుస్తూ వెంటబడుతుంది. దాన్ని ఓదార్చి వెనక్కి తీసుకొస్తారు. శవం బయల్దేరనిచ్చి సత్యం వెనక్కొచ్చి పార్వతి చేతులో మూడొందల రూపాయలు పెట్టి, జాగ్రత్తగా మొల్లో దోపుకునే దాకా ఉండి బయటకొస్తాడు. కనకమ్మ పార్వతిని కనిపెట్టుకుంటానని చెబుతుంది.

డబ్బు పార్వతికి దక్కిందని తెలిసి రామిగాడి తల్లి చామాలు వారం రోజులు తిరక్కుండానే దిగి వచ్చింది. సత్యాన్ని తన వాటా ఏదంటూ నిలదీస్తుంది. సత్యానికి ఇలాంటి వాళ్ళనెందర్నో చూసాడు. పార్వతికొచ్చిన డబ్బు సంగతి సరే, చామాలు ఉంటున్న ఇంట్లో వాటా, ఆ కుండా మలకా ఉన్న వాటిట్లో కూడా రామిగాడికి రావలసిన భాగం, వాటి సంగతేమిటంటాడు సత్యం. మారు మాట్లాడకుండా అక్కడ నించి పరిగెడుతుంది చామాలు.

అంతకుమించి లేదు కథ. కాని రామిగాడి చావు ఏంచేసిందో చూడండి.

మేస్త్రీ సత్యం కాంట్రాక్టరు దగ్గరనుంచి అయిదువందలు తీసుకున్నాడు, అయితే పార్వతికి ఇచ్చింది మూడువందలే!

కనకమ్మకు తెలుసా సంగతి. అందుకే తన వాటాగా చీర అడిగింది. తప్పక, కొనుక్కోమంటాడు సత్యం.

మరి పార్వతో? '"నానే సెర్లో పడ్డం దేముడో!" అని కథంతా అవిసిపోయేలా ఏడ్చిన పార్వతికి రామిగాడు పోయేముందే ఇంకోడితో సంబంధం ఉంది. రామిగాడు పోయిన రెండో రోజుకల్లా పార్వతి గుడిసెలోకి మారిపోయాడు వాడు. పార్వతి మారు మనువాడింది. కొత్త మొగుడప్పుడే, వచ్చిన మూడువందలకు ఆవు కొనాలని, సంతలో బేరమాడుతున్నాడని కనకమ్మ సత్యం చెవులో వేసింది.

ఇహ మిగిలిన వాళ్ళా, "సత్తెం ఈ సావుకు బాగానే సేసిండు" అంటాడు ఓ ముసిలాడు కల్లు పాకలోంచి వస్తూ...

కథంతా మనకి కథలోని పాత్రల సంభాషణలే చెబుతాయి. సంభాషణంతా విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల్లో పల్లెజనాలు మాటాడుకునే యాస. సంభాషణలు కూడా చాలా క్లుప్తం, సామాన్యుడి ఆలోచనలను ప్రతిబింబించేటట్లుంటాయి.

ఒక బండపాటుకు ఒక మనిషి బలై పోతే, చుట్టుపక్కలున్న అందరూ, భార్యతో సహా, ఏ విధంగా ప్రయోజనం పొందడానికి చూస్తారో అన్నది కథా వస్తువు. ఆర్థిక అసమానత, అభద్రతా భావన, మనుషుల ఆలోచనల్లో క్షణాల్లో ఎన్ని మార్పులు తీసుకొస్తుందో నిక్కచ్చిగా చూపించారు. ఆర్థికంగా దిగువ తరగతి ఉదాహరణ తీసుకున్నా, సమాజంలో అన్ని వర్గాలవారికీ వర్తిస్తుంది. ఆయన సంభాషణలకు ఎంచుకున్న యాస, సంభాషణ, జనాల సాంఘిక పరిస్థితులను చూపించే అద్దం.

"నానే సెర్లో పడ్డం దేముడో!" అన్న నాలుగు మాటలే రామిగాడి భార్య పార్వతి మొత్తం కథ చివరికంటా అన్నది. అవే మాటలు ఎన్నిసార్లు అన్నా. శవం వెనకాల ఏడుస్తూ పరిగెడుతుంది అదే మాటలతో. ఆ మాటలలో నిజాయితీ ఉందా? కథ చివరి వరకూ అది పాఠకుల ఊహకే వదిలేసారు రచయిత. అయితే రచయిత పాఠకులకు ఒక సూచననిస్తారు.. రామిగాడు పోయిన రోజే మేస్త్రి సత్యం, కనకమ్మల మధ్య సంభాషణలలో అన్ని తెలిసిన కర్మయోగిలా, సత్యం అంటాడు .. "డబ్బుపోతే డబ్బు రాదు. వొయిసులో ఉంది. మరో మొగుడొస్తాడు."

సత్యం ప్రాక్టికల్ మనిషి. అటు కాంట్రాక్టరుని బెదిరించి డబ్బులు తేగలడు. ప్రమాదంలో మరణించిన రామిగాడి కుటుంబానికి దక్కినంతలో తక్కువిచ్చి అదే ఎంతో ఎక్కువనిపించేటట్లు చేసి తృప్తి పరచగలడు. అరచి గీ పెట్టే ఆవేశపరులకి ఏదిస్తే క్రిందకి దిగుతారో అంతకంటే తెలుసు. చివరికి కనకం నిలేస్తే దాని చీరకు డబ్బులిచ్చి దాని మూతి మూయించగలడు ఎట్లాంటి సంశయం లేకుండా.

ఎవరి స్వార్థం వాళ్ళది. ఎవరి ఆర్థిక పరిస్థితిని బట్టి, ఎవరి అవకాశాన్ని బట్టి, వాళ్ళా చావుని ఉపయోగించుకున్నారు. ఇదీ నిజ జీవితం. ఆ రోజుల్లో (ఇప్పటికీ కూడా..) ఆర్థికంగా నిమ్న స్థాయిలో ఉన్న కొన్ని కులాల్లో మారు మనువులు ఆమోదించబడ్డ ఒక ధర్మం – ముఖ్యంగా ఆడవాళ్ళకి. అది సామాజిక అవసరాల్ని బట్టి వచ్చిన సాంప్రదాయం. మధ్యతరగతి కుటుంబాల దగ్గరకి వచ్చేసరికి సామాజిక నిబంధనలు ఎక్కువయ్యాయి. దానివల్ల ఆయా సమాజాలలో కపటం, హిపోక్రిసీ లాంటివి కూడా ఎక్కువే అని చెప్పవచ్చు. ఈ కథను చదివే పాఠకులు ఆర్థికంగా కొద్దో గొప్పో ఉన్నవారే. ఎందుకంటే సాహిత్యం కేవలం ఆరోజుకి అన్నం కావాలనుకునే వాళ్ళకి మాత్రం కాదు. వాళ్ళకి కథలు చదివే తీరుబడీ, పుస్తకాలు కొనుక్కునే డబ్బూ ఉండవు. అందుచేతే, అర్ధాంతరంగా బలవన్మరణం పొందిన మనిషి చుట్టూ ఉండే వారందరూ ఆ మనిషి పోవడం వల్ల కలిగే లాభాల్ని అంత త్వరగా పొందాలనుకోవడం కథ చదివే వారికి తప్పకుండా షాక్ ఇస్తుంది. అయితే రెండు సమాజాలకీ తేడా అల్లా ఆ ఆలోచనల్లో కొద్ది రోజులు మాత్రమే.

మనుషుల ప్రవర్తనలు, అందులో వైవిధ్యాలు, సారూప్యతలు క్షుణ్ణంగా పరిశీలించిన మనిషి చాసో!!

**శాయి రాచకొండ**
హ్యూస్టన్ నుంచి

# వినదగునెవ్వరు చెప్పిన..

సముద్రతీరం కవర్ పేజీ గా వెలువడిన జూలై నెల సంచిక జన్మదిన సంచికగా వెలువడింది. రోజు రోజుకీ వర్ణశోభితంగా మారుతోంది. కథాభిమానుల సారధ్యంలో రెండు సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని మూడవ సంవత్సరంలోనికి అడుగుపెట్టింది. ఆ సందర్భంగా పలువురు ప్రముఖుల అభిప్రాయాలు, నిర్మాణాత్మక సూచనలతో వెలువడింది. అందులో, మెడికో శ్యామ్ గారు సంపాదక వర్గానికీ, పనిలో పనిగా నాకూ ఒక సలహా ఇచ్చారు. నిజమే... నాకూ నిజమే అనిపించింది. పాటించడానికి ప్రయత్నిస్తాను. అందుకే ఈసారి తక్కువ కథలను ఎంచుకుని సమీక్ష రాద్దామనుకుంటున్నాను. ఉన్న కథలలో నాలుగు మాటలు ఎక్కువగా చెప్పగలిగే అవకాశం ఉన్న కథలను ఎంచుకుంటాను.

క్రితం సంచికలకంటే ఈసారి కాస్త విభిన్న కథలు వచ్చాయనే చెప్పవచ్చు. ఉమాబాల గారి కథ "ఇది సమంజసమేనా". తల్లిదండ్రులు ఉద్యోగస్తులైన పిల్లల దగ్గరకు వెళ్ళడం – అక్కడ ఓ విధంగా చెప్పాలంటే పనిమనిషిగా అన్నీ పనులు చేయడం – పిల్లలకు వీరిపై కనీస సానుభూతి అయినా లేకపోవడం – మితిమీరిన పనిరీత్యా అనారోగ్యం పాలవడం – చివరికి తల్లిదండ్రులలో ఎవరో ఒకరు గట్టి నిర్ణయం తీసుకుని అక్కడ్నుంచి బయటపడటం – ఇదీ స్థూలంగా కథ. ఎన్ని వందల కథలు చదివి ఉంటాము.

కథల విషయంలో కొన్ని సంవత్సరాలు ఒక్కో సీజన్ నడుస్తుంది కాబోలు. ఎరుపు రంగు ఒక సీజన్, భూస్వాముల ఆగడాలు ఒక సీజన్, ప్రేమ పెళ్లి –మోసం ఒక సీజన్ ...అలా. ఇప్పటికీ తల్లిదండ్రులు, పిల్లలు, వృద్ధాశ్రమాల సీజన్... మొదలై చాలా కాలం అయింది. కొందరికి ఇప్పటికీ అదే సీజను నడుస్తుంది కాబోలు.

ఇలాంటి కథలు చదవడం మొదలు పెట్టగానే ముందు నా మైండ్ లోకి వచ్చేది జడ్జీల ప్రస్తావన. నా గట్టి అభిప్రాయం ఏమిటంటే కథల పోటీలకు జడ్జీలుగా వ్యవహరించేవారు ఈ కథాసాహిత్యానికి చేస్తున్న కీడు అంతా ఇంతా కాదని!! ఎప్పుడైతే విభిన్న కథాంశాలకు, విభిన్న పోకడలకు, ప్రయోగాలకు పట్టం కడతారో అప్పుడు 'పోటీల కొరకే' కథలు రాసేవారు.. అయినా కొత్తవి ప్రయత్నిస్తారు. (నిజమే! ఈ మాట తెలిసే అంటున్నాను. పోటీలు, బహుమతుల కొరకే కథలు రాసే వారు కొన్ని ఫార్ములాలు, కొన్ని ప్లాట్స్ ఎంచుకుని అటు తిప్పి ఇటుతిప్పి, వారికే ఉన్న నైపుణ్యంతో కథ రాస్తారు. విజయం పొందుతారు. ఈ మధ్య బహుమతుల కథల పేరుతో వచ్చిన సంపుటాలు చదువుతుంటే బహు పాత కంపు కొడుతున్నాయి!!)

ఇది పై కథ గురించి మాత్రమే కాదు. ఇప్పుడు వస్తున్న కథల గురించి నా అభిప్రాయం. అందుకే న్యాయనిర్ణేతలుగా వ్యవహరించే వారికి నా విన్నపం. రీడబిలిటీ ఒక్కటే కాకుండా సమాజ సమకాలీనతను, వివిధ దృక్కోణతను ప్రతిబింబించేలా కథా సాహిత్యానికి చుక్కానిగా ఉండాల్సిన భాధ్యత కష్టమైనా మీరు నెత్తికెత్తుకోవాల్సిందే!!

'మధ్యమావతి' కథ. ఈ కథకు ఈ పేరు ఎలా సరిపోయింది? బహుశా మధ్యతరగతి, మధ్యమావతి పదాలకు ప్రాసనో, యతినో కల్సినందుకేనా? ఇంతా లాక్కొచ్చి కథను మరీ పేలవంగా ముగించారు.

'యువకలం' బాగా నిరాశపర్చింది. కథారంభం, కథామధ్యమం, ముగింపు ... ఒక గోల్ తో సాగినట్లు అనిపించలేదు. కనీస హోం వర్క్ కూడా చేసినట్లు అనిపించలేదు. యువకలాలకు విస్తృత పఠనం, లో చూపు ఖచ్చితమైన అవసరమని వారికి 'వీలైనంత' కఠినంగా చెప్పాలనిపిస్తోంది. పేరు కంటే లోలోపల తండ్లాడుతున్న ముచ్చటను సరైన రీతిలో బయటపెట్టడమే అవధిగా రాస్తే చాలు అని అనాలనిపిస్తోంది.

ఒక కథ గుర్తుకు వస్తోంది. ఒక చిత్రకారుడు గురువు దగ్గర విద్య పూర్తి చేసుకుంటాడు. తను నేర్చుకున్నది పరీక్షించుకునే ఉద్దేశ్యంతో– ఒక చిత్రం గీసి కూడలిలో పెట్టి పక్కన ఒక కలం పెట్టి అందులో తప్పుగా అనిపించిన చోట గుర్తించమంటాడు. సాయంకాలం చూసేసరికి ఆ చిత్రం నిండా తప్పులు గుర్తించిన చిహ్నాలే!! అవమాన భారంతో మరలా గురువు వద్దకు వెళ్ళి విషయం చెబుతాడు. అప్పుడు ఆయన మరో సారి చిత్రం గీసి, ఆ పక్కనే మరో కాన్వాస్ ఉంచి గుర్తించిన తప్పులను సరిచేసి గీసి చూపమని అడగమంటాడు. అదే చేస్తే ఈ సారి ఒక్క తప్పును కూడా గుర్తించిన వారు ఉండరు.

ఇలా ఒక కథను రాయడం కంటే సూచనలు ఇవ్వడం, అభిప్రాయం చెప్పడం సులభమే. కానీ ఎదుగుదల కోరుకునే రచయితలు మాత్రం తప్పును సరిచేయకున్నా ఫరవాలేదు... నిక్కచ్చి అభిప్రాయం చెబితే చాలు అనుకుంటారు. అలాంటి వారి కోసమే నా ఈ మాటలు. మిగిలిన వారు పట్టించుకోనక్కర లేదు.

**రాంబో**

# జగమంత కుటుంబం

**చలపాక ప్రకాష్**



✆ 9247475975

***'నేను.. నా వాళ్ళు' అనే చట్రాన్ని బిగించుకున్నవాడెప్పుడూ బాధతో ఒంటరిగానే మిగిలిపోతాడు. అదే మన చుట్టూ వున్నవాళ్లంతా మనవాళ్లుగా స్వీకరించి, మంచి ఆశయంతో నడిచేవాడెప్పుడూ ఒంటరివాడు కాదు. జగమంతా తన కుటుంబమే"***

ఉదయం పదిన్నర గంటలు.

అది ఆ సందులో ఉన్న మొదటి మేడ. మేడమీద మొదటి అంతస్థులో పిట్టగోడ నుండి క్రిందికి చూస్తూ, ఆ వీధిలోకి వస్తూ పోతున్న వారిని పరిశీలనగా చూస్తున్నది శ్రావణి ఏమీ తోచక. అలా పోతున్న వారిలో ఏదో విషయంపై మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్న ఒక జంటపై ఆమె కళ్ళు నిలిచాయి. వారి నవ్వులో ఎంత స్వచ్ఛత. ఏమాత్రం కల్మషంలేని వారి మోములో భావాలు పరిపూర్ణంగా వికసిస్తున్నాయి. తన కూతురు తదేకంగా అక్కడ చూస్తూ ఆలోచిస్తున్న విషయాన్ని గమనించిన ఆమె తల్లి సంధ్య, కూతురి దగ్గరకు వచ్చి అడిగింది.

''ఏమిటే! అంత తీక్షణంగా చూస్తున్నావు?'' అని.

''ఆ వెళుతున్న ఆ జంటను చూడమ్మా! స్నేహితుల్లా ఉన్నారు. ఏమాత్రం కల్మషం లేకుండా ఎంత నిర్మలంగా... ఉల్లాసంగా మాట్లాడుకుంటున్నారో!'' అంది శ్రావణి.

ఆమె మాటకు పడి పడి నవ్వింది సంధ్య.

ఎప్పుడూ నవ్వు మొహం చూడని తల్లి అంతలా పడి పడి నవ్వడం చూస్తే ఆశ్చర్యమేసింది శ్రావణికి.

''ఎందుకలా నవ్వుతున్నావు మమ్మీ?'' అడిగింది అమె నవ్వు ఆపకపోయేసరికి.

''వాళ్ళని ఏమన్నావు?''

''ఫ్రెండ్స్''

''వాళ్ళు ఫ్రెండ్స్ కాదు?'' నవ్వు ఆపుకోవడానికి ప్రయత్నిస్తూ అంది.

''మరి.. అన్నా చెల్లెలా?''

దానికి అమె మరింత బిగ్గరగా, పొట్టచెక్కలయ్యేలా నవ్వింది.

''కాదు.. కాదు..'



''మరి..?''

''తండ్రి కూతుళ్ళు''

''హా!...''

''అవునే... వాళ్ళు తండ్రి కూతుళ్ళు''

''నీకెలా తెలుసు?'' ఆశ్చర్యంగా అడిగింది.

''వాళ్ళు మరెవరో కాదు మనకు దగ్గర బంధువులే. ఈ సందు చివర్న వున్న కాలనీలో ఉంటారు. ఆయనకి ఇద్దరు కూతుళ్ళు. ఈ అమ్మాయి పెద్దమ్మాయి. ఆయన పనిచేసే షాపు ఈ పిల్ల చదువుకుంటున్న కాలేజీ ఒక దగ్గరేనంట. అందుకే ఇద్దరూ కలిసి వెళతారు.''

''నిజంగా నమ్మలేకపోతున్నాను మమ్మీ... వాళ్ళు స్నేహితుల్లాగే ఎలా స్వచ్ఛంగా మాట్లాడుకుంటున్నారో చూడు''

''నిజమేనే... అతనికి ఇరవై ఏళ్ళకే పెళ్ళి చేసేసారు పెద్దవాళ్ళు. అందుకే చిన్న వయస్సులోనే అంత పెద్ద పిల్లలు. అదీ ఆడపిల్లలు కనుక త్వరగా ఎదిగిపోతారు''

''నిజమే కాని... ప్రతి ఇంట్లోని తండ్రీ పిల్లలు ఇలా... ఇంత ఫ్రీగా... స్నేహితుల్లా కలిసి మాట్లాడుకుంటారా...?''

''అందరూ అలా ఉండట్లేదు నిజమే. ఈ బిజీ ప్రపంచంలో తమ పనుల్లో తాము బిజీగా గడుపుతున్నారు గాని, ఇలా మనసు విప్పి స్వేచ్ఛగా మాట్లాడుకునే వారి సంఖ్య ఈ కాలంలో చాలా తక్కువేనే. నిజంగా అది వాళ్ళ అదృష్టమే!'' అంది సంధ్య.

అలా ప్రతి రోజూ... అదే సమయంలో... ఆ బిల్డింగ్ పిట్టగోడ దగ్గర నిల్చుని చూస్తూనే ఉంది శ్రావణి. ఆ ఇద్దరు తండ్రి కూతుళ్ళు భుజాలకు బ్యాగ్‌లు తగిలించుకొని మాట్లాడుకుంటూ నడిచిపోవడం అపురూపంగా, ముచ్చటగా రెప్ప వెయ్యకుండా చూస్తుంది. వాళ్ళ మాటల్లో పిచ్చాపాటితనం లేకుండా, మంచి చెడుల మధ్య విశ్లేషణాత్మకంగా సాగడం గమనిస్తోంది శ్రావణి. ఏ తలిదండ్రులైన పిల్లలకి అలవాట్లు నేర్పుతారుగాని, మంచి చెడులపై చర్చలు జరిపి, వారి ఆలోచనా పరిధిని, మానసిక పరివర్తనని పెంపొందింపచేసే దిశగా అవకాశం కల్పించరు. కాని వీళ్ళ మధ్య ఆ ప్రత్యేకతను తాను గమనిస్తున్నది.

కొద్ది రోజులు గడిచాయి. ఎప్పట్లాగే శ్రావణి తన పైఅంతస్తులో నుండి వీధి వైపు దృష్టి సారించింది. అతను, ఆమె ఎప్పటిలాగే నడిచిపోతున్నారు. కానీ అతను అతనే గాని, ఆమె – ఆమె కాదు. ఎవరీమె? ప్రశ్నార్ధకం?

''మమ్మీ.. మమ్మీ.. '' గట్టిగా పిలిచింది శ్రావణి వాళ్ళ అమ్మ సంధ్యని.

''ఏమిటే ఆ అరుపులు. ఏం కొంపలు మునిగిపోయాయని?'' వంటింట్లో పనిచేసుకుంటున్న సంధ్య, కూతురు హఠాత్తుగా పిలిచేసరికి చిరాకుగా అడిగింది.

''రోజూ ఇటువైపు వెళ్ళే అంకుల్, వాళ్ళ కూతురు కలిసి వెళ్ళేవారు కదా!''

''అవును!''

''ఆ అంకుల్ పక్క వాళ్ళమ్మాయి కాక మరెవరో కలిసి వెళుతున్నారేమిటి ?'' ఆశ్యర్యంగా అడిగింది.

ప్రతిరోజూ ఆ ఇద్దరి తండ్రి కూతుళ్ళని గమనిస్తున్న శ్రావణి కదలికల్ని పసిగడుతు అంచనా వేస్తోంది సంధ్య. ''ఆ అమ్మాయా... ఆమె అతని చిన్నకూతురు. పెద్దమ్మాయి పెళ్ళి అమెరికా అబ్బాయితో ఘనంగా అయిపోయిందీ మధ్య...''

''అమ్మాయి పెళ్లైపోయిందా... మనకి బంధువులన్నావు కదా. మనని పిలవలేదా?'' అడిగింది శ్రావణి.

''పిలిచారు... కాని మనం ఆ రోజు మీ అమ్మమ్మ వాళ్ళింటికి వెళ్ళాము కదా.. అందుకే వెళ్ళలేకపోయాం. అయినా వాళ్ళ గురించి అంత ప్రత్యేకంగా ఆరా తీస్తున్నావెందుకే?'' అడిగింది సంధ్య తన కూతుర్ని.

''వాళ్ళు అందరిలాంటి వాళ్ళు కాదు మమ్మీ.. వాళ్ళ అభిమానాల్లో ఏదో ప్రత్యేకత ఉంది'' అంది శ్రావణి.

''నువ్వు చెప్పింది నిజమేనే.. ఆ తండ్రి తన చిన్నతనం నుండి పడ్డ కష్టాలు ఎవరికి తెలుసు? ఆయన తండ్రి.. కుటుంబ ఆర్థిక అవసరాలరీత్యా ఇతడ్ని చిన్నతనంలో ఏడవ తరగతిలోనే చదువు ఆపేసి, చేతిపనిలో పడేసాడు. కాని అతను పని చేస్తూనే ఆదివారాలు ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బి.ఏ, తర్వాత ఎం.ఏ కష్టపడి చదివాడు. రాత్రి పగలు అనే తేడా లేకుండా కష్టపడి ఇల్లు కట్టుకొని తనతోపాటు, తన కుటుంబాన్నీ నిలబెట్టాడు. తనకు పుట్టింది ఇద్దరూ ఆడపిల్లలని తెలిసినా ఏమాత్రం లెక్కచెయ్యకుండా వాళ్ళు కోరిన రీతిలో చదువులు చెప్పిస్తున్నాడు. అంతేకాదు, అతనొక సామాజిక కార్యకర్త. తాను చదివిన చదువుకి సార్థకం చేకూరేలా సమాజానికి ఉపయోగేపడే విధంగా అందర్నీ ఎడ్యూకేట్ చేస్తున్నాడు. సమాజంలో మంచిని పెంచే విధంగా ప్రజలకి ఉపయోగపడే సలహాలిస్తూ మంచి గుర్తింపుని పొందాడు. ఈ రోజు అతను ఆశించకపోయినా అతన్ని తమ తమ సంఘాలలో గౌరవ పదవులిచ్చి, ఆయన ఉండడం వల్లే తమకు గౌరవం కలుగుతుందన్న భావం ఆయా సంఘాలలో కలగజేసే స్థాయిని అతను కలిగివున్నాడు!'' అతని గురించి తనకు తెలిసిన విషయాలు చెప్పుకుపోతుంది సంధ్య.

సామాన్యంగా ఎదుటి వారి గొప్పతనం గురించి చెబుతుంటే ఏ పిల్లలూ సరిగా వినరు. కాని శ్రావణి అతని గురించి తన తల్లి చెప్పే ప్రతి మాటని గుండెల్లో భద్రపర్చుకుంటున్నది. ఎందుకు అన్న కారణం... తెలీదు. అది అంతే!

ఆ రోజు కూడా అతన్ని, ఆతని కూతురుతో కల్సివెళ్లడం చూస్తూనే ఉంది. అతని గురించి తన తల్లి చెప్పిన మాటలు విన్న తర్వాత, అతనిపై ఆమెకు గల ఆరాధన భావం మరింత రెట్టింపయింది. తండ్రి కూతుర్లు కలిసి స్నేహితుల్లా వెళ్ళడం అనే మాట శ్రావణికి ఒక ప్రత్యేక అభిమానంతో కూడిన అద్భుత దృశ్యంగా తోస్తోంది. తాను ఆమెలా అతనితో కల్సి వెళితే... తల్చుకుంటేనే ఆ ఆత్మీయతారాగం మాటల్లో చెప్పలేనిదిగా అనిపిస్తోంది.

★★★

కొంత కాలం గడిచింది.

ఎప్పటిలాగే శ్రావణి మేడ మీదనుండి క్రిందకి చూస్తోంది... ఆ తండ్రి కూతుళ్ళ జంట కోసం! కాని దురదృష్టం, ఆ రోజు అతనొక్కడే ... ఏదో కోల్పోయినవాడిలా ఒంటరిగా వెళుతున్నాడు. ఎప్పుడు ఇద్దరిగా వెళ్ళే అతను, అలా ఒంటరిగా వెళ్లడం ఆమె మనస్సుకు చివుక్కుమనిపించింది. బాధతో గుండె విలవిలలాడింది. అల్లంత దూరాన్నుండి ఆమె కదలికల్ని గమనిస్తున్న ఆమె తల్లి సంధ్య ''ఏమైందే'' అంటూ ఆమె దగ్గరకు వచ్చింది.

''అదేమి మమ్మీ! ఎప్పుడూ ఇద్దరూ కలిసి వెళ్ళే ఆ అంకుల్, ఈ రోజు ఒంటరిగా వెళుతున్నాడు!'' అంది బాధగా శ్రావణి.

''ఆ అమ్మాయి కాలేజీకి శెలవు పెట్టిందేమో. అయినా దానికే నీకెదో అయిపోయినట్టు అలా బాధ పడిపోతావేమిటే?'' అంది సంధ్య.

''రోజూ అలవాటుగా చూసే కళ్ళకి వాళ్ళు కనబడకపోతే ఏదో వెలితిగా అనిపిస్తుంది మమ్మీ!'' అంది విచారంగా.

''నువ్వేమి దిగులుపడిపోకు.. రేపు మళ్ళీ వాళ్ళిద్దర్నీ కలిసి చూద్దువుగానిలే!'' అంది తన కూతురు వాళ్ళ బంధంపై కురిపిస్తున్న అనుబంధాన్ని చూసి ఆనందపడుతూ.

అలా రెండు, మూడు రోజులైంది. అతనొక్కడే అలా మూడీగా, విచార వధనంతో ఒంటరిగా పోతున్నాడు. అది చూసి శ్రావణి మనస్సు ఎదో తెలియని బాధతో విలవిలలాడిపోతోంది. ఏమైంది వాళ్లకు? ఇద్దరూ కలిసి వెళ్ళేవాళ్లు కదా.. ఇప్పుడెందుకు ఒంటరిగా ఒక్కడే పోతున్నాడు? ఏదో తెలియని ఆలోచనలు సుడులు రేపుతూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

తరువాత రోజు ఉదయం, ఎప్పటిలాగే ఆ జంట కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నది శ్రావణి. 'ఎప్పటిలాగా ఇద్దరూ కలిసి వస్తే బాగుణ్ణు. అతను ఒంటరిగా రాకూడదు. రాకూడదు.. రాకూడదు భగవాన్.' ఎప్పుడూ ప్రార్థించని భగవంతుణ్ణి మొదటిసారిగా మనసులో ప్రార్థించడం మొదలుపెట్టిందామె. ఇప్పుడు తాను చూసేది ఇద్దర్నీ కలిసి చూడాలి. అంతే! ఒంటరిగా కాదు. మనస్సులో బలంగా అనుకున్నది. కాని విషాదం.. అతనొక్కడే నడిచిపోతున్నాడు. ఆమెకు ఏడుపొస్తోంది. ఇద్దరిగా కలిసి చూసిన ఆమె కళ్ళు ఇప్పుడు ఒంటరిగా చూడానికి ఇష్టపడట్లేదు. కలిసి చూడాలనే ఆశ బలంగా నాటుకుపోతోంది. ఏమిది? తనకు ఏమైపోతోంది? ఆమెలో ఆమె అంతర్మధనం చెందుతోంది.

అప్పుడే వెనుక నుండి రెండు చల్లని చేతులు ఆమె భుజంగా ఆప్యాయంగా నొక్కి ఒదిలాయి. వెనక్కి తిరిగి చూసింది శ్రావణి. ఆమె తల్లి సంధ్య కూతురిపై వెనుక నుండి చేతులు వేసింది ప్రేమగా. ఆమె చేతుల్ని విడిపించుకుంటూ–

''మమ్మీ! ఆ అంకుల్ గురించి ఎంక్వైరీ చేస్తానన్నావు. అడిగావా?'' అంది బెంగగా.

''అదీ... అదీ..'' చెప్పడానికి తటపాయిస్తోందామె.

''ఏమైంది మమ్మీ!'' మరింత ఆత్రుతగా అడిగింది శ్రావణి.

''ఇకముందు వాళ్ళిద్దర్నీ ఎప్పుడూ కలిసి చూడలేం!'' అంది బాధగా.

''అంటే... ఏమైంది మమ్మీ? ఆ అమ్మాయికేమైనా అయ్యిందా?''

''లేదు''

''మరి...?'' మరింత ఆత్రుతగా అడిగింది శ్రావణి.

''అతన్ని ఒంటరివాడిని చేసి 'పోయింది''

''అర్థం కావట్లేదు మమ్మీ... అసలేమైందో చెప్పు?'' జీరబోతున్న గొంతుతో అడిగింది ఆమె.

''ఆ అమ్మాయి ఎవరో కుర్రాడిని ప్రేమించిందంట. ఎప్పుడూ తండ్రి మాటకు ఎదురుచెప్పని ఆ పిల్ల, అతన్ని లవ్‌మ్యారేజ్ చేసుకుని వాళ్ళని వదిలేసిపోయింది!'' చెప్పింది బరువుగా.

''అంటే.. అంటే.. ఆడపిల్లలైతే ఏంటి అని కొడుకుని కనడం మానుకుని, వాళ్ళు కోరిన విధంగా పెంచిన పాపానికి... అతన్ని ఒంటరిని చేసి పోయారన్నమాట... అతనికి తగిన శాస్తే జరిగింది!'' కసిగా అంటూ ఏడుస్తున్నట్లున్న కంఠంతో తల్లి ఒడిలో

తలదాచుకుని బావురుమన్నది. శ్రావణి చాలా సున్నితమైన పిల్ల. రోజూ తన చుట్టు ఉన్న ప్రపంచాన్ని చూసే ఇలా విలవిలలాడే, ఈ పిల్లలాంటి మనస్తత్త్వం ఈనాటి కాలం పిల్లలకి ఎంత మందికున్నది?

''మంచి వాళ్ళకి అంతా మంచే జరుగుతుంది. వాళ్ళకి దేవుడేమీ అన్యాయం చెయ్యడు. నువ్వేమి దిగులు పడకే'' కూతుర్ని సముదాయించింది సంధ్య.

ఆ రోజంతా శ్రావణి ఒక ముద్ద కూడా తిండి ముట్టలేదు. తల్లి ఎంత బ్రతిమిలాడినా మనస్సేమీ బాగోలేదంటూ అలా నిరసంతోనే నిద్రలోకి జారుకున్నది.

మరునాడు ఉదయం.. ఎప్పటిలాగే శ్రావణి మేడమీద నుండి కిందికి దృష్టి మరల్చింది. కాని ఇదివరకు కనిపించే ఆ జంట ఇక కనిపించదని తెలిసినప్పటి నుండి ఆ రోడ్డువైపు చూడాలనిపించట్లేదు. ఇక నుండి తాను వీధివైపు చూడకూడదని అనుకుంటూనే అప్రయత్నంగా అటువైపు చూసింది.

ఆశ్చర్యం! ఎప్పటిలాగా ఆ జంట. అతను అతనే. కాని ఆమె, ఆమె కాదు. మరొ కొత్త ముఖం.

''మమ్మా..మమ్మీ'' బిగ్గరగా పిలిచింది తల్లిని శ్రావణి.

నిన్నంతా ఏమీ తినకపోయినా అంత నీరసంలోనూ శ్రావణి అలా అరిచేసరికి ఏమైందో అర్థంకాక, పరుగు పరుగున వచ్చింది సంధ్య ''ఏమైందే'' అంటూ.

''ఆ అంకుల్ ఒంటరి కాదు. మంచివాళ్లకు మంచే జరగుతుందన్నమాట నిజమైంది మమ్మీ!'' అంది ఎంతో ఆనందంగా గంతులేస్తూ.

శ్రావణి ఎందుకలా అంటుందో అర్థంకాక సంధ్య పిట్టగోడమీంచి తన చూపును కింది రోడ్డుమీదకి చూసింది. క్రింద ఎప్పటిలాగే నడిచిపోతున్న జంటని చూసి, ఆశ్చర్యంగా చూసి నోరు వెళ్ళబెట్టింది.

''ఆ అంకుల్‌కి ఇద్దరే ఆడపిల్లలన్నావు? మరి ఈ పిల్ల ఎవరు?'' అడిగింది.

''ఆ అమ్మాయి అతని తమ్ముడి కూతురు!'' అప్రయత్నంగా ఆమె నోటి వెంట వెలువడ్డాయి ఆ మాటలు ఆనందంగా.

''చూసావా శ్రావణీ! 'నేను.. నా వాళ్ళు' అనే చట్రాన్ని బిగించుకున్నవాడెప్పుడూ బాధతో ఒంటరిగానే మిగిలిపోతాడు. అదే మన చుట్టూ వున్నవాళ్లంతా మనవాళ్లుగా స్వీకరించి, మంచి ఆశయంతో నడిచేవాడెప్పుడూ ఒంటరివాడు కాదు. జగమంతా తన కుటుంబమే.'' చెప్పుకుపోతుంది సంధ్య వేదాంత ధోరణిలో.

ఆ క్షణంలో శ్రావణి మనసులో అనుకుంది 'తానూ ఆ తండ్రికి కూతురినైతే ఎంత బాగుణ్ణు' అని. ఎందుకంటే తను చిన్నతనంలోనే ఇరిగేషన్ డిపార్టుమెంటులో ఉద్యోగం చేసే తన తండ్రి వరదల్లో కొట్టుకుపోతూ మరణించాడు. తండ్రిలేని లోటు తెలిసిన ఆ కూతురికి, జంటగా పోతున్న ఆ స్వచ్ఛమైన తండ్రి కూతుళ్ళ మనస్సులను చూసి మురిసిపోతోంది. తండ్రి కూతుళ్ళ అనుబంధం అంటే ఎలాగుండాలో చవిచూపించిన ఆ తండ్రి మనస్సుకు, మనస్సులోనే సలామ్ చెప్పుకుంటూ ''నాకూ అలాంటి నాన్న వుంటే బాగుణ్ణు మమ్మీ'' అంది శ్రావణి పొంగుకొస్తున్న దుఃఖాన్ని ఆపకుండా తన తల్లిని వాటేసుకుని కరిగిపోతూ!

# దిశా నిర్దేశం

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

కొత్తపల్లి రవికుమార్



9491804844

***దిశా చట్టాల్లాంటివి లక్ష తీసుకొచ్చినా భావిభారతానికి దిశానిర్దేశాలు చేయవు సార్! ఆ చట్టాలు చేసిన మంత్రే వాటిని పాటించనప్పుడు, ఆ చట్టాలు చేసిన మంత్రి కొడుకులకే వాటినుండి తప్పించుకునే లూప్‌లు తెలిసినప్పుడు ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా లాభం లేదు సార్! ఇలాంటి దారుణాలు చేసినప్పుడు అనౌన్స్‌మెంట్ ఇచ్చి మరీ బహిరంగంగా అందరూ చూస్తుండగానే నడిరోడ్డు మీద వాళ్ళ మర్మాంగవయవాలను కోస్తే ఇంకొకడు పట్టపగలు కూడా అమ్మాయి కేసి చూడడానికి గడగడలాడి పోతాడు సార్!***

జైలర్ చంద్రశేఖర్ సాయంత్రం డ్యూటీ ఎక్కాడు. తన ముందు జైలర్ ఇచ్చిన తాళాలు తీసుకుని ప్రతీ సెల్ తనిఖీ చేసుకుంటూ వెళ్తున్నాడు. హరి ఉన్న సెల్ దగ్గరకు వచ్చేటప్పటికి చంద్రశేఖర్ కాళ్ళు అన్యమనస్కంగానే ఆగిపోయాయి. రెండు నెలలుగా ఎవరితోనూ మాట్లాడకుండా తన గోడును, తనను బంధించిన జైలు నాలుగు గోడలకి చెప్తున్న హరిని చూసి, ఒక్కసారి తనతో మాట్లాడాలనిపించింది. తన సర్వీస్‌లో ఇలాంటి వాళ్ళను ఎంతో మందిని చూసాడు. కానీ హరిలో ఏదో కొత్త ఖైదీని చూస్తున్నాడు. అందుకే హరితో ఒక్కసారి మాట్లాడాలనిపించింది. హరిని పిలిచినట్టు సైగ చేసాడు. హరి వచ్చిన తర్వాత మాట్లాడడం మొదలుపెట్టాడు.

“ఏమయ్యా హరి! నిన్ను రెండు నెలలుగా చూస్తున్నాను. ఎవరితోనూ మాట్లాడవు. ఎవరితోనూ కలవవు. అన్నం కూడా సరిగ్గా తినట్లేదు. నీలో నువ్వే మధన పడుతున్నావు. ఎవరికీ అర్థం కావు. కానీ నిన్ను చూస్తే ఒక్కటి మాత్రం అర్థమవుతోంది. నువ్విలా బాధ పడుతున్నావంటే, నువ్వు చాలా సున్నితమైన మనస్కుడివి. ఇంత సున్నితమైన వాడివి ఈ రెండు హత్యలు ఎలా చేసావు? గుర్తుపట్టలేనంత ఘోరంగా వాళ్ళని ఎందుకు ముక్కలు ముక్కలుగా నరికావు?” అని అడిగాడు చంద్రశేఖర్.

“ఏమీలేదు సార్! నన్నేమీ అడక్కండి ప్లీజ్” అని చెప్పి సెల్ లోపలికి వెళ్ళి అటు తిరిగి పడుకున్నాడు హరి.

సర్వీస్‌లో ఎంతో మంది ఖైదీలను చూసిన చంద్రశేఖర్‌కి, హరి మాట్లాడడం కొత్తగా అనిపించలేదు. కానీ ఎలాగైనా హరితో మాట్లాడి అతని గతం తెలుసుకోవాలనుకున్నాడు.

తర్వాతి రోజు మరల హరి ఉన్న సెల్ దగ్గరకు వచ్చాడు, చంద్రశేఖర్. ఇంటి దగ్గర వండి తెచ్చిన క్యారేజ్‌ని హరికి ఇచ్చాడు, తినమని. హరి తినడానికి మొహమాటం పడుతుంటే “తిను హరీ! సందేహపడకు. అందులో ఏమీ కలపలేదులే” అన్నాడు చంద్రశేఖర్.

“కలిపితే ఏముంది సార్! హాయిగా నా ప్రాణాలు వదిలేస్తాను. బతికి ఏం సాధించాలి సార్!” అని అడిగాడు హరి.

“మరి ఏం సాధించాలని ఆ హత్యలు చేసావు?” అని అడిగాడు చంద్రశేఖర్.

“సార్! మీరు ఇన్నిసార్లు అడిగారని చెప్పట్లేదు. నాకు మీరు ఆత్మీయుడిగా అనిపించి చెప్తున్నాను. నేను మనసులో పడే బాధను కొంతైనా తగ్గించుకోవడానికి చెప్తున్నాను. నా గుండెలో రగిలే బడవాగ్నికి, నా గుండె పగిలిపోకుండా ఉండడం కోసం చెప్తున్నాను!” అని గతం చెప్పుకొచ్చాడు హరి.

★★★

మాది ఒక మధ్య తరగతి కుటుంబం. నాన్న ఒక టీచర్. అమ్మ హౌస్‌వైఫ్. వాళ్ళకి మేమిద్దరం కవల పిల్లలం. నేను, నా చెల్లెలు హరిత. ఉన్నదాంట్లో సంతృప్తిగా బతకడం నేర్పారు, మా అమ్మానాన్నలిద్దరూ. అందుకే ఎప్పుడూ ఆకాశానికి నిచ్చెనలు వేయలేదు. అందని వాటికోసం ఎప్పుడూ అడగలేదు. ఇద్దరం డిగ్రీలు చేసి గవర్నమెంట్ జాబ్‌లు సంపాదించాం. చిన్నప్పటి నుండీ ప్రతీ చిన్న విషయానికీ ఇద్దరం గొడవ పడేవాళ్ళం. అది నాక్కావాలంటే నాక్కావాలని కీచులాడుకునే వాళ్ళం. కానీ ఒక్క నిమిషం ఎవరు కనపడకపోయినా మరొకళ్ళు ఉండలేకపోయే వాళ్ళం. ఒకరి సీక్రెట్లను మరొకరికి దాపరికం లేకుండా చెప్పుకునేవాళ్ళం. మా ప్రేమని చూసి అమ్మానాన్నలు మురిసిపోయేవారు. 'మనం పోయినా, హరితకు ఏ కష్టం రాకుండా చూసుకుంటాడు' అని ఆనందపడేవారు. ఏ చీకూ చింతా లేకుండా హాయిగా ఉండేవాళ్ళం.

ఎప్పుడూ ఇద్దరం ఆఫీసులు ముగించుకుని కొంచెం అటో ఇటో ఏడింటికల్లా ఇంటికి వచ్చే వాళ్ళం. కానీ ఆరోజు ఎనిమిదిన్నరైనా హరిత ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్. హరిత ఫ్రెండ్స్ అందరికీ ఫోన్ చేసాం. ఎవరింటికీ రాలేదనేది వాళ్ళ నుండి వచ్చిన సమాధానం. అమ్మా నాన్న బాగా కంగారు పడుతున్నారు. ఆఫీసులో ఏదో పని ఉండింటుందిలే అని నేను వాళ్ళకి ధైర్యం చెప్తున్నానే గానీ, నాకూ మనసులో ధైర్యం సరిపోవట్లేదు. గబగబా బైక్ తీసుకుని బయల్దేరాను.. హరితను వెతకడానికి. అన్ని రోడ్లు వెతికాను. చివరగా ఒక రోడ్‌లో నాకు ఎదురైంది.



ఇంటికి వెళ్ళాక "ఎందుకు ఇంత లేటయ్యిందని" అడిగాము. "ఆఫీసులో పని ఉంది. అందుకే లేటయ్యింది " అని చెప్పింది హరిత.

ఎందుకో మొదటిసారి హరిత మాతో అబద్ధం చెప్తోందనిపించింది, ఎందుకంటే చిన్నప్పటి నుండీ నా చెల్లెల్ని ఈ కళ్ళతో చూస్తున్నాను. అయినా నేను హరితను ఏమీ అడగలేదు. రాను రాను తన తీరు ఇలాగే ఉంటోంది. నాకేదో కీడు శంకిస్తోంది. కానీ హరితను అడగలేదు. ఒక నెల తర్వాత ఒక రోజు ఆఫీసు నుండి చాలా త్వరగా వచ్చేసింది. "ఏంటి ఇంత త్వరగా వచ్చేసావు?" అని అమ్మ అడిగితే తలనొప్పి అని చెప్పి పడుకుంది. నేను ఆఫీసు నుండి వచ్చాక హరిత దగ్గరకు వెళ్ళాను. చాలా డిస్ట్రబ్‌గా కనబడింది.

"ఏమయ్యింది? అలా ఉన్నావు" అని అడిగాను.

వచ్చే కన్నీళ్ళని దిగమింగుకుంటూ "ఏం లేదురా? నన్ను కాసేపు ఒంటరిగా వదిలేయ్" అని విసుగ్గా అంది. ఇక నేనూ గట్టిగా అడిగే ధైర్యం చేయలేదు. ఏమున్నా తనే చెప్తుందిలే అనుకున్నాను. అదే నేను చేసిన తప్పయ్యింది. తెల్లారి లేచి చూసేటప్పటికి హరిత లేదు. ఇల్లంతా వెతికాను. ఎక్కడా కనపడలేదు. మళ్ళీ వచ్చి మా రూమ్‌లో కూర్చున్నాను. దిగులుగా అటూ ఇటూ చూస్తున్న నాకు పుస్తకాలపైన ఒక కాగితం రెపరెపలాడుతూ కనిపించింది. అది అందుకున్నాను. అది హరిత చేతి వ్రాతే. చదవడం మొదలుపెట్టాను.

"హరీ! ఈ విషయం ఎవ్వరికీ చెప్పకుండా వెళ్ళి పోదామనుకున్నాను. కానీ ఆత్మ వంచన చేసుకోలేక నీకు చెప్తున్నాను. ఈ ప్రపంచంలో నాకు ఆత్మీయ నేస్తం, నా మనసును అర్థం చేసుకున్న వాడివి నువ్వే. అందుకే నీకు చెప్తున్నాను. నీకు గుర్తున్నాడా, మన డిగ్రీ క్లాస్‌మేట్ కిషోర్! మన కార్పొరేటర్ రాజశేఖర్, ఇప్పుడు ఎంఎల్ఏ అయ్యి మినిష్టర్ కూడా అయ్యాడు. అతని కొడుకు కిషోర్! అప్పుడు ప్రేమ అని నా వెంట పడితే నువ్వు వాడిని కొట్టావు. ఉద్యోగంలో చేరిన తర్వాత మరలా ప్రేమంటూ

నా దగ్గరకు వచ్చాడు. మాయ మాటలు చెప్పి నన్ను నమ్మించాడు. నేను వాడి మాయలో పడిపోయాను. నా మనసుతో పాటు నా తనువును కూడా అర్పించాను. కొంత కాలం బాగానే ఉన్నాడు. ఆ తర్వాత వాడి ఫ్రెండ్స్ అమర్, ప్రసాద్‌ల కోరిక కూడా తీర్చాలని బలవంతం చేసాడు. నేను ఒప్పుకోలేదు. మనిద్దరం పడుకున్న దృశ్యాలు రికార్డ్ చేసాను, అవి అందరికీ పంపి నిన్ను నవ్వులపాలు చేస్తానని బ్లాక్‌మెయిల్ చేసి, వాళ్ళతో నన్ను పడుకోబెట్టాడు. అసలు విషయమేమిటంటే ఆ రోజు నువ్వు కొట్టిన దానికి పగ తీర్చుకుంటున్నాడట. ఈ రోజు మరల రాకపోతే వీడియో లీక్ చేస్తానని మళ్ళీ బెదిరించాడు. నేను ఏదో ఒకటి చేస్తాను. కానీ నేనిక తిరిగి రాను. వెళ్తున్నాను.

ఈ విషయం ఎవరికీ చెప్పలేక నాలో నేనే మథనపడ్డాను. నీక్కూడా చెప్పకపోతే నా మనసు అంగీకరించదు. అందుకే నీకు చెప్తున్నాను. ఈ చెడిపోయిన దాని కోసం వెతకకు. నేను ఎలాగూ పాడై పోయాను. నువ్వు ఇందులోకి దూరి సమస్యల సుడిగుండంలోకి దూకకు. అమ్మానాన్నలకి ఈ విషయం చెప్పకు. ఎవడితోనో లేచిపోయింది అని చెప్పు. అప్పుడు నా మీద అసహ్యంతో నా గురించి ఆలోచించరు. వాళ్ళని జాగ్రత్తగా చూసుకో!

మళ్ళీ జన్మంటూ ఉంటే నీకే చెల్లెలిగా పుట్టాలని ఉంది అన్నయ్యా! కానీ ఆ జన్మలో ఇలాంటి చెడు పనులు చేయనన్నయ్యా! నన్ను నమ్ము.

ఇట్లు

నీ హరిత".

ఇది చదివిన తర్వాత నా ఒళ్ళు ఒక్కసారిగా గగుర్పొడిచింది. ఆవేశంతో ఊగిపోయాను. బైక్ తీసుకుని హరితను వెతకడానికి బయల్దేరాను. అన్ని చోట్లా వెతికాను. ఎక్కడా హరిత జాడ కనపడలేదు. చివరికి ఊరి చివరనున్న మంత్రిగారి గెస్ట్‌హౌస్‌కి వెళ్ళాను. కొంతమంది జనంతో అక్కడ హడావుడిగా ఉంది. జనాన్ని దాటుకుని వెళ్ళాను. నా కళ్ళ ఎదురుగా నా హరిత మంటల్లో కాలిపోతోంది. దుర్మార్గుల చేతుల్లో దహనమయిపోతోంది. నా చెల్లెని కాపాడుకోవడానికి నేను శాయశక్తులా ప్రయత్నించాను. కానీ నా హరిత నా చేతుల్లోనే విగతజీవిగా మారింది సార్!

నా చెల్లెని నాకు కాకుండా చేసిన వాళ్ళని వెతికి వెతికి పట్టుకుని ఈ చేతులతోనే చంపాను. అమర్, ప్రసాద్ నా చేతిలో కుక్క చావు చచ్చారు. అసలైన నేరస్థుడు కిషోర్ తప్పించుకుని నన్ను పోలీసులకు పట్టించాడు. కానీ కిషోర్‌ని కూడా వదలను.

ఇది సార్! నా కథ.

★★★

"నేను చేసింది తప్పా సార్?" అని తన గతమంతా చెప్పి జైలర్‌ని గట్టిగా అడిగాడు హరి.

"ఏమీ తప్పు లేదు. ఇందులో ప్రధాన పాత్రధారుడైన కిషోర్‌కి కూడా ఉరిశిక్ష పడాలి. ఆ వీడియో హరిత నీకేమైనా పంపిందా? కిషోర్‌కి శిక్ష వేయడానికి ఆధారాలేమైనా ఉన్నాయా?" అని అడిగాడు చంద్రశేఖర్.

"ఆధారాలేమైనా ఉంటే చూపించే వాడిని కదా సార్! నా దగ్గర ఏ ఆధారాలూ లేవు. అందుకే వాడిని నా చేతులతోనే చంపుతాను!" అని ఆవేశంతో ఊగిపోయాడు హరి.

"ఏ ఆధారాలూ లేనప్పుడు కష్టం. కోర్టుకి కావాల్సింది సాక్ష్యాలు. ఆవేశాలు, ఆక్రోషాలు కాదు. రేపు కోర్టులో నీ కేసు విచారణ ఉందిగా! రేపు నీ వాదన వినిపించు. రెస్ట్ తీసుకో!" అని హరికి చెప్పి వెళ్ళిపోయాడు చంద్రశేఖర్.

★★★

కోర్టు టైమ్ అయ్యింది. జడ్జి గారు వచ్చారు. హరి కేసు విచారణకు వచ్చింది. "హరీ, హరీ, హరీ" అని మూడు సార్లు బంట్రోతు పిలవగానే హరి బోనులో నిలబడ్డాడు.

జడ్జి కేసు విచారణ మొదలు పెట్టమనగానే, అపోజిషన్ లాయర్ శంకర్ విచారణ మొదలు పెట్టాడు. "యువరానర్! ఈ ముద్దాయి అభం, శుభం తెలియని అమాయకులైన అమర్, ప్రసాద్‌లను అతి కిరాతకంగా చంపి ముక్కలు, ముక్కలుగా నరికాడు. మంత్రి గారి కొడుకైన కిషోర్‌ని కూడా చంపాలని ప్రయత్నిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికాడు. వాళ్ళని చంపానని ఈ ముద్దాయే ఒప్పుకున్నాడు. ఇక ఈ కేసులో విచారణ అనవసరం. కాబట్టి సెక్షన్ 307 ఐపీసీ ప్రకారం ఉరిశిక్ష, సెక్షన్ 376–డి ఐపీసీ ప్రకారం యావజ్జీవ కారాగార శిక్ష వేయవలసిందిగా సవినయంగా కోరుకుంటున్నాను!" అని శంకర్ తన వాదన వినిపించాడు.

"లాయర్ గారూ! ఈ కేసులో చంపినవాడు ఒప్పుకోవడం ఒక్కటే పాయింట్ కాదు. అతను ఎందుకలా వాళ్ళని చంపాడో తెలుసుకోవడం కూడా ఈ కేసు ముఖ్య ఉద్దేశ్యం!" అని చెప్పి హరి వైపు తిరిగాడు జడ్జి.

"మిస్టర్ హరీ! వాళ్ళని అంత కిరాతకంగా ఎందుకు చంపావు? వాళ్ళని చంపేటప్పుడు సాటిమనిషి అని కూడా మానవతా దృక్పథం కలగలేదా? ఎందుకు ఇదంతా చేసావు?" అని అడిగాడు జడ్జి.

జైలర్ చంద్రశేఖర్‌కి చెప్పినదంతా జడ్జికి చెప్పాడు హరి.

"యువరానర్! ఇదంతా ఒక కట్టుకథ. అమర్, ప్రసాద్‌ల మీద ఉన్న పాత కక్షల కారణంగా వాళ్ళని చంపాడు. వాళ్ళ ఫ్రెండ్ అవ్వడం వల్ల కిషోర్‌ని ఇందులోకి లాగుతున్నారు. కిషోర్ అమాయకుడు. అతనికేమీ తెలియదు. కావాలనే కిషోర్‌ని ఇందులో ఇరికిస్తున్నారు!" అని చెప్పాడు శంకర్.

"నా చెల్లెలి మానంతో ఆడుకుంది ఈ కిషోరే సార్! ఆ అమర్, ప్రసాద్‌లతో కలిసి నా చెల్లి జీవితాన్ని పాడు చేసింది ఈ నీచుడే సార్!" అని ఆవేశంతో మాట్లాడాడు హరి.

"మిస్టర్ హరీ! కోర్టుకి కావాల్సింది ఆవేశాలు కాదు, సాక్ష్యాలు. ఆవేశపడినంత మాత్రాన పరిష్కారం దొరకదు!" అని హరిని వారించి జైలర్ చంద్రశేఖర్‌ని విచారించాల్సిందిగా ఆర్డర్ వేసాడు జడ్జి.

చంద్రశేఖర్ బోనులోకి రాగానే "ఈ చంద్రశేఖర్ గారు, నిజంగా జైలర్ కాదు. ఈ కేసుకు సంబంధించి అపాయింట్ చేయబడిన స్పెషల్ ఆఫీసర్. ఈ కేసులో కీలకమైన ఆధారాలు సేకరించమని, గవర్నమెంట్ అపాయింట్ చేసిన ఆఫీసర్!" అని అందరికీ చంద్రశేఖర్ గురించి చెప్పి కేసు విచారణ మొదలు పెట్టాడు జడ్జి.

"మిస్టర్ చంద్రశేఖర్! ఈ కేసుకు సంబంధించి మీరు సేకరించిన ఆధారాలేమైనా ఉంటే ప్రెజెంట్ చేయండి!" అని అడిగాడు జడ్జి.

"సార్! ఈ కేసును నాకు అప్పజెప్పిన తర్వాత నుండి సీరియస్‌గా ఆధారాలు సేకరించడానికి ప్రయత్నించాను. ఈ కేసుకి సంబంధించి అందరినీ ఎంక్వయిరీ చేసాను. నా ఎంక్వయిరీలో తెలిసింది ఒక్కటే సార్! ఈ హరి ఏ దురుద్దేశంతో కిషోర్‌ని ఇరికించాడో తెలియదు గానీ, కిషోర్ అమాయకుడు. కిషోర్‌కి, ఈ కేసుకి ఎలాంటి సంబంధం లేదు. హరి వాదిస్తున్నట్టుగా ఎటువంటి సాక్ష్యాలు లేవు!" అని చంద్రశేఖర్ పూర్తిగా తన నివేదికను చెప్పేలోగా హరి కల్పించుకున్నాడు.

"సాక్ష్యం ఉంది యువరానర్! మీరు అనుమతిస్తే కిషోర్ నీచుడని నిరూపించడానికి నా దగ్గర సాక్ష్యం ఉంది!" అని గట్టిగా అరిచాడు హరి.

జడ్జి సాక్ష్యాన్ని ప్రవేశపెట్టమనగానే, హరి నాన్న వీల్‌చైర్లో ఒక మనిషిని తీసుకొచ్చాడు. ఆ మనిషినే సాక్ష్యం అని చూపించాడు హరి. ఆ చైర్‌లో మనిషి శరీరం ఎనభై శాతం కాలిపోయి ఉంది. ఆ మనిషిని చూసి "ఎవరీ సాక్ష్యం?" అని అడిగాడు జడ్జి.

"నా చెల్లెలు హరిత సార్! ఈ కామాంధుల కామానికి బలైపోయిన అబల. ఇదిగో ఈ రోజు ఇలా శవచ్ఛవంలా ఉంది సార్! ఆ రోజు కొన ఊపిరితో ఉన్న నా చెల్లెని ఎవరికీ తెలియకుండా ట్రీట్మెంట్ చేయించాను. చనిపోయిందని అందరినీ నమ్మించాను. కిషోర్ తీసిన వీడియో తన దగ్గరే ఉంది. ఆ నీచుడి చేతుల్లో నలిగిన ఆడది ఇక్కడే ఉంది. ఆ అకృత్యానికి పాల్పడిన కిషోర్ ఇక్కడే ఉన్నాడు. నేనెందుకు ఇలా చేసానో, ఒక చెల్లికి జరిగిన అన్యాయానికి ఒక అన్నగా నేను రియాక్ట్ అయిన తీరు కరెక్టో, కాదో.. ఆ వీడియో చూసి మీరే చెప్పండి సార్!" అని అడిగాడు హరి.

ఆ వీడియో చూసిన తర్వాత కళ్ళు తుడుచుకుని "ఈ వీడియో చూసిన తర్వాత ఒక ఆడపిల్ల తండ్రిగా ఉద్వేగం వచ్చింది. ఒక మనిషిగా నా మనసు కకావికలం అయ్యింది. కిషోర్ మనిషేనా అన్న అనుమానం కలిగింది. చంద్రశేఖర్ గారూ.. ఇంత ఎవిడెన్స్ ఉన్నాసరే, ఇందులో సాక్ష్యాలేవీ దొరకలేదన్నారు!" అని అడిగాడు జడ్జి.

"అది నన్ను అడగండి సార్! నేను చెప్తాను. మొదటి రోజు జైలర్‌గా నా దగ్గరకు వచ్చి నా వివరాలు అడిగినప్పుడు, ఒక జైలర్‌గా అడుగుతున్నాడనుకున్నాను. ఈ జైల్ లో మా బాబాయ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. మంత్రి జైలర్‌ని ఎన్నోసార్లు కలవడం, మాట్లాడడం గురించి నాకు చెప్పాడు. అందుకే జైలర్‌కి అంతా నిజమే చెప్పినా మా చెల్లి చనిపోయిందని, సాక్ష్యాలు ఏమీ లేవని అబద్ధం చెప్పాను. ఈ జైలర్ మంత్రిగారి మనిషే. ఇద్దరూ కలవడం మీ జైల్ సిసి కెమెరాలు చూసుంటాయి కదా! వీడియో ఫుటేజీ తెప్పించుకుని చూడండి సార్!" అని అన్నాడు హరి.

ఆ ఫుటేజీ చూసిన తర్వాత "ఇంత కీలకమైన కేసులో మంత్రికి సహాయపడినందుకు చంద్రశేఖర్‌ని ఉద్యోగంనుంచి ఉద్వాసన పలకాలని పోలీస్ డిపార్టుమెంటుకి ఆజ్ఞ వేస్తున్నాము. సొంత చెల్లికి అన్యాయం జరిగినా, చట్టాన్ని తన చేతిలోకి తీసుకోకూడదు. కానీ ఈ ఉదంతం చూసిన తర్వాత హరికి సెక్షన్ 375 ప్రకారం ఏడేళ్ళు సాధారణ జైలు శిక్ష వేస్తున్నాము. ఇక ఈ ఘోరానికి సూత్రధారి అయ్యిన కిషోర్‌కి దిశా యాక్ట్ క్రింద సెక్షన్ 376–డి ప్రకారం యావజ్జీవ కారాగార శిక్ష వేస్తున్నాము" అని తీర్పు చెప్పాడు జడ్జి.

"వద్దు సార్! ఇంతటి దారుణాలు చేసిన ఇలాంటి పైసాచికులని జైళ్లల్లో పెట్టి, ముప్పూటలా మేపుతారనే వాళ్ళని నా చేతులతో చంపాను. ఇలాంటి వాళ్ళని అన్నాళ్ళు మేపకూడదు సార్! దిశా చట్టాల్లాంటివి లక్ష తీసుకొచ్చినా భావి భారతానికి దిశానిర్దేశాలు చేయవు సార్! ఆ చట్టాలు చేసిన మంత్రే వాటిని పాటించనప్పుడు, ఆ చట్టాలు చేసిన మంత్రి కొడుకులకే వాటినుండి తప్పించుకునే లూప్‌లు తెలిసినప్పుడు ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా లాభం లేదు సార్! ఇలాంటి దారుణాలు చేసినప్పుడు అనౌన్స్‌మెంట్ ఇచ్చి మరీ బహిరంగంగా అందరూ చూస్తుండగానే నడిరోడ్డు మీద వాళ్ళ మర్మాంగలను కోస్తే, ఇంకొకడు పట్టపగలు కూడా అమ్మాయి కేసి చూడడానికి గడగడలాడి పోతాడు సార్! అమ్మాయిని అంగట్లో దొరికే ఆటబొమ్మగా చూసే ప్రతీ రావణాసురుడి లాంటి రాక్షసుడికి ఇలాంటి శిక్షలే గుణపాఠాలు నేర్పుతాయి సార్. ఇలాంటి శిక్షలే ఈ కామాంధుల కామానికి బలైపోయిన ఎంతోమంది అభాగ్యుల ఆత్మలకు సరైన శాంతిని చేకూరుస్తాయి సార్! మన విద్యా వ్యవస్థలు కూడా మారాలి సార్. చిన్న తరగతుల నుండి పెద్ద తరగతుల వరకు ప్రతీ తరగతి పాఠ్యాంశాలలోను రామాయణ,

మహాభారతం లాంటి గ్రంథాలను చేరిస్తే సమాజం లోని అక్రమాలు కొంతవరకైనా తగ్గుతాయి. అన్ని వేదాలను చదివి, ఎంతో పాండిత్యం పొంది, ఎన్నో కఠోరమైన తపస్సులు చేసి ఆ పరమేశ్వరుడునే ప్రసన్నం చేసుకుని, లోకాన్నంతటినీ తన గుప్పిట్లో పెట్టుకున్న రావణాసురుడే ఒక ఆడదాని గురించి ఆలోచిస్తే మాడి మసైపోయాడని చిన్నప్పటి నుండీ నూరిపోస్తే, ఇలాంటి రాక్షసులు తయారవ్వరు సార్!" అని కోర్టు దద్దరిల్లేటట్టు అరిచి చెప్పాడు హరి.

"కూల్ మిస్టర్ హరీ! నువ్వు చెప్పేది నిజమే అయినా మనకున్న చట్టాల ద్వారానే మనమేదైనా చేయగలం. అయినా నువ్వు చెప్పినది కూడా బాగుంది. నీ ఆవేదనను సలహాగా తీసుకుంటూ హైకమాండ్‌కి పంపిస్తున్నాను. భవిష్యత్తులో నువ్వు చెప్పినట్టే జరగాలని కోరుకుంటున్నాను. ఇలాంటి కేసులకి ఇలాంటి తీర్పులే దిశానిర్దేశాలు కావాలని ఆకాంక్షిస్తున్నాను. నడిరోడ్డు మీద ఇలాంటి కామాంధులను కాల్చి చంపితే, అప్పటికైనా ఈ అరాచకాలు కొంతైనా తగ్గుతాయి. ఒక తండ్రిగా, మనిషిగా అలా జరగాలనే కాంక్షిస్తున్నాను. ఆడపిల్లలతో తోలు బొమ్మలాట ఆడుకునే ఇలాంటి కీచకులకి అలాంటి తీర్పులే రావాలి. కానీ ఇప్పుడున్న చట్టాలను దాటి మనమేం చేయలేని పరిస్థితి. ఆల్ ది బెస్ట్ హరి, హరిత! కోర్టు ఈజ్ ఎడ్‌జాయండ్" అని ముగించాడు జడ్జి.

ఒక్కసారిగా కోర్టు ఆవరణమంతా సైలెంట్ అయిపోయింది. అక్కడున్న అందరి మనసులు ఒకరకమైన భావోద్వేగంతో నిండిపోయాయి. హరి ముఖంలో మాత్రం విజయ దరహాసం తొణికిసలాడింది. నవ్వుతూ జైలుకి వెళ్తున్నాడు.. యుద్ధంలో గెలిచిన వీరుడిలా!

# శ్రమకు నీరాజనం

శ్రీమతి సోమూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ * సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ * శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022


సింగరాజు శ్రీనివాసరావు



✆ 9052048706


***"ఏంటయ్యా అల్లు ఊరక ఇచ్చింది, అది తెచ్చుక నువ్వు బాగుపడింది. కుడి సేతికి ఎయ్యి రూపాయలిత్తన్నారు, ఎడమ సేతి నుంచి పన్నులు పెంచి, సరుకుల రేటు పెంచి గుంజకపోతన్నారు! నీలాంటోడికి ఊరకొచ్చేదే కనిపిత్తది గానీ, ఎత్తకపోయేది కనపడకపాయె! అయినా పెబుత్వాలు పెద్దమనసుతో ఇకలాంగులకు, ముసిలోల్లకు, పూట గడవనోల్లకి సాయం కోసం ఉసితాలిత్తుంటే, నీలాంటోల్లు పెబుత్వాల మోసం సేత్తన్నారు. పాపం తగులతదయ్యా మీకు!"***

సాంబడికి ఒక్కగానొక్క కూతురు మైనాశ్రీ. పిల్ల మరీ మసిబొగ్గు కాదుగానీ, మెరుగు నలుపు. కనుముక్కు తీరు బాగుంటుంది. చూడగానే పిల్ల బాగానే ఉందిలే అనిపిస్తుంది. ఆ మాటంటే సాంబడు ఒప్పుకోడు. వాడి దృష్టిలో మైనాశ్రీ ఒక దేవకన్య. 'తన కడుపున పుట్టింది కాబట్టి ఈ కాలనీలో ఉంది. లేకుంటే ఏ సినిమా యాక్టరో అయుండేది' అంటుంటాడు అందరితో. ఎవరైనా 'ఈ జీడిగింజకు మొగుడు దొరకడమే కష్టం. దీని అందానికి సినిమా యాక్టరు కాదు, హోలు చిమ్మే పనిమనిషవుద్ది' అని ఎవరైనా వెటకారానికి అన్నా చాలు, ఆరోజు వాళ్ళకు మూడిందే. పైనుంచి కిందికి కడిగి వదిలిపెడతాడు. బూతుల పంచాంగం విప్పి తలదించుకునేలా చేస్తాడు. ఈ కాలం రాజకీయానికి బాగా పనికి వస్తాడు. అందుకే సాంబడి జోలికి తెలిసిన వారెవరూ పోరు. అసలు ఇంతకూ విషయమేమిటంటే వాడిప్పుడు మైనాశ్రీకి సంబంధాలు వెతుకుతున్నాడు. ఎలాగైనా సరే ఒక తెల్లతోలు అబ్బాయిని తెచ్చి కట్టాలనే పెద్ద పథకంలోనే ఉన్నాడు. అసలే అమ్మాయిలు తక్కువగా ఉన్నకాలం కనుక తన ఆశ నేరవేరుతుందని అనుకుంటున్నాడు.

"ఒరేయ్ బసవా..మన రంగడి మావ బంధువులబ్బాయి ఒకడు ఉన్నాడు కదా. ఆడు సూడ్డానికి దొరబాబు లెక్కుంటాడు. ఆడ్ని మన మైనాకిచ్చి కట్టబెడితే ఎట్టాగుంటది!" మనసులో మాట చెప్పాడు సాంబడు.

"అడుగుదాంలే అన్నా. ఆడు పెద్దగా సదువుకోలేదు. పనేదీ సెయ్యడు. కానీ ఆడినో పెద్ద లీడరంటారు ఊరంతా! ఆళ్ళ అయ్య ఎంకటేసు నాకు బాగా దోస్తు. నాకాడికొస్తే ఆడి గురించే సెబుతుంటాడు. ఎలచ్చన్లని, ఓట్లని, మీటింగులని ఇంటికాడే ఉండడట. అంతా బేవార్సుతనమే గానీ, కట్టపడి సంపాయించే మడిసేకాడట. అయినా సాంబన్నా .. మగోడికి అందమెందుకురా, మంచోడై కట్టపడి నాలుగురాల్లు సంపాదించుకుంటే సాలదూ. పిల్లను సక్కగా సూసుకునేవోడయితే మనకు దిగులుండదు కదరా!" బసవడు నలుగురు చెప్పే మాటే చెప్పాడు.

"ఓరి పిచ్చి బసవా, ఆరోజులు పోయినయిరా. ఇప్పుడంతా ఉచితమే కదా. నన్నే సూడు. నాకు అరవై వచ్చినాయని సెప్పి ఆధారకార్డు పుట్టించినానా.. నాకు నెలకు మూడువేలు పెన్షనొసద్ది. మాయావిడకి ఓ ఎకరం తొండలు గుడ్లెట్టే పొలం ఉన్నదా.. దానికి సాలుకి పదేను యేలు వసద్ది. తెల్లకార్డోల్లకిచ్చే సరుకులు వత్తాయి. అయి మనం తినలేమని ఆటిని అల్లకే అమ్మేత్తే నెలకో నాలుగుయేలు వత్తాయి. ఇక పిల్ల డ్వాకురాలో సేరింది. దానికీ కాత్తోకూత్తో కట్టక్కర్లేని డబ్బులొత్తాయి. ఇక మాయమ్మకి కూడ ఏరే ఉంటదని కార్డు పుట్టించినా. ఇంకముంది మాయమ్మకి కూడ మూడేలు పెన్సనొసద్ది. ఏ పార్టీవోడు మీటింగెట్టినా మేమంతా ఎల్తాము. మడిసికి బోజనం పొట్లమిచ్చి అయిదొందలు ఇత్తారు. ఇక పనిసెయ్యాల్సిన పనేందిరా బసవా. నువ్వంటే పొట్టి ఎర్రిబాగులోడివి గనక, నీతి, నిజాయితీ అంటా ఒక రేసను కార్డుతో బతకతుండావు. ఇప్పుడు సెప్పు నా యల్లుడు కట్టపడి పనిసెయ్యటం దేనికి. కాసంత నదురుగుంటే సాలదా. నా మైనా పక్కన నిలబడితే ఆడు ఈరోలా ఉండాల అంతే. ఆడు ఏం




సెయ్యకపోయినా నేను పోసిత్తా!" గర్వంగా చెప్పాడు సాంబడు.

"నీయన్ని నీటి మీద బుడగలన్నా. ఆడెవురో ఉసితంగా ఇత్తన్నారని సోమరిలా ఇయాల కూసున్నావు. రేపు ఖజానాల పైసలన్నీ అయిపోనాక ఆళ్ళు 'ఛూ..నాబొడ్డు' అని అన్నీ ఎత్తిపారేత్తే నీ గతేంటి? అన్నా కట్టపడే వాడికి ఏడయినా కూడేనన్నా. సోమరోడి బతుకు తెడ్డులేని నావన్నా, ఎప్పుడు మునుగుతదో తెలవదు! అందుకే అన్నా.. ముంతలో నీల్లని నమ్ముకోవాలే గానీ, మబ్బును నమ్మకోకూడదు!" అన్నాడు బసవడు.

"ఇదంతా సేతగానోడు సెప్పే మాటేగానీ, నువ్వు ఆ ఎంకటేశుతో మాటాడి ఈ సంబంధం ఖాయం చేసినావనుకో, నీకు మాంఛి ముంతకల్లు మాసం పోయిత్తా!" ఎరవేశాడు సాంబడు.

"ఇది మా అయ్యకు సెప్పు. నాక్కాదు. ఆడిలా నేను తాగుబోతోడ్ని కాదు. ఏదో అడిగావు గాబట్టి సేత్తా. అయినా మైనా కూడ నా సేతుల్లో పెరిగిందే కదా. దాని పెల్లంటే, నా కూతురి పెల్లే. ఇంతకూ దానికి ఇట్టమేమో అడిగినావా?"

"దానికేం తెలుసురా సిన్నపిల్ల. ఈ అయ్య ఎంత సెబితే అంతే!" గర్వంగా చెప్పాడు సాంబడు.

★★★

ఎలాగోలా వెంకటేశును ఒప్పించి వాడిని, వాడి కొడుకు వీరబాబును పెళ్ళిచూపులకు తీసుకువచ్చాడు బసవయ్య. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయి పోయాడు సాంబడు.

"ఎంకటేసు బావా.. పిలగాడు ఏం సదివాడేంటి"

"పదో కలాసు సదివాడు. ఆపైన సదవాలంటే ఊరు దాటీసి పోవాల. ఇంటో దానికేమో వల్లు సరిగానే ఉండదు. అందుకని పంపలా! అయినా మావోడికి సదువెందుకు సాంబయ్య బావ. మా కాలనీకి మావోడే లీడరు. ఎలచ్చనొచ్చిందంటే సాలు, అన్ని పార్టీలోల్లు మావాడి ఎనక తిరగాల్సిందే. మాకాడ మొత్తానికి ఎయ్యి ఓట్లు ఉన్నాయి. అయన్నీ ఈడు ఎంత సెబితే అంత. ఏడ మీటింగులెట్టినా జనాన్ని మవోడు తోలకపోవాలె, బిరియాని పొట్లాలు పంచాలె, ఓట్లు ఏయించాలె. అందుకని ఆల్లంతా మావోడి ఎంటా, ఎనక పడతారు! ఏమాటకామాట సెప్పుకోవాలి గానీ బావ, మావోడి సెయ్యి సానా లక్కీ తెలుసునా! ఆడు ఏ పార్టీ వోల్లకి వోటే ఏత్తే, ఆ పార్టీ గెలిసిపోద్ది. ఎంత లేదన్నా సాలుకు ఓ పది మీటింగులు ఉంటాయా, ఏదో ఒక ఎలచ్చను ఉంటదా, అన్ని కమీసన్లు కలిపితే ఈడికి ఏడాదికి ఓ రెండు లచ్చలొత్తాయి. ఇక పెద్ద ఎలచ్చనులొత్తే సాలు.. రోజుకు రెండేలు కల్ల జూత్తాడు! బావ నీ అల్లుడు పాడిగేదె. ఎంత పిండుకుంటే అంత!" కొడుకు గొప్పల గురించి కథలు కథలుగా చెప్పాడు వెంకటేశు.

'మరి బసవడేంటి అలా సెప్పిండు. ఈడుత్త పోరంబోకని, ఏ పనీ సెయ్యడని! బావ సూడబోతే.. వీరబాబు గురించి ఇంత ఇదిగా సెబుతున్నాడు! ఏదయితేనేం సెందురుడిలాంటోడు మా మైనాకి మొగుడయితే సాలు. ఆడు సంపాదించేదేంది. నేనే ఆడికి సంపాయించి పెడతా!' మనసులోనే అనుకున్నాడు సాంబడు.

"ఈటికేంగానీ అన్నా. మైనాని పిలిత్తే పెల్లిసూపులు అయిపోతయి కదా!" సోది వినలేక అడ్డమొచ్చాడు బసవడు.

ఇంతలోకి మైనాశ్రీని తీసుకుని రానే వచ్చింది సాంబడి భార్య వీరమ్మ.

"అదిగో బావా.. మా ఇంటి మాలచ్చి. దేవకన్నె లెక్కుంటది. మీ ఈరబాబుకి మాంచి జోడి!" సాంబడిలో ఆనందం.

"పిల్ల బానేవుంది గానీ, కాసింత నల్లపూసలాగుందే!" నసిగాడు వీరబాబు.

"ఓరి ఎర్రి యెదవా.. నలుపేంటిరా నలుపు. పిల్ల కల్లు సూడు సెక్రాల్లా ఉన్నాయి. పార్వతమ్మ తల్లి నలుపు గాదేంట్రా. ఎదవ వంకలు సెప్పమాక. ఒప్పేసుకో!" కొడుకును గిల్లి గొణిగాడు వెంకటేశు.

సాంబడు తిమ్మిని బమ్మిని సేసి సంపాయించగలడని వెంకటేశుకు తెలుసు. ఏదో కొడుకు గురించి గొప్పలు చెప్పాడు గానీ, తన కొడుక్కు ఏదీ పెద్ద చేతగాదని తెలుసు. ఎలాగోలా మైనాశ్రీని అంటగడితే అన్నీ సాంబడే చూసుకుంటాడని వెంకటేశు ఆశ.

తలవంచుకుని గంగిరెద్దులా తలూపాడు వీరబాబు.

"మైనా.. పిల్లగాడు నచ్చిండా నీకు?" కూతుర్ని అడిగాడు సాంబడు.

"నచ్చలే" తడుముకోకుండా చెప్పింది మైనా.

అందరూ ఒక్కసారి అదిరిపడ్డారు. ఎవరూ ఊహించని సమాధానమది.

"అదేందే అట్టాగనేసినావు. సుక్కల్లో సెందురిడిలాంటోడ్ని పుసుక్కున తీసేసినావు గదే!" బసవడు కల్పించుకున్నాడు.

"నీకేటయినా పిచ్చిబట్టినాదంటే? బంగారం లాంటి సమ్మంధం. ఎర్రగా బుర్రగా ఉన్నోడు ఇంటి ముంగిలి కొచ్చి మనువాడతానంటే ఏంటే నీ ఎకసెక్కాలు?" వళ్ళు మండుతోంది సాంబడికి.

"సాంబయ్య బావ. అదేదో సిన్నపిల్ల. తొందరడి మాట జారిందనుకో. దానికి మనం నచ్చసెప్పాల గానీ, అట్టా బెదరగొడితే ఎట్టా! కాసింత వైనం సెబితే అదే ఊ అంటది!" అనునయించబోయాడు వెంకటేశు.

"నాకు నిజంగానే ఇట్టం లేదు. ఎర్రతోలు అయితే ఏంటి కరక్క తాగుతామా? ఆడూ నీలాంటోడేనంటగా. పనేది సెయ్యకుండా నీలెక్కనే ఎవురు ఏది ఉసితంగా ఇత్తారా అని సూత్తాడంటగా. సేతిలో సెల్లట్టుకు పిచ్చి ఆటలేవో ఆడుతుంటడంట. రాములమ్మ సెప్పింది. నీకు నచ్చినాడేమో గానీ నాకు నచ్చలే!" అని మరో మాటకు ఆస్కారమివ్వకుండా లేచి లోపలికి పోయింది మైనాశ్రీ.

"మైనా.. మైనా.. ఓ పాలి నా మాట సెవికెక్కించుకోవే!" లేచి లోపలికి పోబోయాడు సాంబడు.

"ఏడికి పోతన్నావు. అది వద్దని మొకాన సెప్పింది కదా. ఇంకా ఏడికి!" భర్తను మధ్యలోనే ఆపింది వీరమ్మ.

"అదిగాదే" ఏదో చెప్పబోయాడు సాంబడు

"ఎంకటేసన్నా.. మాకున్నది ఒక్కతే పిల్ల! దానికిట్టం లేకుండా మనువు సేయడం మంచిది కాదు గదా! అయినా ఇంకోపాలి చెప్పి చూత్తాం. ఇయ్యాల్టికి తమరు..." మధ్యలోనే ఆపింది.

"సరేలే వదినా. దాన్ని కాత్త ఆలోసించుకోనీ.. సరే ఎంకటేసు పద! నాలుగు దినాలు ఆగినాక సూద్దాంలే!" అంటూ

వెంకటేశును, వీరబాబును తీసుకుని బయలుదేరాడు బసవడు.

వీరమ్మ మీద చిందులు తొక్కసాగాడు సాంబడు.

★★★

"ఏం సూసుకునే నీకంత నీటు. ఇంటికొచ్చిన సమ్మంధాన్ని ఎగిసి కాలితో తంతావా?"

"ఏం సమ్మంధమయ్యా అది. ఏ పనీ సెయ్యని సోమరిని కట్టుకుని నేనెట్టా ఏగాలి?"

"ఎందుకు దాని మీద ఎగరతావు. అదేం తప్పన్నది. మొగుడన్నాక కట్టపడి సంపాదించి పెల్లాన్ని పోసించాల. అంతేగానీ, నీలెక్కన పెబుత్వం ఏది ఊరక ఇసద్దా, ఏ దొంగ కార్డు పుట్టిద్దామా, ఎవుడి జెండా పట్టుకు తిరగదామా అని సూసేవాన్ని ఇట్టపడదు! ఏంటయ్యా ఆల్లు ఊరక ఇచ్చింది, అది తెచ్చుక నువ్వు బాగుపడింది. కుడి సేతికి ఎయ్యి రూపాయలిత్తన్నారు, ఎడమసేతి నుంచి పన్నులు పెంచి, సరుకుల రేటు పెంచి గుంజకపోతన్నారు! నీలాంటోడికి ఊరకొచ్చేదే కనిపిత్తది గానీ, ఎత్తకపోయేది కనపడకపాయె! అయినా పెద్దమనసుతో ఇకలాంగులకు, ముసిలోల్లకు, పూట గడవనోల్లకి సాయం కోసం పెబుత్వాలు ఉసితాలిత్తుంటే, నీలాంటోల్లు పెబుత్వాల మోసం సేత్తన్నారు. పాపం తగులతదయ్యా మీకు!"

"ఆపండయ్యా మీ గోల! నేను కట్టపడి పనిచేసేవోణ్ణి మాత్రమే సేసుకుంటా. ఆడు కూలోడయినా సరే. అయినా సంకలో మేకపిల్లనెట్టుకుని ఊరంతా పరిగెట్టినట్టు, నాంచారమ్మ అత్త కొడుకు వేణు బావ ఉన్నాడుగా. డిగ్రి సదువుకున్నాడు. సక్కగా పొలం పని సేత్తాడు. ఎవురి జోలికీ పోడు. ఏ సెడ్డ అలవాటూ లేదు. అత్తక్కూడ నేనంటే పేనం. అయ్యా నే సుఖంగుండాలంటే బావను సేసుకోవాల. నువ్వెల్లి అడుగయ్యా. నువ్వడిగితే అత్త ఎగిరి గంతేత్తది!"

చెల్లెలి మాట ఎత్తేసరికి ముఖంలో రంగులు మారాయి సాంబడికి.

చెల్లెలంటే ప్రేమేగానీ బావంటే గిట్టదు. అతనికి సంపాదించుకోను చేతకానివాడని, ఒక ఆసామినే నమ్ముకుని, ఆయన ఇచ్చింది తీసుకుని, బ్రతుకుతాడని చిన్నచూపు. వాడి కొడుకూ అంతే. అబ్బలాంటోడే వాడు. అందుకే ఆ సంబంధం ఇష్టంలేదు సాంబడికి.

"ఈరమ్మా. దానికంటే తెలవదు. నువ్వన్నా సెప్పొచ్చు గదే!" సాంబడి వేడుకోలు.

"ఎంకటేసు చెప్పినట్టు ఆడు నాయకుల కాడ బంట్రోతైనా, ఉసితాలతో ఊరేగతన్న నా బిడ్డ సేసుకోదు. రాయి కొట్టి రూకలు తెచ్చోటోడిని నమ్ముకోవచ్చు గానీ, ఇలాటి ఉసితాలను నమ్ముకుని బతికేటోడ్ని నమ్ముకుని బిడ్డనిత్తే, దాని బతుకు కుక్క తోక అట్టుక గోదారి ఈదినట్టే ఉంటది! ఇదిగో.. తలంతా నెరిసిపాయె. ఇంకా మంచేదో, సెడేదో తెలుసుకోలేక పోతే ఎట్టాగయ్యా. నీకో ఇసయం తెలుసునా. ఇన్నాల్లూ తనకాడ నమ్మకంగా పని సేశాడని వాల్ల ఆసామి నాలుగెకరాల పొలాన్ని యెవసాయం సేసుకోమని కమతం లేకుండా ఇచ్చాడట ఆ వేణు గాడికి. ఆడు సదువుకున్నోడు, కట్టపడేవోడు గనుక ఆ పొలంలో బంగారమే పండిత్తాడయ్యా. నాకా నమ్మకముంది!" వీరమ్మ కళ్ళల్లో ఆనందం.

"అయ్యా. నా మాట ఇను. నేనంటే నీకు పేనం. ఒకపాలి ఆలోసించయ్యా. సదువుకున్న పేరు సెప్పి పట్నానికి వోయి, ఉద్దేగం అంటూ పైసలు తగలెట్టేవోడి కన్నా, సొంత పల్లెలో యెవసాయం సేసుకునేవోడు గొప్పకదంటయ్యా. నా గురింసి నువ్వు మరిసిపోయి సంతోసంగా ఉండాలంటే నన్ను బావకిచ్చి సెయ్యి. లేకుంటే నీ ఇట్టం! ఎత్తుకెత్తుగా పెంచినవు. నీమాట

కాదననయ్యా. ఆ ఈరిగాడ్నే సేసుకుంటా!" తలవంచుకుంది మైనా.

సాంబదు ఆలోచనలో పడ్డాడు. వాళ్ళు అన్న మాటలను పదే పదే మననం చేసుకోసాగాడు. 'అవును. వాళ్ళు చెప్పింది నిజం. శ్రమే దైవం. కష్టాన్ని, నిజాయితీని నమ్ముకున్నవాడిని ఎవరూ చెరపలేరు. ఛ.. ఇంత వయసొచ్చి నాకంటే చిన్నోళ్ళ చేత చెప్పించుకోవలసి వచ్చింది!'

"సరే నే వత్తానే!" అంటూ బయలుదేరాడు సాంబయ్య.

"ఎక్కడికి" అడిగింది వీరమ్మ.

"ఇంకేడికి. నా సెల్లికాడికి. నా బంగారుతల్లిని, దాని కొడుక్కు సేసుకోమని అడగొద్దా!"

"అయ్యా" ఆనందంతో తండ్రిని చుట్టుకుంది మైనా.

"పిచ్చితల్లీ! నేను సెప్పిన సమ్మంధం కాదన్నావని, నిన్ను ఇంట్లోయెట్టి తాలమేసి, వేణుగాడ్ని సంపించదానికి, నేను డబ్బున్నోణ్ణి కాదమ్మా. పేమున్నోడిని. పేదోడికి పేమే పేనమమ్మా. నా తల్లి కంటే నాకేది ఎక్కవ కాదు!" అంటున్న భర్తను చూసి, మా ఆయన బంగారం అనుకుంది వీరమ్మ.

# శిక్ష

శ్రీమతి సోమూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ
శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022

నామాని సుజనాదేవి



✆ 7799305575

***ఇలాంటి వ్యక్తులకు ఉరే సరి అన్న ప్రజానీకం నిర్ణయాన్ని ఆమోదిస్తూ కోర్టు అతనికి ఉరి శిక్ష విధించింది. ఇలాంటివెన్నో జరుగుతూనే ఉన్నా నష్టం జరిగిన తర్వాతే న్యాయం గాని, ముందు జాగ్రత్త చర్యలే లేవు.***

"సారు! నా బిడ్డ... నా బిడ్డను.... నా బిడ్డ నాకు అప్పగించండి సారు... నా బిడ్డ కనబడత లేదు!" శోకంతో పూడుకుపోయిన కంఠంతో వినిపించిన మాటలకు ఉలిక్కిపడి తలెత్తి చూశాడు ఇన్స్పెక్టర్ సాయి మురళీకృష్ణ.

ఎదురుగా శోక దేవతలా నిలుచుంది ఒక మహిళ. ఆమె కళ్ళు ఏడ్చి ఏడ్చి వాచి పోయి ఉన్నాయి. మామూలు పల్లె జనం ధరించే ముతక చీర ధరించింది.

అనుమానంతో, "ఎప్పటినుండి కనబడటం లేదు. ఏ ఊరు మీది?" అని అడిగాడు.

"రామాపురం సారు" ఆమె చెప్పిన సమాధానం వినగానే తన అనుమానం నిజం కావడంతో ఉలిక్కిపడ్డాడు. కారణం కేవలం గత పక్షం రోజులుగా అదే గ్రామం నుండి ఆడపిల్లలు కనబడకుండా పోవడములో ఇది ఏడవ కేసు. అందరూ ఆడపిల్లలే మాయమైపోతున్నారు. ఇంటి నుండి బయటకు వెళ్లిన ఆడపిల్ల తిరిగి ఇంటికి చేరడం లేదు. గత పదిహేను రోజులుగా ఆ వూరి వాళ్ళకి, పోలీసులకి అందరికీ ప్రశ్నార్థకమై లోకాన్ని వణికిస్తున్న వార్త ఇది. ఇంతవరకు ప్రపంచానికి తెలియని మారుమూల పల్లెటూరు అయినా ఆ ఊరు పేరు ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కింది. ఆ గ్రామం లోనే కాదు, అది అంచెలంచెలుగా పై వరకు పాకి ఒక నిర్భయ కేసులా దేశాన్ని ఊపేస్తోంది. మహిళా సంఘాలు తెరపైకి వచ్చాయి. పై నుండి కూడా విపరీతమైన ఒత్తిడి వస్తోంది. కానీ అదేంటో కానీ ఎంతో తెలివిగల వాడని, చురుకైన వాడని పేరున్న సాయి మురళీకృష్ణ ఈ కేసులో ఏ చిన్న క్లూ కూడా సాధించలేక పోయాడు. ఎంత ప్రయత్నించినా ఈ కేసులో ఇప్పటివరకు ఏమాత్రం ప్రగతి సాధించలేకపోయాడు.

మొదటిసారి కేసు రిజిస్టర్ అయినపుడు ఆ అమ్మాయి కుటుంబీకులకు, వారి సంబంధీకులకు ఏవైనా గొడవలు ఉన్నాయేమోనని, ఆ అమ్మాయిని ఎవరైనా వేధిస్తున్నారా అన్న కోణంలో పరిశోధించాడు. కానీ ఎక్కడ అనుమానాస్పదమైన విషయం కనిపించలేదు. కానీ వెంటనే తెల్లవారేసరికి మళ్లీ అదే గ్రామం నుండి మరో అమ్మాయి మాయమైంది. ఇది ఒకింత ఆలోచించాల్సిన విషయమే. రెండింటికీ ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో ఆలోచిస్తుండగానే, మరో రెండు రోజులకు మరో అమ్మాయి. ఇలా కేవలం అమ్మాయిలు మాత్రమే అదే ఊరు నుండి పదిహేను రోజుల్లో ఆరుగురు మాయమయ్యారు. ఇది ఏడవ కేసు. ఎక్కడ ఏ మాత్రం క్లూ కూడా దొరకడం లేదు. ఎంతో అనుభవం ఉన్న, పై అధికారులతో ఎన్నో ప్రశంసలు అందుకున్న సాయి మురళీకృష్ణకి ఇది కొరకరాని కొయ్యలా తయారైంది. మొదట కుటుంబ సమస్య అనుకున్నది కాస్తా ఇందులో ఏమైనా ఇంటర్నేషనల్ ముఠాకు సంబంధం ఉందేమో అని, అమ్మాయిలని వేరే చోటికి రవాణా చేసే ముఠా అనుకుని ఆ వైపున కూడా పరిశోధన చేశాడు. కానీ అది కూడా కాదని తేలిపోయింది. ఇటీవల పవిత్రమైన యాదగిరి నరసింహస్వామి క్షేత్రం దగ్గర చిన్నపిల్లల్ని బలవంతంగా బ్రోతల్ హౌస్‌లో అమ్మేసి, వారితో చేయిస్తున్న దారుణాలను, వారిపై జరుపుతున్న హింస సంఘటనలను చూసి, అలాంటివారి ప్రమేయం ఏమైనా ఉందేమోనని, ఆ దిశలో కూడా పరిశోధన చేశాడు. కానీ అటువైపు కూడా ఏ చిన్న క్లూ కూడా దొరకక పోయింది. ఆడపిల్లల్ని పనిమనుషులుగా అమ్మేవారు, బ్రోతల్ హౌస్‌కి అమ్మేవారు, దుబాయ్ లాంటి పట్టణాలకు రవాణా చేసేవారు, మత్తు పదార్థాలు ఇచ్చి వారిపై అత్యాచారం చేసేవారు.. ఇలా



రకరకాల కోణాలలో పరిశోధించాడు. కానీ ఎక్కడ చిన్న క్లూ కూడా దొరకలేదు. ఇది కుటుంబ సమస్య కాదు కానీ, ప్రతి ఒక్క కేసుకి మరో కేసుతో సంబంధం ఉంది అనేది మాత్రం అర్థం అయింది. పల్లెటూరు కావడంతో సి సి కెమెరాలు లేవు. దీని వెనక ఒక వ్యక్తి ఉన్నాడా, ఒక ముఠానా.. అనేది కూడా ఇదమిద్ధంగా నిర్ణయించుకోలేక పోయాడు. కానీ ఒక ముఠా అయితే కొంతమంది కలిసి చేస్తారు కాబట్టి ఏ ఒక్కరి ద్వారా నైనా బయటపడే అవకాశం ఉండేది. కాబట్టి ఇది ఒక ముఠా చేసిన పని అని అతను అనుకోవడం లేదు. ఒకే వ్యక్తికి ఇలా చేయాల్సిన అవసరం ఏముంది? వారిని తీసుకెళ్లి ఏం చేస్తున్నాడు? అన్నది కూడా తెలియడం లేదు. అదే గ్రామం నుండి దాదాపు ఒక ఆరు నెలల ముందర కూడా ఒక అమ్మాయి అదృశ్యం కేసు రిజిస్టర్ అయింది. ఇప్పటి వరకు తేలలేదు. ఆ అమ్మాయి ఎవరు లేని అనాధ కావడంతో దాని గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. అది ఎవరూ పట్టించుకోక అలా మరుగున పడిపోయింది. ఇప్పుడు ఈ కేసులతో ఆ కేసు కూడా మళ్లీ వెలుగులోకి వచ్చింది. మీడియా మొత్తం పత్రికలలో, టీవీలలో ఈ వార్తలు పదే పదే ప్రసారం చేస్తూ టెన్షన్ క్రియేట్ చేస్తున్నాయి. పైనుండి కూడా ఒత్తిడి బాగా ఎక్కువైంది. అన్ని రకాల కోణాల్లో పరిశోధించినా ఎక్కడ చిన్న క్లూ కూడా దొరకడం లేదు సాయి మురళీకృష్ణ కి.

ఆమె కేసు రిజిస్టర్ చేసుకుని, "తప్పనిసరిగా త్వరలోనే కనుక్కుంటాను. ధైర్యంగా ఉండండి!" అని చెబుతూ ఆమెను పంపించి వేశాడు.

అతని ఆలోచనలన్నీ ఇటీవల ఇచ్చిన ట్రైనింగ్ వైపు వెళ్ళాయి. ప్రజలలో పోలీసులంటే, రక్షణకు అండగా ఉండే ఆత్మీయులుగా గుర్తింపుబడడానికి బదులుగా, పోలీసులు ప్రజలకు చేటు చేసే వ్యక్తులుగా పరిగణింప పడుతున్నారని, 'ఫ్రెండ్లీ పోలీస్' అనే నినాదంతో ప్రజలకు పోలీసులు దగ్గర కావాలని ట్రైనింగ్ ఇచ్చారు. సహజంగానే మంచి మనసు కలవాడైన మురళీకృష్ణ.. ఏ రకంగానైనా ఈ కేసును ఛేదించి, ప్రజలు భయపడకుండా వారి వెనక మేమున్నామని ధైర్యాన్ని కలిగించాలని వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు.

మురళీకృష్ణ ఆలోచనలో ఉండగానే ఆయన ఫోన్ మోగడంతో తీశాడు. ఇంటినుండి.

"ఏవండీ! పాప స్కూల్‌కెళ్ళి ఇంకా రాలేదు. ప్రతిరోజు నాలుగు గంటలకి వచ్చేస్తుంది కానీ ఇవాళ ఏడయినా రాలేదు. ఇంటికి తీసుకుని వచ్చే కార్ డ్రైవర్, అమ్మాయి స్కూలులో లేదని, స్కూల్‌నుండి గంట ముందే వెళ్లిపోయిందని చెప్పారట. ఇంత రాత్రి అయింది ఇంకా రాలేదు. నాకు ఏమీ పాలుపోవడం లేదు. మీరే టెన్షన్‌లో ఉన్నారు. మిమ్మల్ని ఇంకా టెన్షన్ ఎందుకు పెట్టడం అని ఇప్పటివరకు చెప్పలేదు. కానీ నాకు భయమేస్తుంది అండి. బయట పరిస్థితులు చూస్తుంటే భయం వేస్తుంది...." అటునుండి ఏడుస్తూ మాట్లాడుతుంది భార్య హిమజ.

ఒక్కసారి నిశ్చేష్టుడయ్యాడు మురళీకృష్ణ. అసలే కూతురు అంటే ప్రాణం అతనికి. అయినా పొరపాటున నిందితుడు తన బిడ్డను కూడా టార్గెట్ చేయలేదు కదా.. అనుకోకుండానే వణికి పోయాడు. కానీ ఆ గ్రామం కాదు కదా అనుకోగానే ఒక్కసారి కొంచం ధైర్యం వచ్చింది. అంతలోనే ఏమో ఇప్పుడు ఇక్కడే ఉంటే పట్టుబడతామని టార్గెట్ మరో వైపు తిప్పాడెమో. రాజ్యానికి రాజు అయినా, తను ఇన్స్పెక్టర్ అయినా ఏమైనా తన కూతుర్ని ఏమైనా చేస్తే తర్వాత ఎప్పటికో పట్టుకుని శిక్ష వేయించగలరు. కాని పొరపాటున తన బిడ్డకు ఏమైనా అయితే తిరిగి తీసుకు రాగలరా? ఆ ఆలోచనే వణికించింది. భయపడిపోయాడు. వెంటనే ఇంటికి బయలు దేరాడు.

ఇంటికి వెళ్లగానే అతని టెన్షన్ క్షణాల్లో మాయమైంది. కూతురు తన ఫ్రెండ్‌తో కలిసి స్కూల్లో జరిగే అన్యువల్ డే కి డాన్స్ ప్రాక్టీస్ వెళ్ళిందట. టీచర్ దగ్గర ఉండేసరికి, వారి వద్ద ఫోన్ లేక కమ్యూనికేషన్ చేయలేదంట. తర్వాత ప్రాక్టీస్ అయ్యేసరికి చాలా సమయం కావడంతో తన దగ్గర సెల్ కూడా లేకపోవడంతో డైరెక్ట్‌గా ఇంటికి వచ్చేసిందట. వెళ్లేసరికి కూతుర్ని హత్తుకుని ఏడుస్తుంది హిమజ. ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నాడు సాయి. ఈ పది నిమిషాల కాలం అతనిలో కొన్ని లక్షల ఆలోచనలు చెలరేగాయి. ఆలోచనల తీవ్రతకి అతను చలించి పోయాడు. ఒక్కసారిగా అంత ధైర్యం ఉన్న మనిషి కుదేలు అయిపోయాడు. ఇప్పుడు ఒక్కసారిగా హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నాడు, కానీ అతని మనసు ఆలోచిస్తూనే ఉంది. అందరికీ రక్షణ ఇచ్చే తను, ఒక్క పది నిమిషాలు కూతురు కనబడలేదంటే వణికి పోయాడు. కానీ అలా కొన్ని రోజుల నుండి కూతురు అదృశ్యమై ఎక్కడుందో, ఎలా ఉందో, అసలు బ్రతికి ఉందో లేదో తెలియని బిడ్డల గురించి వారి తల్లి, తండ్రి, ఆత్మీయులు ఎంత క్షోభను అనుభవిస్తున్నారో కదా! ఈ ఆలోచనలతో ఆ రాత్రి అతనికి అసలు నిద్ర పట్టలేదు.

ఒక వ్యూహం ఆలోచించాడు. స్టేషన్‌లోకి రాగానే ఒక నలుగురైదుగురు కానిస్టేబుళ్లను ఆ గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి తీసుకురమ్మని నియమించాడు. ఆ వేటలో భాగంగా రోజు ఒకరిద్దరు అలా తీసుకు వస్తూనే ఉన్నారు. ఆలోచనల నుండి తేరుకున్న మురళీకృష్ణ.. అందులో భాగంగా ఆ రోజు తన ముందు నిలబెట్టబడిన అనుమానితుడిని చూశాడు. మనిషి బాగా ధనవంతుడు లాగానే ఉన్నాడు. కానీ వణికిపోతున్నాడు .

“ఏమైంది?” అని అడిగాడు.

“ఈయన కొంచెం అనుమానాస్పదంగా వేరే వారి ఇంటి ముందు రాత్రి తిరుగుతుంటే తీసుకొచ్చాం!” అన్నాడు కానిస్టేబుల్.

అతనిని తమదైన రీతిలో ప్రశ్నిస్తే తేలిన విషయం ఏంటంటే.. అతనికి ఆ ఇంటిలో ఉన్న మహిళకు అక్రమ సంబంధం ఉందని. విషయం తెలియగానే గట్టిగా మందలించి వదిలిపెట్టాడు. చిరాకనిపించింది మురళీకృష్ణకి. వారం రోజుల నుండి ఇది దాదాపు ఐదు ఆరు కేసులు. అనుమానితుల లిస్టులో ఒకరు అక్రమ సంబంధం, ఒకరు దొంగ వ్యాపారం చేస్తూ అనుమానాస్పదంగా పట్టుబడడం, ఒకరు చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ పట్టుబడడం. అలాంటి చిన్న చితక కేసులు తప్ప ఈ కేసుతో సంబంధం ఉన్న ఒక్క క్లూ కూడా దొరకలేదు. రోజురోజుకు జారిపోతున్న ధైర్యాన్ని, సంకల్పాన్ని కూడ కట్టుకుంటూ, కృషితో నాస్తి దుర్భిక్షం అని నమ్మి అతను ఇంకా పరిశోధన తీవ్రం చేశాడు.

ఇంతలో కానిస్టేబుల్ ఒకతన్ని తీసుకొని వచ్చాడు. అతని బట్టలు మాసి మడతలు పడి ఉన్నాయి. వయసు పద్దెనిమిది నుండి ఇరవై మధ్యలో ఉంటుంది. అనాకారిగా ఉన్నాడు. అతని భుజానికి ఒక సంచి వేలాడుతుంది. ఇతను మా ఊరిలో కొంచెం అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని తీసుకువచ్చాము అని అన్నారు. అసలు ప్రశ్నిస్తుంటే ఒకదానికొకటి పొంతన లేని ఏదో పిచ్చి పిచ్చి సమాధానాలు. అసలు మనిషి, తెలివి గలవాడా, పిచ్చివాడా అనిపించింది. ఇలాంటి వాడికి ఈ కేసులతో సంబంధం ఉంటుందని ఊహించిన పోలీసుల మీద కోపం వచ్చింది మురళీకృష్ణకి. చిరాగ్గా అతన్ని తీసుకెళ్ళమని తల కిందికి

వంచి, చెబుతున్న మురళీకృష్ణ, ఎందుకో ఇలా తలెత్తి అతన్ని వెనక్కి తీసుకు రమ్మని గట్టిగా అరిచాడు. ఉలిక్కిపడ్డ కానిస్టేబుల్ అతనిని వెనక్కి తీసుకువచ్చాడు.

అతని సంచిని ఒకసారి కింద కుమ్మరించి ఏమున్నాయో చూడమన్నాడు. ఏదో చిన్న చిన్న గుడ్డ పీలికలు, గ్లాసు, సత్తు పళ్ళెం అలాంటి సామాను తప్ప అంతా అనుమానాస్పదమైనది ఏమీ కనపడలేదు. కానీ సాయి దృష్టి అతని చొక్కా మీద పడింది. దగ్గరకు వచ్చి పరీక్షగా చూసాడు. ఏదో అనుమానంతో అతన్ని తమదైన రీతిలో ప్రశ్నించారు. కష్టపడకుండానే చిక్కుముడి వీడిపోయింది. అందరినీ అలా మాయం చేసి హత్య చేస్తున్న అతన్ని పసిగట్టగలగారు. అందర్నీ తీసుకెళ్లి, మాయమైన అందరినీ చంపి పాతిపెట్టిన పాడుబడిన బావిని చూపించాడు. అక్కడ స్కూల్కి వెళ్లే ఆ పిల్లల పుస్తకాలు, వారి చెప్పులు అవన్నీ కూడా అక్కడ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఆరు నెలల క్రితం మాయమైన అమ్మాయిని పాతిపెట్టిన ప్రదేశాన్ని కూడా చూపించాడు. ఆ అమ్మాయి శరీరం మొత్తం ఎముకలుగా మారిపోయింది. ఈ విషయం క్షణాల్లో బయటకు పొక్కింది. తండోపతండాలుగా ప్రజలు అక్కడికి వచ్చి వారి పిల్లల దుస్థితి చూసి హృదయవిదారకంగా రోదించారు.

వారి పరిశోధనలో తెలిసిన విషయం ఏమిటంటే అతను పుట్టగానే తల్లి చనిపోయింది. తండ్రి మరో వివాహం చేసుకున్నాడు. మారుతల్లి, తాగుబోతు తండ్రి ఇద్దరు చిన్న పిల్లవాడని చూడక రాసలీలలు అతని ముందు చేసేవారు. దానితో అతనికి ఆమె మీద ఒకరకమైన అసహ్య భావము కలిగి, అది ఆడవారందరినీ ద్వేషించడానికి దారితీసింది. వారి నిరాదరణకు గురైన అతను, ప్రేమ రాహిత్యానికి గురై ముభావంగా మితభాషిగా, సైకోగా తయారయ్యాడు. తరువాత టీనేజ్‌లోనే అతను ప్రేమించిన అమ్మాయి కూడా అతన్ని మోసం చేయడంతో ఆడవాళ్ళపై ఒక రకమైన కసి కోపం ద్వేషం పెంచుకున్నాడు. ఆ క్రమంలో చెడు అలవాట్లకు గురయి ఆరునెలల కిందట ఒక అమ్మాయి స్కూ లుకి వెళ్తుంటే బలాత్కారం చేయబోయాడు. ఆమె ప్రతిఘటించడంతో, ఆమెను బలవంతంగా అనుభవించి గొంతు నులిమి చంపేసి పాడుబడిన బావిలో పడేసాడు. అది జరిగి ఆరు నెలలు అవుతున్నా ఎవరూ ఏ రకంగా అతన్ని పట్టుకోక పోయేసరికి అతనిలో ధైర్యం వచ్చింది. ఇక విజృంభించి ఎవరు అనుమానించరు అని, అలా స్కూల్కు వెళ్లే అమ్మాయిని మధ్యలో అదను చూసి, వారిని అతి కిరాతకంగా అనుభవించి ఆ తర్వాత అదే పాడుబడిన బావిలో పాతి పెట్టడం మొదలుపెట్టాడు. ఆ బావి ఊరికి చాలా దూరంలో ఉండడంతో అక్కడికి ఎవరూ రాకపోవడంతో ఆ విషయం బయటకు రాలేదు.

ఇప్పుడు ఇన్స్పెక్టరుకు అనుమానం ఎందుకు వచ్చింది? అంటే తలెత్తిన అతనికి వెళుతూ వెళుతూ అతని మొహంలో ఒక రకమైన పరిహాస పూర్వకమైన విజయగర్వంతో ఒక క్షణం వెలిసిన దరహాసంను అతను చూడగలిగాడు. అంతే కాదు.. అతని షర్టు మీద అక్కడక్కడ ఎండిపోయిన రక్తం మరకలు, అతని షర్టుకు చిక్కుకుపోయిన చిన్న గుడ్డ ముక్క, వెంట్రుకలు అతనిని ఆలోచింపజేసాయి. రెండు రోజుల కిందట ఫిర్యాదు చేసిన తల్లి చెప్పిన వాళ్ళ అమ్మాయి ధరించిన రంగు అది సరిగ్గా సరిపోయింది. అనుమానంతో సంబంధం లేకుండా అతని సంచిని గాలింపచేసింది. అందులో ఉన్న చిన్న చిన్న ఎనిమిది రంగుల గుడ్డ ముక్కలు సరిగ్గా అంతకుముందు మాయమైన అమ్మాయిలు ఆరోజు వేసుకున్న డ్రెస్ రంగులకు సరి పోవడంతో అతని అనుమానం బలపడింది. దోషి ఇప్పటికైనా తప్పించుకోలేదు. ఎంత తెలివైనవాడు అయినా ఎక్కడో ఒక తప్పు చేస్తాడు అన్నట్లు పరిశోధన చేసి పట్టుకోగలిగాడు.

తర్వాత ఇలాంటి వ్యక్తులకు ఉరే సరి అని కోర్టు అతనికి ఉరి శిక్ష విధించింది. ఇలాంటివెన్నో జరుగుతూనే ఉన్నా నష్టం జరిగిన తర్వాతే న్యాయం గాని, ముందు జాగ్రత్త చర్యలే లేవు.

# అనుకోని బంధం

శానాపతి (ఏడిద) ప్రసన్నలక్ష్మి



✆ 9492339499

*కథారవళి గ్రూప్‌లో "వాక్యం రసాత్మకం" అంశంపై జూన్ 2022 లో నిర్వహించిన పోటీలో ఉత్తమ కథగా ఎన్నికైన కథ"*

***మీకు పిల్లలు లేరన్న లోటుని మరిచిపోయి, మా అమ్మాయిని మీ అమ్మాయిగా స్వీకరించాలి. జీవితంలో అన్నీ పోగొట్టుకున్నా, ఒకటి మాత్రం మిగిలే ఉంటుంది. అదే భవిష్యత్తు! దాని భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుతారని మీ ఇద్దర్నీ కోరుకుంటున్నాను. భగవంతుడు దేనికోసం సృష్టించాడో, అది నెరవేర్చకుండా అర్థాంతరంగా వెళ్ళిపోకూడదు.***

ఒక పెళ్లి రిసెప్షన్ పార్టీ చాలా గ్రాండ్‌గా జరుగుతోంది!

"ఏమండీ తను నా చిన్ననాటి స్నేహితురాలు!" ఆ పార్టీలో వారికి కొద్దిదూరంలో కనిపించిన వాణిని గుర్తుపట్టి భర్తకు చూపిస్తూ చెప్పింది విజయ.

భార్య చూపించిన ఆమెను చూసాకా... ఎక్కడో చూసినట్టుగా అనిపించింది. ఎప్పుడు ఎక్కడ చూసాడో గుర్తురాక భోజనం చేస్తున్నంతసేపూ ఆలోచిస్తూనే వున్నాడు శ్రీకాంత్.

విజయ కూడా భోజనం కానిచ్చి... ఆమె దగ్గరకు వెళ్ళింది.

ఒకరికొకరు చూసుకుని చానాళ్లు అయిపోయిందేమో... ఎంతో ప్రేమగా ఒకరికొకరు హత్తుకున్నారు. ఎంతో అందంగా వుండే వాణి ముఖం ఏదో పాలిపోయినట్టుగా వున్నా, అప్పటి పోలికలు ఇంకా స్పష్టంగా కనిపిస్తున్నాయి. కుశలప్రశ్నలు అయ్యాక, ఆమెను తీసుకొచ్చి భర్తకు పరిచయం చేసింది.

దగ్గర నుంచి ఒకరినొకరు చూసుకున్నాక... ఇద్దరూ పోల్చుకున్నారు. ఆ వాణి ఎవరో కాదు, గతంలో తాను ఓ అమ్మాయిని చూడ్డానికి పెళ్లిచూపుల కోసం వెళ్లి, మరో అమ్మాయిని ఇష్టపడ్డాడు. ఆ అమ్మాయే వాణి. దానితో ఆ సంబంధం అవ్వలేదు గానీ, వాణి గురించి తర్వాత తెలిసింది.

కొన్నాళ్ళకు విజయతో పెళ్లైపోవడం... చాలా రోజుల తర్వాత మళ్ళీ ఇలా వాణిని చూడటం జరిగింది.

"బాగున్నారా?" ఆమెను అప్రయత్నంగా అడిగేసాడు.

వాణి తలూపుతూ బుర్ర దించుకుంది.

ఒకరికొకరు ముందే పరిచయం కావడంతో... "మీ ఇద్దరికీ ముందే పరిచయమా? వాణి మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా భర్తను అడిగింది విజయ.

"అవును విజయా! ఆ విషయం నేను చెప్పేకంటే, వాణి గారినే అడిగితే బాగుంటుందేమో!" అంటూ పక్కకు తప్పుకున్నాడు శ్రీకాంత్.

★★★



"ఆరోజు మా కజిన్‌ని పెళ్లిచూపులు చూడ్డానికి మీ వారు వచ్చారు. పెళ్లి కావాల్సిన మా కజిన్‌ని కాకుండా నన్ను ఇష్టపడినట్టు చెప్పారు. నా వెనుక ఉన్న గాథంతా తెలిసికూడా పెళ్లిచేసుకోడానికి ముందుకొచ్చిన వారి ఆదర్శానికి ముచ్చటేసింది. కానీ, నేనందుకు సిద్ధంగా లేనని చెప్పేసరికి, వారి దారిన వారెళ్లిపోయారు."

"ఆరిపోయిన నీ జీవితానికి వెలుగునిస్తానని ముందుకొచ్చిన వారిని మరెందుకు కాదన్నావు?" ఆశ్చర్యంగా అడిగింది విజయ.

"మావారు పోయిన గాయం నుంచి నా మనసింకా కోలుకోకుండానే మరో పెళ్లంటే... నేనేం చెప్పగలను? మావారి రూపం మా పాపలో చూసుకుంటున్న సమయమది. జీవితాంతం నాకు, దాని తోడు చాలనుకున్నాను. జరిగింది ఇంతే విజయా. మా పాప ఇప్పుడు ఎదిగింది. దానికిప్పుడు పదిహేనేళ్ళు. అచ్చం అది దాని నాన్న పోలికలోనే ఉంటుంది." అలా చెప్తున్న వాణి కళ్ళల్లో ఏదో ఆనందం, తృప్తీ స్పష్టంగా కనిపించింది విజయకు.

ఆ తర్వాత మరెన్నో చిన్ననాటి విషయాలు మాట్లాడుకున్నారు. వాళ్ళమ్మాయి చదువురీత్యా.. ఆ ఊరు వచ్చినట్లు చెప్పింది వాణి. ఫంక్షన్‌లో ఉన్న వాళ్ళమ్మాయిని పిలిచి మరీ చూపించింది. చూడ్డానికి ఎంతో అందంగా ఉంది.

"మాకు పెళ్లైన ఏడాదికే ఆడపిల్ల పుట్టిపోయింది. మళ్లీ పిల్లలు కలగలేదు. మా అమ్మాయే బ్రతికుంటే చక్కగా నీలాంటి కూతురు నాకూ ఉండేది!" అంటూ బాధపడింది విజయ.

అలా బాధపడుతున్న స్నేహితురాలు తప్పకుండా తనను ఆదుకుంటుందనిపించింది. తాను చేయబోయే సహాయానికి, ఆమెకు కడుపు శోకం లేకుండా ఓదార్చినట్టు కూడా వుంటుందనిపించింది వాణికి.

శ్రీకాంత్‌కి కూడా వాళ్ళమ్మాయిని పరిచయం చేసింది. అంతా కలిసి కాసేపు చక్కగా ముచ్చటించుకున్నారు.

వెళ్తూ వెళ్తూ, స్నేహితురాలు విజయతో ఓ విషయం బయటపెట్టి... వారిద్దరి గుండెలూ బరువెక్కేలా చేసింది వాణి.

"నా కూతురు గురించే నాకు బెంగ. నేటి పరిస్థితుల్లో దాని మంచీచెడ్డా చూసుకునే నమ్మకమైన మనుషులు కావాలి. ఒకప్పుడు మీవారు నా పాపకు తండ్రి స్థానాన్ని కల్పిస్తానన్నా నేనొప్పుకోలేదు. నాడు ఆ అవకాశాన్ని నేను చేజార్చుకున్నా! నేడు ఆ దేవుడే మీకిచ్చినట్టున్నాడు. మీకు పిల్లలు లేరన్న లోటుని మరిచిపోయి, మా అమ్మాయిని మీ అమ్మాయిగా స్వీకరించాలి. జీవితంలో అన్నీ పోగొట్టుకున్నా, ఒకటి మాత్రం మిగిలే ఉంటుంది. అదే భవిష్యత్తు! దాని భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుతారని మీ ఇద్దర్నీ కోరుకుంటున్నాను. భగవంతుడు దేనికోసం సృష్టించాడో, అది నెరవేర్చకుండా అర్థాంతరంగా వెళ్లిపోకూడదు. కానీ.. అమ్మగా నాకా అదృష్టం లేదు గనుక దయచేసి తండ్రి కూడా లేని నాకూతురికి తల్లీ తండ్రీ బాధ్యత మీరు తీసుకోరూ!" అంటూ వాణి ఎంతో ప్రాధేయతగా అడుగుతుంటే... అనుకోని ఆ బంధాన్ని మనస్ఫూర్తిగా స్వీకరిస్తూ, కళ్ళలో నీళ్ళు ఉబుకుతుండగా స్నేహితురాలి చేతిలో చేయివేసింది విజయ.

వాణికి బ్లడ్‌కాన్సర్ అనే చేదు నిజాన్ని జీర్ణించుకోలేక, ఇంటిముఖం పట్టిన ఆ దంపతులిద్దరికీ, ఆమె కూతురు తమకు అనుకోని బంధమై వస్తున్నందుకు జీవితంలోకి ఆహ్వానం పలకడానికి సిద్ధంగా ఉన్నారు.!

# డిగ్నిటీ ఆఫ్ లేబర్

పద్మ చిల్లరిగె



✆ 9820095399

*కథారవళి గ్రూప్‌లో "వాక్యం రసాత్మకం" అంశంపై జూన్ 2022 లో నిర్వహించిన పోటీలో ఉత్తమ కథగా ఎన్నికైన కథ"*

***అమ్మ అనే మాటలు "జీవితంలో అన్నీ పోగొట్టుకున్నా, ఒక్కటి మాత్రం మిగిలే ఉంటుంది. అదే భవిష్యత్తు. భవిష్యత్ మీద నమ్మకం పెట్టుకో. అద్భుతాలు చెయ్యచ్చు ! ఆ మాటలే నాలో పట్టుదల పెంచాయి.***
***"మీరెందుకు చావాలనుకున్నారు అంకుల్?" ఆ మాటలకి కళ్ళు విప్పి చూసాను.***

అడిగిన అబ్బాయికి దాదాపు ఇరవై సంవత్సరాలుంటాయేమో, అతనితో పాటే ఉన్న మరో ఇద్దరు అబ్బాయిల ముఖాల్లోనూ ఆత్రుత కనిపిస్తోంది.

పచ్చగడ్డి మీద పడుకొని ఉన్న నేను లేచి కూర్చున్నాను. నా బట్టల తడి నాకు తెలుస్తోంది. ఆ ముగ్గురి బట్టలూ తడిగానే ఉన్నాయి.

మొదట పలకరించిన అబ్బాయి నా చేతికి మంచి నీళ్ళ బాటిల్ అందించాడు.

గటగటా సగం నీళ్ళు తాగి, "బతకడం చేతకాక. నా కుటుంబానికి వారంలో కనీసం మూడు పూట్లైనా తిండి పెట్టలేని అసమర్థుడిని!" ముఖాన్ని చేతుల్లో దాచుకున్నాను.

"కృష్ణా, నేనూ వచ్చేసాను!" పరిగెత్తుకుంటూ వస్తూనే, చేతిలో ఉన్న డబ్బాని అందించాడు.

"అంకుల్, ముందు ఈ చపాతీలు తినండి. మా అమ్మ చాలా బాగా చేస్తుంది1" డబ్బా మూత తెరిచి, నా చేతిలో పెట్టాడు. "ఆ తర్వాత అన్ని విషయాలు మాట్లాడుకుందాము."

నేను ఆ చపాతీలు తినే వరకు వదిలిపెట్టలేదు కృష్ణ, మిగిలిన వాళ్ళు.

తింటూ నేను చెప్పిన నా కష్టాలని, నా అశక్తతని చాలా ఓపికగా విన్నారు వాళ్ళంతా .

నీళ్ళ బాటిల్‌లో చివరి బొట్టు నీటిని తాగేసి, ఆ బాటిల్‌ని దూరంగా విసిరికొడుతూ అన్నాను.

"ఈ బాటిల్‌లాగే నేనూ ఖాళీ అయిపోయాను. సంపాదించడం చేతకాని వాడినని నా భార్య, నావాళ్లు అందరూ నన్ను ఛీ కొట్టారు. వారి తిరస్కారం భరించలేక, ఇదొక్కటే మార్గం అనుకున్నాను. ఆఖరికి చావు కూడా నన్ను వద్దనుకుంది."

కృష్ణ మాట నోట్లో ఉండగానే నేను దూరంగా విసిరేసిన బాటిల్‌ని పరిగెత్తుకుంటూ వెళ్ళి తీసుకొచ్చాడు మున్నా.

"అంకుల్, ఈ బాటిల్ పనికిరానిది కాదు. మనం ఇంక పనికిరాదని పారేసిన ఈ బాటిళ్ళని వాడి, ఎన్నెన్ని వస్తువులు చేస్తారో తెలుసా... ఇప్పుడు మీరు వేసుకున్నఈ పోలియెస్టర్ షర్ట్ ఈ బాటిళ్ళ నుండి వచ్చిన పోలియెస్టర్ ఫైబర్ నుంచి చేసినదే. ఆ ఫైబర్‌ని ఉపయోగించి, నిత్యం మనం వాడుకునే ఎన్నో వస్తువులు, అదిగో అక్కడ కనిపిస్తున్న పెద్ద పెద్ద ప్లాస్టిక్ షీటు్లు, తాళ్లు, కొన్ని రకాలైన బట్టలు... ఇలా ఎన్నింటినో తయారుచేస్తున్నారు!" అన్నాడు కృష్ణ.

"ఇవన్నీ మీకెలా తెలుసు? ఇంత వివరంగా చెబుతున్నారు? అసలు మీరందరూ ఏమి చేస్తుంటారు?" ఆశ్చర్యంగా అడిగాను.

"అందరూ పనికిరావని పారేసిన చెత్తని ఏరుతుంటాము!" అప్పటి వరకు మౌనంగా ఉన్న వెంకట్ అన్నాడు.

"చెత్తనా?"

"అవును, చెత్తకుండీలో పారేసిన చెత్తను తీసుకుని, ప్లాస్టిక్, పేపర్, గాజు వస్తువులు, ఇళ్ళలో మిగిలిపోయిన అన్నం, రొట్టెలు, వాడేసిన కాఫీ, టీ పొడులు, ప్లాస్టిక్ సంచుల్లో వేసి, చెత్త కుండీల్లో విసిరేస్తారే.. అలాంటివి అన్నిటిని పోగుచేసి, తడి, పొడి వేటికి వాటిని విడదీస్తాము. రీ – సైకిల్ కి పనికొచ్చే ఈ ఖాళీ నీళ్ళ బాటిల్స్, కూల్ డ్రింక్ బాటిల్స్ లాంటివి విడిగా పెట్టి, శుభ్రం చేస్తాము." కృష్ణ నవ్వుతూ, "ఈ గిరి ఇంకా నేర్చుకుంటున్నాడు. చెత్త కుండీలో చెయ్యి పెట్టాలంటే భయపడుతున్నాడు!"

"ఈ పని చేయడం మీకు అసహ్యం అనిపించదా?" నేను ఇంకా ఆశ్చర్యం నుండి తేరుకోలేదు.

"అంకుల్... ఆకలి మనకి అన్నీ నేర్పిస్తుంది. ఇదిగో ఈ మున్నా, ఈ గిరి, వెంకట్, నేనూ... మేమందరమూ పిడికెడు మెతుకుల కోసం చెత్త కుండీల దగ్గర కుక్కలతో పోట్లాడిన రోజులున్నాయి. నాకు ఊహ తెలిసిన దగ్గర నుండి అమ్మ మాత్రమే తెలుసు. నాలుగు ఇళ్ళలో పనిచేసి, వారిచ్చిన అన్నం, చారుతో గడిపిన రోజులు ఎన్నో! తిండి లేక పస్తులున్నప్పుడు, మనల్నే దేవుడు ఇందుకిలా పుట్టించాడు అన్నప్పుడల్లా, అమ్మ "జీవితంలో అన్నీ పోగొట్టుకున్నా, ఒక్కటి మాత్రం మిగిలే ఉంటుంది. అదే భవిష్యత్తు. భవిష్యత్ మీద నమ్మకం పెట్టుకో. అద్భుతాలు చెయ్యవచ్చు" అనేది! ఆ మాటలే నాలో పట్టుదల పెంచాయి. ఏదైనా పని చేసి, అమ్మని సుఖ పెట్టాలి. అందుకే ఏ పని దొరికితే ఆ పని చేశాను. అప్పుడప్పుడు పాత పేపర్లు కొనే శంకర్‌తో పాటు అక్కడ ఉన్న బిల్డింగుల్లోకి వెళ్లి, ఆ ఇళ్లల్లోంచి పాత పేపర్లు, ప్లాస్టిక్ బాటిళ్ళు, గాజు సీసాలు తీసుకు రావడంలో సహాయం చేస్తుండే వాడిని. అలా నాకు తెలియకుండానే శంకర్ని గమనించసాగాను. ఒకరోజు పాత పేపర్లు కొనే శంకర్, తన దగ్గర చాలా పేపర్లు ఉన్నాయని, వాటిని సేఠ్ దగ్గరకి తీసుకెళ్లడంలో సహాయం చేయమని, నన్ను తనతో పాటే




దూరంగా ఉన్న మరో కొట్టుకు తీసుకెళ్ళాడు. శంకర్ కిలో పేపర్లకి నాలుగురూపాయిలు ఇస్తాడు. ఇక్కడ వాటిని కిలోకి ఎనిమిది చొప్పున ఆ సేఠ్‌కి ఇచ్చాడు. అలాగే ఈ ప్లాస్టిక్ సీసాలు, గాజు సీసాలు కూడా రెట్టింపు ధరకి ఇచ్చాడు. అన్నిటి కంటే ఈ ప్లాస్టిక్ సీసాలకి ఎక్కువ డబ్బులు వస్తాయని అప్పుడు తెలిసింది. కొద్దిగా కష్టపడి, శంకర్‌కి కాకుండా తిన్నగా ఆ సేఠ్‌కే ఇస్తే, ఈ శంకర్ కంటే ఎక్కువే ఇస్తాడు. రోజుకి కనీసం ఇరవై రూపాయలు సంపాదించచ్చు. ఆ పైసలు, నా పన్నెండు ఏళ్ళ వయసుకి ఎక్కువే అనిపించాయి. ఇలా చెత్త కుండీల దగ్గర పరిచయమైన నాలాంటి వారిని కూడ గట్టాను. ముందు ఒక సేఠ్‌కి ఈ బాటిల్స్‌ని ఇచ్చేవాళ్ళము. ఒకసారి ఈ పనిచేసే ఒక స్వచ్ఛంద సంస్థతో పరిచయం అయింది. ఆ సంస్థలో ఉన్న కుమార్ సర్ సలహాలతో, ఈ ప్లాస్టిక్ బాటిల్స్‌ని ఇంకా శుభ్రం చేసే విధానాలు నేర్చుకుని, మధ్యలో ఎవరూ లేకుండా , ఇప్పుడు

ఒక రీసైక్లింగ్ యూనిట్‌కి సప్లై చేస్తున్నాము. నా దగ్గర ప్రస్తుతం యాభై మంది ఈ పని చేస్తున్నారు. జనం ఎక్కువగా ఉండే సినిమాహాళ్లు, హోటళ్లు, బస్సు స్టాండు, పెద్దపెద్ద బిల్డింగులు సొసైటీలు... వాటి నుండి చెత్తని తీసుకొస్తాము. శుభ్రం చేసి, రీసైక్లింగ్ యూనిట్స్‌కి పంపిస్తాము. నా దృష్టిలో ఏ పనీ తక్కువ కాదు, ఎంత శ్రద్ధగా చేస్తున్నామనేది ముఖ్యం!" అంటూ ముగించాడు కృష్ణ.

"మీరూ మాతో పాటే రండి. కుమార్ సర్‌ని కలిస్తే, ఆయన మీకు తప్పకుండా సహాయం చేస్తారు." వెంకట్ అన్నాడు.

"మా అమ్మ మాకు చెప్పే మరో మాట 'భగవంతుడు మనని దేనికోసం సృష్టిచాడో! అది నెరవేర్చుకుండా, అర్థాంతరంగా వెళ్లిపోకూడదు!" అన్నాడు కృష్ణ .

"నిజమే కదా! మీరు చెయ్యవలసిన పని ఏదో ఉన్నట్లుంది. అందుకే ఇవాళ మీరు మా కళ్ళ బడ్డారు " అన్నాడు వెంకట్ నవ్వుతూ...

నేను కృష్ణ చేతిని, అందులో ఉన్న భరోసాని ఆసరాగా చేసుకుని పైకి లేచాను, రేపటి మీద ఆశతో .

# అపురూప వరమిది

నందూరి సుందరీ నాగమణి



✆ 9849989201

*కథారవళి గ్రూప్‌లో "వాక్యం రసాత్మకం" అంశంపై జూన్ 2022 లో నిర్వహించిన పోటీలో ఉత్తమ కథగా ఎన్నికైన కథ"*

***"నీ ఆలోచన సరియైనది కాదు పావనీ! భగవంతుడు దేనికోసం సృష్టించాడో! అది నెరవేర్చకుండా అర్ధాంతరంగా వెళ్ళిపోకూడదు! అయినా నీకు తెలియదని కాదు కానీ 'జాతస్య హి ధ్రువో మృత్యుః' అన్నారు. అందరమూ అక్కడికి వెళ్ళవలసిన వాళ్ళమే కదా, కాస్త ముందు, వెనుకగా..."***

దిగులుగా శూన్యంలోకి చూస్తూ కూర్చుంది పావని. ఉండి ఉండి ఆమె నేత్రద్వయం నుండి కన్నీరు వర్షిస్తోంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా గుండె పగిలినట్లు రెండు చేతులలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది. పదిహేను రోజుల క్రితం తనకు శాశ్వతంగా దూరమైన భర్తను తలచుకుని పొగిలి పొగిలి ఏడవసాగింది.

"అరె. గురూజీ... పావనీ మేడమ్..." కంగారుగా లేవబోయింది, పక్కనే ఆఫీసు గదిలోనే ఉన్న సుజాత.

ఆమె ఎదురుగా, ప్రశాంతంగా, ప్రసన్న వదనంతో కూర్చుని ఉన్న ఆనందరావు ఆమెను కనులతోనే వారించాడు.

"ఆమె మనసులో పేరుకున్న బాధ, వేదన కరగిపోనీయమ్మా. పావుగంట ఆగి వెళ్ళు..."

అయోమయంగా తలూపింది సుజాత.

పావుగంట తరువాత ఆమె వచ్చి చూసేసరికి, పావని నిస్త్రాణగా తన బెడ్ మీద పడుకుని ఉంది. ఆమె కన్నులు వాచి ఉన్నాయి. దుఃఖోధృతి తగ్గినప్పటికీ, గుండెల్లో నిండి ఉన్న బాధ తాలూకు ఛాయలు ముఖంలో ప్రతిబింబిస్తూనే ఉన్నాయి. అప్పుడే నిద్రపట్టినట్టుందామెకు. ఆమెను డిస్టర్బ్ చేయకుండా తలుపులు దగ్గరగా వేసి, బయటకు వచ్చేసింది సుజాత.

★ ★ ★

గంట తరువాత, మేలుకున్న పావని, వాష్‌రూమ్‌కి వెళ్ళి, ముఖం కడుక్కుని వచ్చింది.

"హమ్మయ్య, లేచారా మేడమ్? మీకు లంచ్ తెచ్చివ్వనా?" ఆదరంగా అడుగుతూ లోపలికి వచ్చింది, సుజాత.

వద్దన్నట్టు తలూపింది పావని.

"మీరు మందులు వేసుకోవాలి కదమ్మా! కాస్త తినేసి, వేసుకుంటే బాగుంటుంది కదా! ఉదయం టిఫిన్ కూడా సరిగ్గా తినలేదు మీరు! ఉండండి, వస్తాను..." అంటూనే కిచెన్ వైపు నడిచింది, సుజాత.

పళ్ళెంలో అన్నం, కూర వడ్డించి, చారు, పెరుగు ఉన్న వేరే గిన్నెలతో సహా ఒక ట్రేలో ఉంచుకొని పావని రూమ్‌లోకి వచ్చింది, సుజాత.

"ఆకలి లేదమ్మా!" నూతిలోంచి వచ్చింది, పావని స్వరం.

"కాస్త ఎంగిలి పడండమ్మా. నేను తినిపించనా పోనీ?"


"వద్దు, వద్దు... నేనే తింటాను..."

చేయి కడుక్కుని వచ్చి, మెల్లగా తినటం ప్రారంభించింది పావని.

"ఈ హోమ్‌లో ఇంచుమించు యాభై మంది పెద్దవారు ఉన్నారమ్మా. మీ పిల్లలు మిమ్మల్ని ఇక్కడ ఉంచటం మంచిదైంది. మీకు ఏ ఇబ్బందీ ఉండదు. మేమంతా మిమ్మల్ని చూసుకుంటాము. మూడేళ్ళ క్రితం ఆనందరావు గురువుగారు ఈ ఆశ్రమాన్ని తనతోనే ప్రారంభించారమ్మా. అయినవారు దగ్గరలో లేని పెద్దల బాధలు, ఆవేదన వారు కూడా అనుభవించినవే..." సుజాత చెప్పేది వింటూ, తింటున్న పావనికి పొలమారింది.

"అయ్యయ్యో! మీ పిల్లలు తలచుకుంటున్నారల్లే ఉంది..." గబగబా మంచినీరు త్రాగించింది సుజాత. పావని ముఖం మ్లానమైంది. ఇక చాలన్నట్లు పళ్ళాన్ని దూరంగా జరిపింది. నిస్సహాయంగా చూసి, కాసేపటి తరువాత ఆమెకు మందులు వేసి, తిరిగి ఆఫీసు గదిలోకి వచ్చేసింది, సుజాత.

★ ★ ★



"ఆవిడ తట్టుకోలేక పోతున్నారు గురూజీ. పిల్లలు తమతో తీసుకుని వెళ్ళినట్లైతే బాగుండేది!" నిట్టూర్చింది సుజాత.

"మళ్ళీ వచ్చి తీసుకుని వెళతానన్నారు కదమ్మా సుజాతా..."

"ఏమోనండీ... ఆవిడ ఒంటరిగా ఎప్పుడూ ఉన్నట్టు లేరండీ!"

"అదేనమ్మా. అలవాటు పడేదాకా మనమే కనిపెట్టుకుని ఉండాలి... ఒక స్త్రీ యొక్క బాధ, వేదన మరొక స్త్రీయే అర్థం చేసుకోగలదు!" వాత్సల్యంగా అన్నాడు ఆనందరావు.

"తప్పకుండా గురూజీ. నాకు అమ్మలాంటి పావని గారిని నేనే చూసుకుంటాను!"

★ ★ ★

తెల్లవారు ఝామున మూడున్నర గంటలకు తలుపు దబదబా చప్పుడవటంతో ఉలిక్కిపడి నిద్రలేచిన ఆనందరావు తలుపు తెరచి, ఆయాసంతో వగరుస్తున్న సుజాతను చూసి, "ఏమైందమ్మా?" అన్నాడు కంగారుగా.

జరిగింది తెలుసుకొని గబగబా పావని రూమ్ వైపు నడిచాడు.

మరో గంట తరువాత..

"అమ్మా, పావనీ! యాభై వసంతాలు దాటిన మీకు నేను ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆత్మహత్య మహాపాపమమ్మా. ఈ జీవితం దేవుడిచ్చిన వరం! దానిని అంతం చేసుకునే అధికారం మనకు లేదు..." అన్నాడు అనునయంగా.

"నేను జీవించి సాధించేదేముంది గురువుగారూ! నా భర్తతో పాటే అన్నీ పోగొట్టుకున్నాను. పిల్లలు ఉన్నా, లేనట్టే. విదేశాలలో స్థిరపడిన వారికి తమతో నన్ను తీసుకువెళ్ళే యోచన లేదు. ఇంక నేను ఎవరికోసం బ్రతకాలి?" గద్గద స్వరంతో పలికింది పావని.

"చాలా తప్పమ్మా. జీవితంలో అన్నీ పోగొట్టుకున్నా ఒక్కటి మాత్రం మిగిలే ఉంటుంది.... అదే భవిష్యత్తు!"

"హు! భవిష్యత్తు..." శుష్కమైన నవ్వొకటి పావని పెదవులపై మెదిలింది. "నాకు ప్రాణాధికమైన వ్యక్తి నన్ను వదలి వెళ్ళిపోయాక, ఇంకా ఈ లోకంలో నాకు పని ఏముంది గురువుగారూ? నేను కూడా వెళ్ళిపోవాలి, నా భర్తను చేరుకోవాలి!"

"నీ ఆలోచన సరియైనది కాదు పావనీ! భగవంతుడు దేనికోసం సృష్టించాడో! అది నెరవేర్చకుండా అర్ధాంతరంగా వెళ్ళిపోకూడదు! అయినా నీకు తెలియదని కాదు కానీ 'జాతస్య హి ధ్రువో మృత్యుః' అన్నారు. అందరమూ అక్కడికి వెళ్ళవలసిన వాళ్ళమే కదా, కాస్త ముందు, వెనుకగా..." ఆకాశం వైపు చూస్తూ అన్నాడు ఆనందరావు.

"మీకు తెలియదు గురువు గారూ. మాది ప్రేమ వివాహం. నాకోసం తన పెద్దలందరికీ వ్యతిరేకంగా పోరాడి మరీ నన్ను పెళ్ళాడారాయన. తన ప్రేమతో నన్ను పసిపాపను సాకినట్లు సాకారు. ఇప్పుడు నా నుంచి విడిపోతే ఏమిటి అర్థం? నేనెలా బ్రతకాలండీ!" దుఃఖంతో పూడుకు పోయింది, పావని గొంతు.

"నా భార్య కూడా అంతేనమ్మా! నాకోసం తన వారినందరినీ వదిలి వచ్చేసింది. మా ఇద్దరివీ తనువులే వేరమ్మా. ఆత్మ ఒక్కటే..." ఆయన కళ్ళు పరధ్యాసగా అయినాయి.

మౌనంగా ఉండిపోయింది పావని.

"విధికి కన్నుకుట్టి, మూడేళ్ళ క్రితం నా కుటుంబమంతా ఒకేసారి కరోనా మహమ్మారికి బలియైపోయారమ్మా! నేనెంతగానో ప్రేమించే నా భార్య, కొడుకు, కోడలు... అందరూ ఒకేసారి! ఇంకా విషాదమేమంటే నా కోడలు గర్భవతి కూడా... అందరినీ ఒకేసారి... నన్ను మాత్రం ఐసోలేషన్‌లో ఉంచి... హాస్పిటల్‌లో... అటునుంచి అటే... శ్మశానానికి... కార్పొరేషన్‌వారు..." ఆనందరావు బలవంతంగా దుఃఖాన్ని నియంత్రించుకోసాగాడు.

వింటున్న పావనికి తల తిరిగినట్టైంది. అప్రయత్నంగా లేచి నిలబడి, అతని చేయి పట్టుకుంది, ఊరడిస్తున్నట్టుగా...

★ ★ ★

ఆరు నెలల తరువాత పావని ఇద్దరు కొడుకులు ఇండియాకి వచ్చారు, తల్లిని తమతో తీసుకుని వెళ్ళటానికి.

"నేను మీతో రాలేనురా. ఇక్కడ నాకు చాలా పనులున్నాయి. కిచెన్ నిర్వహణ అంతా నేనే చూసుకుంటున్నాను. ఆఫీసు పనులలో సుజ్జీకి సహాయం చేయాలి. వారానికి రెండుసార్లు ఇక్కడి కొందరు ఇన్‌మేట్స్‌కి చదువు నేర్పాలి. చాలా పనులున్నాయి..." వారితో చెప్పేసింది పావని.

"ఆమెను ఇక్కడే ఉండనీయండి బాబూ! ఆవిడ ఇక్కడ మాత్రమే ప్రశాంతంగా ఉండగలరు!" చెప్పాడు ఆనందరావు.

"అవును అన్నయ్యా... ఆ మొక్క ఇక్కడ చక్కగా వేళ్ళూని, నిలదొక్కుకుంటూ పెరుగుతోంది. ఇప్పుడు ఇక్కడ తీసి, వేరే చోట నాటటం మంచిది కాదు..." నమ్రతగా పావని పెద్ద కొడుకుతో చెప్పింది, సుజాత.

"మల్లయ్యా... కూరగాయలు అన్నీ తెచ్చావు కానీ సొరకాయ తేలేదే? రేపు ముక్కల పులుసు, ముద్దపప్పు చేయిద్దామనుకున్నాం కదా భోజనం లోకి?" అక్కడి హెల్పర్‌తో తన ధోరణిలో తాను చెప్పుకుపోసాగింది పావని.

# బామ్మ రూపాయి

చాగంటి తులసి



*ఈ నెల ప్రత్యేక కథ*

"ఏమర్రోయి యిల్లు జాగ్రత్త" అని బామ్మ మూడోసారి హెచ్చరించిది.

"వేగిరమే వచ్చేస్తాం. అంతగా కాకపోతే మీ ముగ్గురూ అన్నాలు తినండి. అన్నీ నట్టింట్లోనే పెట్టేను, మజ్జిగ పెద్ద సత్తెప్పేలాలో ఉంది. తలుపులు తీసేసి యింట్లో కుక్కని మాత్రం పెట్టకండి!" అంది అమ్మ.

"అలాగేనే బాబూ.. వెళ్ళిరండి!" అని విసుక్కుంది అక్కయ్య.

"రావే మరీ పొద్దెక్కి పోతోంది." ఉన్న కొబ్బరికాయని ఆడించింది బామ్మ. "పదండి" అని అరటిపళ్లనీ, ఊదొత్తులనీ పట్టుకుని అమ్మ బయల్దేరింది. వీధిగుమ్మం వరకూ వెళ్లి 'జాగ్రత్తర్రోయి' అని మళ్ళా కేకేసి, అమ్మా బామ్మా శివకోవిలకి దారితీసేరు. ఆ వేళ శివరాత్రి.

"ముగ్గురం ఉన్నాం! జాగ్రత్త జాగ్రత్త అని చెప్పేదేవిఁటి? వీళ్ళతో వచ్చిన చిక్కే యిదీ." అన్నాదక్కయ్య.

"ఇంకా గుంటలం కదా అని వాళ్ళలా చెప్తారు." అన్నాడు తమ్ముడు.

"మీరంటే గుంటలు.. నేను లేనూ?" అని సాగదీసుకుంది అక్కయ్య. దానికీ బామ్మావాళ్ళతో కోవిలకి వెళ్ళాలని ఉంది. యింట్లో ఎవరూ లేరని దాన్ని వదిలేసి మరీ వెళ్లారు.

"ఇంతకీ జాగరం మాటర్రా?" అన్నాను.

"నేనుంటాను. మీరొద్దన్నా మాన్ను. మీ తోటే ఉందేవిఁటి? తెల్లవార్లూ లెక్కలు చేసేస్తాను!" అన్నాడు తమ్ముడు.

"ఆఁ చేసేస్తావు! ఏం శ్రద్ధా కుర్రాడికీ! లెక్కలే చేస్తే ఓ గంటకే కుక్క ముట్టుకుంటుందిలే." అన్నాదక్కయ్య.

"పాపం అబ్బాయిగారికి నిరుడూ అంతే అయింది." అన్నాను.

"ఆఁ ఆఁ మహా చెడ్డ.. మిమ్మల్ని మట్టుకి కుక్క ముట్టుకోలేదూ? నన్ను పొద్దున్నేముట్టుకుంటే మిమ్మల్ని సాయంత్రం ముట్టుకుంది. మర్నాడు రాత్రి ఎనిమిదింటివరకూ ఉంటేనే ఉన్నట్టు తెల్సా?" అని తమ్ముడు కళ్ళెగరేసేడు. నిజమే. నిరుడు అక్కయ్యా నేనూ సాయంత్రం ఐదింటికే పడకేసేసేం.

"ఏడిసేవ్ మమ్మల్నేం ముట్టుకోలేదు. నేనీమాటు అమ్మా వాళ్ళతో పేకాడతాను!" అంది అక్కయ్య,

"వెధవ్వేషం.. మమ్మల్నిద్దర్నీ వదిలేసి పెద్దవాళ్ళతో చేరిపోదువు గాని, అలా వీల్లేదు. నువ్వూ మాతోటే ఉండాలి." అన్నాను.

"పోనీవే వెళ్లమను. పేకే ఆడమను. శివరాత్రినాడు పేకాడితే ఫలం ఏమిటి? నా బుర్ర!" అన్నాడు తమ్ముడు.

వీడొకొక్కప్పుడు నాన్న అనే మాటల్ని టస్సాదించేస్తూ ఉంటాడు. నాన్నకి ఉపోషాలూ, ఉప్పెట్లూ, పూజలూ పునస్కారాలూ అక్కర్లేదు. అమ్మనీ, బామ్మనీ వెక్కిరిస్తూ ఉంటాడు. "మీ ఉపోషాలు బంగారం గానూ! పొద్దున్నతిండి మానేసి దానికి డబుల్‌గా పిండివంటలతో రాత్రి కొట్టేడమా?" అంటాడు నాన్న. శివరాత్రినాడు స్మార్తులలో కటికి ఉపవాసం ఉంటారు. కాని మా ఆరాధ్యుల్లో అంతే! శివరాత్రి కార్తీక సోమవారం పద్ధతినే. ఇంక రాత్రి జాగరం.. అమ్మా, పొరుగింటి పిన్నమ్మా, మరో ముగ్గురూ కూడి తెల్లారే వరకూ "ఎత్తడం" దమ్మిడీలు వేసి ఆడేస్తారు. అందుకే నాన్న వాళ్ళని వెక్కిరిస్తూ ఉంటాడు.

"లెక్కలు చేసేస్తే వచ్చేస్తుంది పుణ్యం!" అని చేతులాడించింది అక్కయ్య. దానికి.. దేముడూ, దెయ్యం, పూజా పునస్కారాల మీద చచ్చేటంత నమ్మకం.

"పుణ్యం వాడికీ అక్కర్లేదు. నాకూ అక్కర్లేదు. అదేం కడుపు నిండే వస్తువా? కళ్ళకద్దుకనపడే వస్తువా? లెక్కలు చేస్తే బాగా మార్కులన్నా వస్తాయి" అన్నాను.

"అవునే చిన్నక్కా! పెద్ద పరీక్షల్లో ఫస్టుమార్కు నాదే చూసుకో" అన్నాడు. చూపుడు వేలు ఆడిస్తూ. తమ్ముడికి లెక్కలంటే యిష్టం.

"చేసుకోండి చేసుకోండి.. లెక్కలే చేసుకోండి.. నాకేం? నేను పేకే ఆడతాను!" అంది అక్కయ్య,

"అబ్బే నువ్వు పేకాడ కూడదు, ఓం నమశ్శివాయ అని జపం చేస్తూ జాగరం చెయ్యాలి. పుణ్యం వస్తుంది.. పుణ్యం!" అని వెక్కిరించేడు తమ్ముడు,

"వెధవా తాపులు తినగలవు" అని అక్కయ్య కోపంగా చూసింది.

ముగ్గురమూ చీడీమీద కొచ్చిన ఎండలో కెళ్ళి కూర్చున్నాం. తొమ్మిది గంటలైంది. ఎండ వేడెక్కుతోంది. శివరాత్రితో గాని చలి శివశివా అని పోదు.

"అదెవత్తది యింట్లో కొచ్చేస్తోంది?" అని అక్కయ్య వీధి గుమ్మం వేపు చూసింది.

ఓ ముసలమ్మ, చాలీచాలని పంచె కట్టుకుని ఓచేత్తో కర్ర పట్టుకుని, రెండో చెయ్యి ఓ పిల్లాడి భుజంమీద వేసి వస్తోంది. కుర్రాడూ చిన్న వాడే. సరిగ్గా తమ్ముడంతే ఉన్నాడు.

"ముష్టి ముండలా ఉంది. వెళ్లి తలుపు గడియ వేసిరా!" అని అరిచిందక్కయ్య.

తమ్ముడు కదల్లేదు. వాడు పరిశీలనగా ఆ కుర్రాడి వేపు చూస్తున్నాడు.

"వెధవ్వి నువ్వెళ్లక పోతే ఉండిపోతుందనుకున్నావేమిటి?" అని అక్కయ్య ఛటీమని లేచి వెళ్ళబోయింది. అది వెళ్ళే సమయానికి, కర్రతో టక్‌టక్‌మని చప్పుడు చేసుకుంటూ ముసలమ్మా, కుర్రాడు సావిడి దాటి చీడీమీద కొచ్చేసేరు.

"ఇంట్లో కొచ్చేస్తున్నా వేవిటి? అక్కడే ఉండు!" అని అక్కయ్య కసిరింది.

"మేమూ బ్రాహ్మల మేనమ్మా, మీ బామ్మగారి కోసం వచ్చేం!" అని జవాబు చెప్పింది ముసలమ్మ. నూతిలో మాటల్లా ఆవిడ గొంతుకలోంచీ ఆ మాటలీవతలికొచ్చేయి. కుర్రాడు బిక్క మొహం వేసేడు.

కూర్చున్న తమ్ముడు దభీమని లేచి,"నీ పేరు రామారావు కదూ?" అని ఆ కుర్రాణ్ణి అడిగేడు. మళ్ళీ "రారా. అక్కడే నిల్చున్నా వేమిటి? రండి బామ్మగారూ రండి!" అని తమ్ముడు వాళ్లని ఆహ్వానించేడు.

అక్కయ్య మొహం కోపంతో నిండిపోయింది. ఎవరో వెధవల్నిపెద్దవాడిలా మర్యాద చేస్తున్నాడు. గుంటవెధవ యింతున్నాడో లేడో తమ్ముడికి పెత్తనం లావూ! ఆ ముసలమ్మ ఎర్రని సైను పంచె.. పంచె కూడా కాదు. సైను గుడ్డముక్క ఒంటికి చుట్ట బెట్టుకుంది. ముసుగు బుర్రని సహం వరకే మూసింది. సహం ఒత్తుగావున్న పండు వెంట్రుకలతో అసహ్యంగా కనపడుతోంది. కళ్ళూ దవడలూ లోతుకు కూరుకుపోయి ముక్కు ఒక్కటే మొహంలో పైకి లేచి కనపడుతోంది. కర్రని కింద పడేసి, పంచెని పాదాల వరకూ లాక్కుంటూ, ముడిచి పెట్టుకొని ఎండలో కూర్చుంది. కుర్రాడు ఆవిడ పక్కనే కూర్చున్నాడు. చిరిగిపోయిన కాకీ చొక్కా, పొట్టిగా ఉన్న లాగూ వేసుకున్నాడు. మొహం జోక్కుపోయున్నా కళ్లు తేటగా కనపడుతున్నాయి.

"అక్కయ్యా ఈ అబ్బాయి ఫుట్ బాలెంత బాగా ఆడుతాడనుకున్నావు? మొన్న మా స్కూలుకీ, వీళ్ళ స్కూలుకీ అయిన పోటీలో ఈ అబ్బాయి చాలా బాగా అడేడు!" అన్నాడు తమ్ముడు.

ఆ అబ్బాయి కళ్ళు మిలమిల్లాడేయి. డోక్కు పోయిన మొహంలోకి కళొచ్చింది. అక్కయ్య తమ్ముడు చెప్పే మాటలు వినిపించుకోలేదు. దానికి వీళ్ళని చూస్తే కడుపులో గాభరా పుట్టింది..

"మా బామ్మ కోవిల కెళ్ళేరండీ!" అని చెప్పింది, వాళ్లని పంపించడానికి చూస్తూ.

"అవును శివరాత్రి కదూ? కోవిలకెళ్ళేరన్న మాట. నాకు దేవుడూ, కోవిలా కూడా ఎక్కడ? వెధవరాత! తిరిగిసరికే తెల్లారిపోతోంది. ఇలా తిరుగుతూనే వాడికి మొర పెడుతూ ఉంటాను. ఏంచేస్తాను? ఆ ఈశ్వరుడు నన్ను సరిగ్గా చూట్టం లేదు!" అని ఉసూరుమంది ముసలమ్మ. కుర్రాడి మొహంలో మళ్లీ దిగులు కనపడ్డాది.

"నువ్వు సెకండ్‌ఫారమే కదూ చదువుతున్నావ్?" ఆ అబ్బాయిని తమ్ముడడిగేడు.

"అవును!" అని బుర్ర తిప్పేడా అబ్బాయి.

"మా మేష్టారు చెప్పేరు. ఈ అబ్బాయి హైస్కూల్లో చదువుతున్నా.. నాకీ కుర్రాణ్ణి అందుకే తెల్సు!" అన్నాడు తమ్ముడు.

"ఆ మేష్టర్లే నాయినా, ఒడ్డుకీ లాక్కు రావడానికి కాస్త చెయ్యిస్తున్నారు. లేకపోతే ఈ గుడుగుడు ప్రాణాన్ని నేనూ వదిలేద్దును." అన్నాది ముసలమ్మా.

తమ్ముడూ, నేనూ ఆవిడ చెప్పే మాటల్ని జాగ్రత్తగా వింటున్నాం. వీళ్ళ నెలా పంపించడమా అని చూస్తోందక్కయ్య.

"మీ అమ్మగారు వంటొండుతున్నా రా?"

"మా అమ్మ కూడా కోవిల కెళ్ళింది. మేమే ఉన్నాం!" వెంటనే చెప్పేసింది అక్కయ్య,

"ఇప్పుడప్పుడే రారా!" అని ఆ అబ్బాయి ఆతృతగా అడిగేడు.

"అబ్బో! ఇప్పుడెక్కడొస్తారు? వాళ్ళిప్పుడే వెళ్ళేరు. ఐనా మా బామ్మ ముక్కార్తి దీపం వెలిగించాలి. అమ్మవారికి పూజచేయించాలి. చాలా సేపే అవుతుంది!" అన్నాదక్కయ్య,

"వెర్రి నాగమ్మవి. కోవిల కెళ్ళింతర్వాత వెంటనే ఎలా వచ్చేస్తార్రా? అందులోనూ ఇవాళ పర్వదినం. దర్శనం అవడమే కష్టమైపోతుంది!" అన్నాది ముసలమ్మ.

"అయితే బామ్మా..." అని సహంలో ఆపేసేడు రామారావు, ముసలమ్మ కుర్రాడి నెత్తిమీద చేయ్యేసి,

"ఉండరా నాయనా! కాస్సేపు కూర్చుని అలసటన్నా తీర్చుకోనీ! మీ బామ్మగారూ నేనూ స్నేహితులమేనమ్మా. మూడు కోవిళ్ళలో పురాణం ఒకచోట కూర్చునే వింటాం. మీ బామ్మ పెద్ద జ్ఞాని. నాకన్నీ బోధపరుస్తూ ఉంటారు. ఆవిడున్నారనుకొని వచ్చేను!" అన్నాది.

"ఏమండీ బామ్మగారూ, మావాళ్ళొచ్చే వరకూ ఉండండి. లేకపోతే ఏమిటో మాతో చెపితే మా బామ్మకి చెపుతాం!" అన్నాను. అక్కయ్య నా వేపు ఉరిమినట్టు చూసింది. దానికి నన్నూ, తమ్ముణ్నీ మింగేయాలని ఉంది.

"ఏం చెప్పమంటావమ్మా.. నా ప్రారబ్ధం! మీ బామ్మగారి కంతా తెల్సును. అందుకే వచ్చాను. ముసిలి కాలానికి ముప్పుతిప్పులూ పడు ముండా అని దేవుడు నా కూపిరి పోసేడు. బొడ్డూడని గుంటడు. వీడేం చేస్తాడు? వెనకాతలే వెళ్ళి నలుగురుతో చెప్పుకురాందే ఎలా కుదురుతుంది? వాడికి అమ్మనీ అబ్బనీ అందర్నీ నేనే" అని విచారంగా చెప్పింది ముసలమ్మ.

"అవును మా మేస్టారు చెప్పేరు. పాపం రామారావుకి ఆమ్మా నాన్నా లేరుట!" అని తమ్ముడు జాలిగా బుర్రూపేడు.

"అయ్యో పాపం అలాగా?" అన్నాను. అక్కయ్యంత కోపంలోనూ కుర్రాడి వేపు తేరిపారి చూసింది. రామారావుకు వాళ్లమ్మా నాన్నా జ్ఞాపకం వచ్చి గుడ్లలో నీళ్ళు తిరిగాయి.

"వాడెళ్లి పోయేడు. తొక్కుని.. నేనుండి పోయేను. కాటిక్కాళ్లు జాచుకున్న నన్నొదిలేసి ఆ దిక్కుమాలిన దేవుడు వాణ్ని తన్నుకుపోయేడు. పెద్ద జబ్బన్నా లేదు. ఈ మంగళారం ఊష్టం వచ్చింది. మళ్ళా బుధవారం కొట్టేసింది. మాయదారి ఊష్టం. ఆ డాక్టరు చచ్చిపోయే వరకూ పర్వాలేదనే అన్నాడు. వాడి మొహం ఈడ్వా! ఏంలేదనే అన్నాడు. వెధవ్వూష్ణం నా బాబుని, నా బంగారుతండ్రిని పట్టుక పోయింది. చెట్టంత బాబునీ కడుపున పెట్టుకున్నాను!" అని ముసలమ్మ రెండు బెక్కులు బెక్కి కళ్లు తుడుచుకుందికి పంచెని లాక్కుంది.

బుర్ర మీదున్న సహం ముసుగు జారిపోయి బుర్ర అంతా అసహ్యంగా కనపడుతోంది. రామారావు చొక్కాతో కళ్లు తుడుచుకున్నాడు. తమ్ముడు బిక్క మొగమేసేడు. ఆవిడ ఏడుస్తూంటే నాక్కళ్ళంటా నీళ్లు తిరిగేయి. అక్కయ్య బుర్రొంచు క్కూర్చుంది.

"ముసిలిముండని, బుద్ధి లేకుండా మీతో చెప్పి మిమ్మల్ని బేజారెత్తించి నట్టున్నాను. నా కొడుకు జ్ఞాపకం వచ్చి నే నెవరితో చెప్తున్నానో కూడా మర్చిపోయేనమ్మా. వీడు పుట్టి తల్లిని చంపేడు. పెరిగి తండ్రిని చంపేడు. వాడు దిక్కులినవాడయ్యేడు. నన్ను నట్టేట్లో ముంచీసేడు. ఇంకా ఏదో అందరూ దయ తలుస్తున్నారు. కాబట్టి ఏదో యిలా నెట్టుకొస్తున్నాను. వీడికదృష్టం లేకపోయింది నాయినా, వాళ్ల నాన్న బ్రతికుంటే ఈ ఖర్మం లేకపొయేది. పువ్వులమ్మిన ఊర్లో కట్టెలమ్మవలసి వచ్చింది. ఎంత గౌరవంగా బతికేవాళ్లం? నిక్షేపంలాంటి ఉద్యోగం. నా కొడుకు కలక్టరాఫీసులో గుమాస్తా! రాజా అయిన బతుకు. నాకీ గతుంటే వాడెలా బతుకుతాడూ? వాడి పిల్లాడికి అన్నం లేకుండా ఉంది!" రామారావు వాళ్ళ బామ్మనంటిపెట్టుకుని మొణుకుల్లో తలదూర్చుకున్నాడు. వాడి బుర్ర కొబ్బరిపీచులా ఎగురుతోంది.

"ఎక్కడన్నా చాకిరీ చేద్దామన్నా, ముసిలి తొక్కునై పోయేను. కళ్లు కనపడవు. మూడు కాళ్ల మనిషినీ ఏం చేస్తాను? వీడికి తెలివి తేటలతో పాటు ఆకలీ ఎక్కువె. ఎంత పెట్టినా చాలదు. అందరూ తలో రూపాయో, అర్ధా యిచ్చి దయతలిస్తేనే వాడీ పరీక్షలు గట్టెక్కుతాడు!" అన్నాది ముసలమ్మ.

చెట్టంత కొడుకు చచ్చిపోయి ఈ మనవణ్ణి సాకవలసి వచ్చింది. ముసలి కాలంలో యిలాంటివొస్తే ఏం దారి?

తమ్ముడు ఒక్క దుటుకున లేచి యింట్లోకి పరిగెట్టేడు. అక్కయ్యా నేనూ వాడు వెళ్ళిన వేపు చూస్తూ ఉండిపోయేం. లోపల పెట్టెలు ఈడ్చి డబడబమని చప్పుడు చేస్తున్నాడు తమ్ముడు. "ఒరేయి" అని ఓ గావుకేక పెట్టింది అక్కయ్య. వాడేం చేస్తున్నాడో అది కనిపెట్టేసింది. దాని కేకని వాడు లక్ష్య పెట్టలేదు. ఓ చొక్కాలాగూ పట్టుకుని యివతలకి వచ్చేడు. చొక్కా లాగూ వైపు ఆశగా చూస్తూ అక్కయ్య మొహాన్ని తేరిపారి చూసేడు రామారావు,

తమ్ముణ్ణి చూస్తూనే మళ్లా అరిచిందక్కయ్య "ఒరేయ్" అని.

"ఏమే?"

"అమ్మ తన్నీగల్దు!"

"నా చొక్కా, నా లాగూ నా యిష్టం. ఎందుకు తంతుంది?" తమ్ముడు బుర్ర ఝాడించేడు.

"రామారావ్ తీసుకోరా!" అని ఆ అబ్బాయి చేతిలో పెట్టేసేడు.

"మీ అమ్మ నడిగే యియ్యి నాయనా!" అంది ముసలమ్మ,

"ఫర్వాలేదండీ మా అమ్మేమీ అందు" అన్నాను. అక్కయ్య నా వేపు కొరకొరా చూసింది. దానికి మొదట్నించీ వాళ్ళని పంపించీయాలని ఉంది. ఆవిడని కూచోపెట్టి ఆవిడ చెప్పిందంతా విని, యిప్పుడు మేం చేసిన పనికి దానికి ఒళ్లుమండింది. అక్కయ్యంటే నాకూ తమ్ముడికీ కూడా భయం లేదు.

"చిన్నక్కా.. బామ్మకి నాన్న రూపాయి లిచ్చీసేడు కదూ?" తమ్ముడడిగేడు.

ప్రతీ నెలా బామ్మకి ఐదు రూపాయిలు నాన్న యిస్తూ ఉంటాడు. ఒత్తికీ పత్తికి, బ్రాహ్మడికిచ్చుకోడానికీ, మారాము చేస్తే మా కివ్వడానికీ బామ్మ ఆ డబ్బు ఉపయోగిస్తూ ఉంటుంది.

"అవున్రోయి. మాబాగా జ్ఞాపకం చేసేవు. భాగవతంలో మూడు రూపాయలు పెట్టింది!" అన్నాను.

"అవి మాత్రం తియ్యకండి. బామ్మ బుర్ర బద్దలు కొట్టేస్తుంది!" అని అక్కయ్య లేచి నిల్చుంది.

"నా బుర్రేమీ బద్దలు కొట్టదు. నే నెవరిననుకొంటున్నావ్? నా పేరు తాతయ్య పేరు తెల్సా? బామ్మ నాకు పెళ్ళాం అవుతుంది. మరేం ఫర్వాలేదు!" అన్నాడు తమ్ముడు.

"అలా అనకూడదు. తప్పు నాయినా!" అంది ముసలమ్మ.

"మా బామ్మే అలా అంటుందండీ!" అన్నాడు తమ్ముడు.

"నా మాట విని అవి ముట్టుకోకు. నీది తాతయ్య పేరైనా బామ్మూరుకోదు!" అన్నాదక్కయ్య.

"నన్ను దెబ్బలాడదన్నానా? పోనీ, నన్ను దెబ్బలాడితే మధ్య నీకేం?" అన్నాడు తమ్ముడు.

"మీతోపాటు నన్నూ దెబ్బలాడతారు. చేసేది మీరూ, తిట్లు తినేది నేనూనూ!" అన్నాదక్కయ్య.

"నిన్ను తిట్టనివ్వంలే. అమ్మా వాళ్లూ యిప్పుడప్పుడే రారు. వీళ్లెంతసేపు కూర్చుంటారు?" అంటూ లోపలకెళ్ళేను. అక్కయ్య నావెనకాతలే వచ్చి మీద పడ్డాది.

"ఆ గుంట వెధవకి బుద్ధిలేక పోతే పెద్దదానివి నీకూ లేదూ?"

"మరే మా యిద్దరికీ లేదు. మా యిష్టం, మేం యిచ్చుకుంటాం!" అని భాగవతంలోది ఓ రూపాయి తీసుకొచ్చి ముసలమ్మ చేతిలో పెట్టేను. అక్కయ్య మిడుతూ మిడుతూ చూడ్డం తప్పించి మమ్మల్నింకేం చెయ్యలేక పోయింది.

"నాతల్లే.. నాతల్లే.. మీ అమ్మకడుపు చల్లగా మంచి మొగుడొచ్చి..." అని దీవిస్తూ, "వద్దమ్మా.. వద్దు. పెద్దవాళ్ళకి చెప్పకుండా యివ్వకూడాదు. తప్పు, మీ బామ్మొచ్చేక అడిగే యిద్దువు గాని, ఆవిడేనా వద్దనరు. ఎక్కడ తీసేవో మళ్ళా అక్కడే పెట్టే!" అని రూపాయి పుచ్చుకోకుండా పెట్టేసింది ముసలమ్మ.

"తీసుకోండి. మరేంతఖర్లేదు!" అన్నాను.

"నీకు తెలీదమ్మా!" అన్నాదావిడ.

రామారావు తమ్ముడిచ్చిన చొక్కా లాగునీ కింద పరిచి జాగ్రత్తగా మడత పెట్టుకున్నాడు. అవి కూడా పుచ్చుకోవడమా మానీడమా అని సందేహంతో భయపడుతూ ముసలమ్మ పక్క చూసేడు.

"వాటికేం ఫర్వాలేదు. అవి నేనిచ్చేను. తీసుకో!" అని ధైర్యంగా చెప్పేడు తమ్ముడు.

"మళ్ళా వస్తాం నాయినా మీ వాళ్లతో చెప్పే యిద్దువు గాని!" అన్నాది ముసలమ్మ. రామారావు పక్కనున్న కఱ్ఱ తీసేడు. ముసలమ్మ పెద్ద ప్రయత్నంతో లేచి నిల్చుని కఱ్ఱ పుచ్చుకుంది. రామారావుకి బట్టలు వదిలేసి వెళ్లడం యిష్టంగా లేదు. వాటిమీంచి వాడు దృష్టి మరల్చలేకుండా ఉన్నాడు. ముసలమ్మ మాత్రం వొణుకుతున్న కాళ్ళూ చేతుల్తోటి కఱ్ఱని తణువుకు వేసుకుంటూ గడపదాటి వెళ్లిపోతున్నాది.

"ఇక్కడే కూర్చోకూడదా?" అన్నాడు రామారావు.

"ఈ పక్కనే మాలక్ష్మమ్మ గారింటికెళ్లి, మళ్ళా వద్దాం." అన్నాది ముసలమ్మ.

"వెళ్ళండి.. వెళ్ళండి.. మాలక్ష్మమ్మగారు బాగా యిస్తారు." అని పళ్ళు కొరుక్కుంది అక్కయ్య.

ముసలమ్మ వీధిగుమ్మంలోకి వెళ్ళిపోయింది గాని, రామారావు మాత్రం జాలిగా వెనక్కి తిరిగి చొక్కా లాగూ వేపు మరోసారి చూసుకున్నాడు.

"ఒరేయి రామారావ్ యిలారా!" అని మెల్లిగా పిల్చేడు తమ్ముడు.

"ఈ చొక్కా లాగూ, రూపాయి తీసుకుపో, మా వాళ్లతో మేం చెప్పుకుంటాంలే. మళ్ళా ఎన్ని సార్లు తిరిగి చస్తావు. ఫో!" అని తమ్ముడు చొక్కా లాగూ, రూపాయి కూడా వాడి చేతికిచ్చేసేడు, చొక్కా లాగూ చంకలో పెట్టేసుకుని, పిడికిట్లో గట్టిగా రూపాయి పట్టుకుని రామారావు ఎక్కడివాడొక్కడే నిల్చుండిపోయేడు. పుచ్చుకోవడమో మాండమో వాడికింకా సందేహంగానే ఉంది.

"పట్టుకు పొమ్మన్నానా? నాతో మాటంటే అంతే. పట్టుకుపో. చిన్న జెల్లకాయ మాత్రం యిచ్చుకో!" అని వాడి నెత్తిమీద చిన్న జెల్ల కాయ కొట్టి గెంటేసేడు తమ్ముడు. రామారావు అవి పట్టుకుని ముసలమ్మ వెనకాతల పరిగెట్టేడు.

మరో అరగంట కల్లా, “అమ్మయ్య ఏం జనం, ఏం జనం” అంటూ వచ్చిందమ్మ. చేతిలో కొబ్బరికాయ చెక్కా, చెక్కనిండా పత్రీ పువ్వులూ, కుంకం పొట్లం పట్టుకుని. కోతిలా అమ్మ చేతిలో ఉన్నకొబ్బరికాయి చెక్కలాక్కున్నాడు తమ్ముడు.

“ఉండరా కొట్టి తలో ముక్కా యిస్తాను” అంది అమ్మ.

“గర్భ గుడిలో ఊపిరాడేలేదు. ఏం తోపుళ్లు ఏం తోపుళ్ళు. దర్శనం అవడమే కష్టమైపోయింది. ఇవతలకొచ్చేసరికి ఈగల్లా చుట్టుకున్నారా ముష్టి వెధవలు. వాళ్లని తప్పుకొచ్చేసరికి తల ప్రాణం తోక్కొచ్చింది. హుస్సు. హా పరమేశ్వరా” అంటూ బామ్మ చతికిల్లా పడ్డాది.

దభీదభీమని కొబ్బరికాయ చెక్కని నేలనేసి కొట్టి తిండం మొదలెట్టాడు తమ్ముడు.

“అంతా నువ్వు తినీడం కాదు. ఆ ముక్క యిలా యిచ్చెయ్యి!” అన్నాదక్కయ్య.

“నీలా అనుకున్నావేమిటి? మీరూ తినండి!” అని చెక్క విసిరేసేడు తమ్ముడు.

“అవును నీకు ధర్మబుద్ధి చాలా పెరిగి పోయింది!” అన్నాదక్కయ్య. అక్కయ్య కొబ్బరిముక్క ప్రసాదం తిని అమ్మ దగ్గిరున్న పువ్వుల్ని కళ్లద్దుకుని తల్లో పెట్టుకుంది, కుంకం తీసుకుని బొట్టు పెట్టుకుంది.

“నువ్వూ పెట్టుకోవే!” అని నాకూ పువ్విచ్చిందమ్మ.

“వాడు, చిన్నదీ నీ మొగుణ్ణి పుణికి పుచ్చుకున్నారు. దేవుడనే సరికి మీద పడ్తారు. వాడి చెవులోనూ ఓ పువ్వు పెట్టు!” అంది బామ్మ.

“పెట్టుకుంటాను బామ్మా.. పెట్టుకుంటాను!” అని తమ్ముడు చెవులో పువ్వు పెట్టుకున్నాడు.

“ఏం యివాళ అంత బుద్దోచ్చింది?” అడిగింది బామ్మ.

“బుద్ధే ఈ వెధవేమొ...” అని ప్రారంభించి ముసలమ్మ రావడం, ఆవిడ కబుర్లూ, చొక్కాలాగూ యిచ్చిన సంగతీ చెప్పేసిందక్కయ్య,

“అయ్యో అయ్యో, ఏ చొక్కా లాగేవ్?” అమ్మ అడిగింది.

“నిరుడు పుట్టిన రోజుకి కుట్టించిన జత. చిరుగు పట్టడానికి సిద్ధంగానే ఉన్నాయి.” అన్నాడు తమ్ముడు.

“చిరుగు పట్టడానికి సిద్దంగా ఉన్నాయా? ఏం మాటల్రా నాయినా, నిక్షేపంలాంటి బట్టలు. ఎవడ్రా యిమ్మన్నాడూ? నీకేం పోయికాలం రా? తిన్నగా ఉండలేవూ? ఇదెక్కడి పిల్లల్రా బాబూ!” అని నెత్తీ నోరూ కొట్టుకుందమ్మ,

“అవేం నిక్షేపంలా లేవు. రెండూ పొట్టై పోయేయి. నేనవి కట్టకుని బళ్లోకెళ్లడమే లేదు. ఏడాదైపోయింది. మరో పుట్టినరోజు వెళ్లిపోయింది. అందుకే యిచ్చేసేను. ఆ మాత్రం నాకూ తెల్సు!” అన్నాడు తమ్ముడు.

“తెల్సు.. తెల్సు వేలుడంత లేవు. నీ కన్నీతెల్సు. వెధవ కానా.. ఎందుకురా యిచ్చేవు? ఓ ఘడియ యింట్లో ఉంచితే మంచి పనే చేసేరు. ఏమే నీ బుద్ధేమిటైంది? ఆ వెధవిస్తే చూస్తూ ఊరుకుంటావా? పెద్దదానివి కదా? ఆ మాత్రం తెలియొద్దూ?” అని బామ్మ అక్కయ్య మీద లేచింది.

“బాగానే ఉంది. నేనేం చేస్తాను? వాళ్ళు నా మాట వింటేనా? ఇయ్యరా తమ్ముడూ అని అందీ, అవునే చిన్నక్కా అని వాడూ యిచ్చేసేరు. నే నొద్దంటే నా మీద కఁయ్యిఁ మన్నారు. అక్కడితో వదిలిందీ? నువ్వు భాగవతంలో పెట్టుకున్న డబ్బుల్లోంచి ఓ రూపాయీ యిచ్చేసేరు!” అన్నాదక్కయ్య.

“ఆ.. ఆ.. మీ నెత్తి వాయించా. నా డబ్బులెందుకు ముట్టుకున్నార్రా. అందులో మూడురూపాయిల చిల్లరుండాలి. గుంటలూ.. గుంటందాలూ లేవు. ఆ డబ్బుతో సహస్రాభిషేకం చేయిద్దామనుకున్నాను. ఎవత్తిర్రా ఆ ముసలిముండ? దాని ఎదాన్నిపోసీసేరా?” బామ్మ.. తమ్ముడి మీదకీ నా మీదకీ వచ్చి చేతులాడిస్తూ దెబ్బలాడ్డం మొదలెట్టింది.

“ఆవిణ్ణి ముండని తిడుతున్నావేమిటి? నీ స్నేహితురాలే. మూడు కోవిళ్ళలో మీ యిద్దరూ ఒక దగ్గిరే కూర్చుని పురాణం వింటారుటా, ఆవిడే చెప్పింది. నువ్వు పెద్ద జ్ఞానివని కూడా చెప్పింది!” అన్నాను.

“ఒక్క రూపాయే యిచ్చేం. కావలిస్తే చూసుకో. నువ్వే ఉంటే ఆ మూడు రూపాయిలూ యిచ్చే దానివే. మేం యిచ్చేం కాబట్టి ఇలా అంటున్నావు!” అన్నాడు తమ్ముడు.

“ఏడిసినట్టే ఉంది. ఆ ముండ నా స్నేహితురాలేవిఁటి? ఏదో కోవిల్లో కనపడి దాని గోడూ అదీ చెప్పుకుని ఏడ్చింది. అలాగా పాపం అన్నాను. అంతే. అలా అని దానికి దానం చేస్తానా? యిస్తే బేడో పావలో యిస్తాం కాని రూపాయిలూ బట్టలు యిచ్చేసు కుంటామా? దిక్కుమాలిన వాళ్ళెంతమంది లేరు? అయినా మీకిలాంటి బుద్ధులు పుడ్తున్నాయేమర్రా? మీ నాన్న రానీ తొక్క వొలిపించేస్తాను. నా డబ్బు తిసీసేరు. మళ్ళా వాడునా కిస్తాడా?” బామ్మ పెద్ద గొంతుకతో అరవడం మొదలెట్టింది.

“ఈ పిల్లలతో నే వేగలేకుండా ఉన్నానమ్మా. ఒక్క క్షణం గడపదాటితే యిల్లు తీసి పందిరేస్తారు. వెళ్ళేటప్పుడు జాగ్రత్తర్రోయి అని చెప్పే వెళ్ళేను. అన్నీ వెధవ పనులే. ఆయన రానీండి. వెధవలని ఉతికింపించేస్తాను!” అన్నాదమ్మ.

“పాపం ఆ ముసలమ్మ మంచిదే. ‘తప్పమ్మా పెద్దవాళ్లకి తెలీకుండా యివ్వకూడదు. మళ్లీ వస్తాంలే’ అని వదిలేసి వెళ్ళిపోయింది. ఈ వెధవ ఆ కుర్రాడి చేతిలో పెట్టి, ‘తీసుకుఫో, మా వాళ్ళేమీ అన్రు’ అని యిచ్చి మరీ పంపించేడు!” చెప్పిందక్కయ్య.

“అదోటా? ఆవిడ పుచ్చుకోకపోయినా యిచ్చీసేడు?” అని నోరెళ్ళ బెట్టింది అమ్మ.

“వాడి పేరు తాతయ్యది నువ్వేమి అనవుట, అంచేత మరేం ఫర్వాలేదన్నాడు”.

“పేరు తాతయ్యదైతే, ఆ గుణాలు వీడి కెక్కడున్నాయి? ఈ వెధవ ఆయన పేరూ ప్రతిష్టా నిలబెట్టి అంతటి వాడైతే యిహనే కావాలి!” అన్నాది బామ్మ.

“నన్ను తిట్టినప్పుడల్లా తాతయ్యని తిట్టినట్టేలే!” అన్నాడు తమ్ముడు.

“ఓరి చచ్చినాడా, నీగుండు బద్దలు కొడతానుండు. మీ అమ్మ అడ్డుపడుతుందనుకుంటున్నావు గాబోలు.. “ అని తమ్ముణ్ణి పట్టుకోబోయింది బామ్మ. తమ్ముడు ఆవిడకి అందకుండా మండువాలోకి పరిగెట్టేడు.

“నీ గుడ్డలంటే యిచ్చుకున్నావు. ఆవిడ రూపాయెందుకు తీసేవురా? నీ కెన్నిసార్లు చెప్పేను? ఆవిడ జోలికెళ్లొద్దనీ, ఆవిడ వస్తువులు ముట్టుకోవద్దనీ, ఎంత చెప్పినా బుద్ధి లేదు వెధవకి!” అని గబగబా లోపల కెళ్ళి భాగవతం తీసుకొచ్చిందమ్మ.

"చూసుకోండి ఎంత తీసేసేడో?" అన్నాది.

"చూసుకోండి. మేమేం ఎక్కువ తీసుకోలేదు!" అన్నాను.

"వాడు రానీ, అంతా చెప్పి వెధవని చీరింపించేస్తాను!" అని చిందులు తొక్కింది బామ్మ.

"శివరాత్రి పూటా ఓ రూపాయి బీద కుర్రాడికిస్తే నన్నడ్డమైన తిట్లూ తిట్టేరని నేనూ నాన్నతో చెప్తాను!" అన్నాడు తమ్ముడు.

"నోరుముయ్యి వెధవా.. దేనికైనా ఓ సబబూ సందర్భమూ ఉండాలి!" అన్నాది అమ్మ.

ఇంతట్లో నాన్నొచ్చేసేడు.

"త్వరగా వడ్డించెయ్యండి. ఆఫీసుకు పోవాలి!" అని గబ గబా గదిలోకి పోయేడు.

"అదేం వెధవాఫీసో.. శివరాత్రిపూటా ఆఫీసే!" అన్నాదమ్మ

"నువ్వెంట్లో లేకపోతే నీ పిల్లల ఆగడం యింతా అంతా కాదు. నా రూపాయి నాకిచ్చేసి నీ పిల్లల కేంబుద్ధి చెప్పుకుంటావో చెప్పుకో!" అని గది గుమ్మంలో కెళ్లి పెద్ద గొంతుకతో చెప్పింది బామ్మ.

"దాని రూపాయెందుకు తీసేర్రా? దాంది దానికిచ్చేయండి!" అని తాపీగా అన్నాడు నాన్న.

"ఇహనెక్కడ రూపాయి? నీ కొడుకు ప్రయోజకత్వం, నీ చిన్న కూతురు ప్రయోకత్వం.. " అని మొదలెట్టింది బామ్మ.

"నువ్వేం చెప్పనక్కర్లేదు. నేనే చెపుతాను!" అని బామ్మ కడ్డంపడి తమ్ముడే అంతా చెప్పేసేడు.

"అయితే యింతకీ వీడు బట్టలూ రూపాయీ యిచ్చేసేడంటావా?" అంతా విని తాపీగా అడిగేడు నాన్న.

"ఏం బాగుందిరా? ఇచ్చేసేడంటావా అని మెల్లిగా అడుగుతున్నావా.. వెధవని పట్టుకు తన్నక! పోనీ వాడి గుడ్డలంటే యిచ్చుకున్నాడు. నా రూపాయెందుకు తీసేడో గట్టిగా అడుగు. పై పెచ్చు ఆ ముండ నా స్నేహితురాలంటాడు!" అంది బామ్మ.

"నిక్షేపంలాంటి బట్టలు. ఆ వెధవ కిచ్చేసేడు. వీడికి మా దగ్గర బొత్తిగా భయం లేదు" అంది అమ్మ.

"రెండూ పొట్టైపోయేయని చెప్పేనా? ఎన్ని సార్లు చెప్పాలి?" అన్నాడు తమ్ముడు.

"మావాళ్లు లేరు. వచ్చేక రండి అని చెప్పవలసింది పోయింది. వాళ్లకి దానాలు చేసేరు. దానాలు, చేస్తే చేసేరనుకోడానికి అణావా, బేడా? రూపాయికి రూపాయీ యిచ్చేసేరు!" అన్నాది బామ్మ.

"ఇస్తే ఏం? నువ్వు కోవిల్లో ఖర్చు పెట్టలేదూ?" అన్నాడు తమ్ముడు.

"ఒరేయి నువ్విలా ఊరుకోడంనించే నీ పిల్లలీలా నెత్తెక్కుతున్నారు. నాకదంతా తెలీదు. నా రూపాయి నాకిచ్చెయ్యి!" అన్నాది బామ్మ.

"నీ డబ్బులు నువ్వు భాగవతంలో పెట్టుకున్నావా? అందులోది వాడు రూపాయి తీసేసీడూ? వాడితో చదువుకుంటున్న కుర్రాడైనా కాదూ? హైస్కూల్లో చదువుతున్నాడా?" అని నాన్న, ఇచ్చినందుకు కోపం వచ్చిందో రాలేదో తెలీకుండా అన్నాడు.

ఆ కంఠస్వరాని బట్టి "వీళ్ల కి బాగా పెళ్ళి కావాలి" అని అక్కయ్య మరో పుల్ల ఎగసన దోసింది.

"రామ రామ. ఆ కుర్రాడికి తల్లీ తండ్రీ చచ్చిపోయేరు. వాళ్ల బామ్మ అడుక్కుని చదువు చెప్పిస్తున్నాది. నేనా కుర్రాణ్ణి బాగా ఎరుగుదును నాన్నా. వాళ్ళకో రూపాయీనూ, పొట్టైపోయిన గుడ్డలూ యిస్తే తప్పా? మొన్న పుట్టినరోజుకి కాక అంతకు ముందు పుట్టినరోజుకి నువ్వు కుట్టించేవు. చిరుగు పట్టలేదు, కాని ఇరుకైపోయేయి. శివరాత్రి పూటా దేవాలయాని కెళ్ళి వాళ్ళు డబ్బు తగిలెయ్యొచ్చుకాని నేనో రూపాయి దానం చేస్తే తప్పా!" అన్నాడు తమ్ముడు.

"అయ్యో అయ్యో! దేవాలయంలో తగలెయ్యడం ఏమిట్రా. నోటికొచ్చినట్టు పేల్తున్నావ్. దైవభక్తి పాపభీతి లేకపోతే పశువ్వవుతావు!" అన్నాదమ్మ.

"బాగానే ఉంది యిన్నేళ్ళొచ్చాక నీ కొడుకు నాకు నీతులు చెపుతున్నాడు!" అన్నాది బామ్మ.

నాన్నేమిటంటాడో అని నాన్నొచ్చిం దగ్గర్నించి ఓ మూల నాకు భయంగానే ఉంది.

"పెద్దవాళ్లకి చెప్పకుండా చెయ్యకుండా అలా యివ్వొచ్చునా!" అని మందలిస్తూ అన్నాడు నాన్న.

టక్కు టక్కూ కర్ర చప్పుడు చేసుకుంటూ సమయానికి మళ్లీ దిగబడ్డాది ముసలమ్మ. రామారావు మాత్రం ముసలమ్మ వెనక రాలేదు.

"ఈ ముసలమ్మే. మళ్ళా వస్తున్నాది. పుచ్చుకున్నది చాల్లేదు కాబోలు!" అన్నాదక్కయ్య.

"ఓసారి దయతలిస్తే యిల్లు గుల్ల చేసేస్తారు!" అన్నాదమ్మ.

"అక్కగారూ గుడి నుంచి వచ్చీసేరూ.. దేవుడి దర్శనం అయిందా? చిన్న పొరపాటు జరిగింది. పసిపిల్లలకేం తెలుస్తుందీ? మీరు లేనప్పుడొచ్చేను. మీ పిల్లలు మావాడికి బట్టలూ, రూపాయీ యిచ్చేరు. నేను మళ్లీవస్తానని చెప్పి వెళ్ళిపోతే, మా గుంటవెధవ.. యిచ్చేరని సంబరంతో నా వెనకాతల పుచ్చీసుకున్నాడు. మీ చేతుల్తో యిస్తే పుచ్చుకోవాలి కాని, పిల్లలిస్తే ఎలాగా? ఇవాళిదైంది రేపు యింకోటవుతుంది!" అని ముసలమ్మా గుడ్డలూ, రూపాయీ పదిలంగా అరుగుమీద పెట్టేసింది.

"అక్కగారూ.. నా స్థితి గతులన్నీ మీరు బాగా ఎరుగుదురు. మీకు దేవుడు ఏం తోపిస్తే, అది మీ చేత్తో యిప్పించండి" అని బామ్మని ప్రాధేయంగా అడిగింది.

మా బామ్మ గొంతుకలో పచ్చి వెలక్కాయ పడ్డాది!

మా అమ్మ గుడ్లప్పగించి అదే పనిగా ముసలమ్మని చూసింది. ఇద్దరూ పల్లెత్తు మాట్లాడలేదు.

ముసలమ్మ చాలీచాలని కొంగుని భుజం మీది చిన్నమూట పెట్టుకుంది. ఆ మూటని చూపించి, "ఇదిగో మీ పొరుగుంటి మాలక్ష్మమ్మగారు బియ్యంపట్టు కెళ్ళమన్నారు. ఆవిడకా బుద్ధి దేవుడు పుట్టించేడు. మాకు మూణ్ణాలుగు రోజులు దాకా కడుపు నిండా తిండానికి సరిపోతాయి!" అని చెప్పింది.

"మీ మనవడేడీ?" అడిగేడు నాన్న.

"లోపలికి రారా అంటే మొహం చెల్లక వీధిలో నిల్చుండిపోయేడు!" అంది ముసలమ్మ.

వీధి గుమ్మం పక్కనుంచీ దొంగలాగ తొంగి చూసేడు రామారావు.

"ఇలారా అబ్బాయి!" అని నాన్న పిల్చేడు. వాడు జంకుతూ లోపలికొచ్చేడు.

"ఇదిగో నీచొక్కా, నిక్కరూ!" అని నాన్నే వాడి చేతిలో పెట్టేసేడు.

దాగరంత మొహంతో వాడు వాటిని తీసుకున్నాడు.

"అవ్వగారూ ఇదిగో మీ రూపాయి!" అని ముసలమ్మకి రూపాయి యిచ్చేసేడు.

"మీ యిల్లు వెయ్యి మొదళ్లై తండ్రీ ఎప్పటికీ వృద్ధిలోకి రావాలి. పాత్ర ఎరిగి దానం చెయ్యమన్నారు పెద్దలు. నాలాంటి దానికి యిస్తే కోటిగుణితం అవుతుంది!" అని ముసలమ్మ ఆశీర్వదిస్తూ రూపాయి పుచ్చుకుంది.

"దీని కోసమని మళ్ళా వచ్చేరా? మంచివారే! ఇవ్వడానికి పిల్లలైతేనేం.. మేం అయితే నేం!" అన్నాది బామ్మ.

"ఏ గూటి చిలక ఆ పలుకు పలుకుతుంది. మీ బుద్ధే మీ పిల్లల కొచ్చింది!" అన్నాది ముసలమ్మ.

"వాళ్ళ తాతగారి పోలికే! దానం ధర్మం వాడికి పుట్టుకతోనే వచ్చేయి!" అన్నాదమ్మ.

తమ్ముడు ఫకాల్న నవ్వేడు.

పళ్ళు కొరుక్కుంటూ, "ఏఁవిటా వెధవ నవ్వు. నోరుమూసుకు ఉండు!" అన్నాది బామ్మ

"ఇవాళ శివుడు నాలో ఉండి మీకూ, మీ పిల్లలకీ మామీద యింత దయ చూపించేడు. మీరు చేసిన సాయం ఎన్ని జన్మలకీ మర్చిపోను. యిహనింటికెళ్ళి కుంక్రనాగమ్మకుడకేసి పెట్టాలి. అక్కగారూ వెళ్ళొస్తాను!" అని చెప్పి, ముసలమ్మ వెళ్ళిపోతానంది.

"మంచిది. వెళ్ళిరండి!" అన్నాది బామ్మ.

"మీ దయవల్ల సంవత్సరంపాటు మావాడికి గుడ్డముక్కక్కరువు లేదు. రూపాయిచ్చేరా? మరి రెండు రూపాయిలుంటే ఈ నెల వాడి జీతానికి ఇబ్బంది రాదు. ఏదో మీ అందరూ తలో పిడికెడూ యిస్తూ ఉంటే ఎలాగో ఈడ్చుకొస్తున్నాను. చెట్టంత కొడుకుని పొట్టని పెట్టుకుని ఈ రాత తెచ్చుకున్నాను. వెళ్లొస్తాను తల్లీ, బాబూ వెళ్ళొస్తాను. మీ మేలు మరిచిపోలేను!" అని చెపుతూ కళ్ళనిండా నీర్లు పెట్టుకుని, "వెళ్లొస్తాను అక్కగారూ" అని బామ్మతో ఆఖర్ని ఏడుస్తూ చెప్పి, చచ్చిపోయిన కొడుక్కోసం ఏడుస్తూ వెళ్ళిపోయింది.

"ఇచ్చేసేనని అంత హంగామా చేసేరు. తిరిగి పుచ్చుకోలేక పోయేరూ?" అన్నాడు తమ్ముడు.

"అదొకటి తక్కువైంది!" అన్నాదమ్మ.

"నువ్వూ నీ కొడుకూ కలిసి రూపాయే యిచ్చుకోండి. పది రూపాయిలే యిచ్చుకోండి. నా రూపాయి మాత్రం నాకిచ్చీకపోతే ఒప్పుకోను!" అంది బామ్మ.

"నేనిస్తే నేమిటి నా పిల్లలిస్తే నేమిటి అని యిప్పుడే అన్నావు కదుటే అమ్మా!" అన్నాడు నాన్న.

"అద్దిగదీ అద్దిగదీ" అని గెంతేదు తమ్ముడు.

"ఎలా తయారవాలో అలా తయారౌతారులే నీ పిల్లలు!" అన్నాది బామ్మ.

"రేపు నేనూ యింకేదన్నా యిచ్చేస్తానుండండి!" అంది అక్కయ్య.

"అలా యిచ్చీడానికి అందరికీ చేతులు రావు!" అన్నాడు నాన్న.


*"ఆంధ్ర వారపత్రిక 25.1.1956 సంచిక నుండి పునర్ముద్రణ"*

# యువ
# కలం



# చిరంజీవి


గాయత్రి రామోజీ ఆర్.



✆ 9182897915


***తన పెళ్లి తర్వాత మూడు నిద్రలు అయ్యాక, నాలుగవ రోజునే వెళ్లాల్సిన పరిస్థితి ఉండటంతో దేశ సరిహద్దులకు వెంటనే వెళ్లిన తన భర్త రణధీర్.. బాబు పుట్టాక మొదటి పుట్టినరోజుకు మాత్రమే రాగలిగాడు. పట్టుమని పదిరోజులు కూడా గడవకనే మళ్ళీ డ్యూటీకి వెళ్ళి తీరాల్సిన స్థితిలో వెళ్లి, తిరిగి సంవత్సరం తరువాత జెండా కప్పుకుని వచ్చారు.***

తూరుపు కొండలలో సూర్యోదయం కావటానికి కొద్ది నిమిషాల ముందు...

సుధీర అత్యంత కఠినతర వ్యాయామంతో ఆమె శరీరం మరింత పటుత్వాన్ని సంతరించుకొంటోంది.

అంతకుముందే యోగా, ధ్యానం ముగించింది. తమ ఇంటి ముందున్న చిన్ని లాన్‌లో నుంచే తమ బెడ్‌రూమ్ కిటికీ గుండా లోపలికి చూసింది.. రెండేళ్ల తన చిన్నితండ్రి ప్రశాంతంగా నిద్ర పోతున్నాడు. పసితనపు దైవత్వం, ముద్దులు మూటగట్టే అమాయకపు అందం పోటీ పడుతోంది తన బాబు ప్రతాప్ శౌర్యలో.. తల్లిగా తనయుని చూసి గుండె పొంగింది.

లోపలికి వచ్చి సుతారంగా బాబు నుదురు ముద్దాడుతున్న ఆమె కళ్ళలో లెక్కకి మించి ఎన్నో భావాలు... ఆమె హృదయంలో పొంగుతున్న వేల సంద్రాలు!

సుధీర చేసే ప్రతి పనిని జాగ్రత్తగా బరువెక్కిన హృదయంతో గమనిస్తూనే వున్నారు ఒకే ఇంట్లో నివసించే ఆమె తల్లిదండ్రులు, అత్తమామలు, ఆమె అన్నయ్య విక్రమ్, వదిన భార్గవి, వారి పాప నైనాతో సహా, అందరి హృదయాలు భరించలేని వేదనతో నిండి ఉన్నాయి. కానీ ఎవరి కళ్ళనుండి చుక్క నీటిబొట్టు బయటికి జారకుండా చూసుకుంటున్నారు ఎవరికి వాళ్ళు.

తమ బెడ్‌రూమ్‌లో ఉన్న సుధీర భర్త లెఫ్టినెంట్ కల్నల్ రణధీర్ శౌర్య ఫోటో ని తదేకంగా చూసింది ఒక్క క్షణం.

ప్రేమ, ఆర్తి కలగలిపి మృదువుగా స్పృశించింది. తర్వాత తన బిడ్డ ప్రతాప్ అప్పుడే నిద్ర లేవగా, నవ్వుతూ ముద్దులాడి తనని స్నానాదికాలు పూర్తిచేయించటానికి బాత్‌రూమ్‌లోకి తీసుకెళుతూ,

"రేపటి నుండి నీ పనులన్నీ అమ్మమ్మ తాతయ్య గారు చేస్తారు నాన్నా! నువ్వు బుద్ధిగా చేయించుకోవాలి. సరేనా బంగారం!" వాడికి ఏమర్థమవుతుందో, ఏమి అర్థమయ్యిందో తెలీదు గానీ అన్నిటికీ బిక్కు బిక్కుమన్న కళ్ళతో తల్లి సుధీరని చూస్తూ తలూపాడు.

రాత్రి సుధీర తన పక్కనే పడుకున్న బాబుని జో కొడుతూనే ఆలోచనల్లో మునిగింది. కంటి మీద కునుకు లేదు.

ఆ ఇంట్లో ఎవరూ సరిగా నిద్రపోలేదు ఆ రాత్రి... అందరి గుండె గుబులు గానే ఉంది!

★★★


మరుసటి రోజు యథా ప్రకారం నాలుగున్నరకి లేచింది సుధీర. యోగా, ధ్యానం, వ్యాయామం ముగిశాయి. స్నానం చేసి బ్యాగ్ తీసుకుంది. అపుడపుడే సూర్యుడు ఉదయించటానికి సిద్ధమవుతూ కనిపిస్తుంటే, మూడు సంవత్సరాల క్రితం అదే టైమ్‌లో ఇంటికి వచ్చిన భర్త గుర్తుకు వచ్చాడు. కాకపోతే భారత జెండా పట్టుకుని కాదు, క...ప్పు..కు..ని

తన పెళ్లి తర్వాత మూడు నిద్రలు అయ్యాక, నాలుగవ రోజునే వెళ్లాల్సిన పరిస్థితి ఉండటంతో దేశ సరిహద్దులకు వెంటనే వెళ్లిన తన భర్త రణధీర్.. బాబు పుట్టాక మొదటి పుట్టినరోజుకు మాత్రమే రాగలిగాడు. పట్టుమని పదిరోజులు కూడా గడవకనే మళ్ళీ డ్యూటీకి వెళ్ళి తీరాల్సిన స్థితిలో వెళ్లి, తిరిగి సంవత్సరం తరువాత జెండా కప్పుకుని వచ్చారు.

అలా అతనొచ్చిన రోజు రాత్రి ఆమె ఆలోచనల్లో రాత్రి కరుగుతూనే "జీవితంలో అన్నీ పోగొట్టుకున్నా, ఒక్కటి మిగిలే ఉంటుంది. అదే భవిష్యత్తు!" పక్కనున్న బాబుని, తన భర్త పనిచేసిన సరిహద్దు నేలని గుర్తు చేసుకుంటూ అనుకుంది. ఒక భార్యకి ఎన్ని ఉన్నా, ఎవరు వున్నా, భర్త తన సర్వస్వం అనుకుంటుంది. అందులోనూ ఆశయం కోసం బ్రతికే తన భర్తలాంటి వారి విషయంలో మరీనూ.. మాములుగా లేదా వేదన.. బ్రతికుండగా నరక యాతన...

ఆ రాత్రి కరిగి కరిగి తెల్లారుఝాము అవుతూ ఉండగా తీసుకుంది ఒక నిర్ణయం..

"భగవంతుడు మనని దేనికోసం సృష్టించాడో! అది నెరవేర్చకుండా అర్ధాంతరంగా వెళ్లిపోకూడదు... కానీ తన భర్త మొదలు పెట్టిన మాతృభూమి రక్షణ యాగం పూర్తి కాకముందే నక్క జిత్తుల దేశం వేసిన నిర్లజ్జ వేషాలకి, టక్కు టమారాలకి, చెక్ పెడుతూ, టెర్రరిస్ట్‌ల అంతుచూసే యుద్ధంలో డ్యూటీ పూర్తి కాకుండానే.. తప్పుకోవాల్సి వచ్చింది. భార్యంటే భర్తలో సగమే కదా.. ఇపుడు తాను, తన భర్తగా మారి పూర్ణం అయింది. తన భర్త వదిలి వెళ్ళిన యాగానికి పూర్ణాహుతి సమర్పించి భారత దేశమాతకి ఫలశృతి అందించే తిరిగే వస్తుంది. తన బిడ్డని భారత వీరునిగా పెంచే బాధ్యత తన తల్లిదండ్రులకు అప్పగించి, తాను తన భర్తలా, తనలా మారి పోరుకు సిద్ధమైంది. అహర్నిశలు శారీరక, మానసిక పరీక్షలకు సిద్ధం కావడానికి కఠిన శిక్షణ తీసుకుంది, ఆర్మీ ఆఫీసర్‌గా సెలక్ట్ కావటానికి ప్రతి క్షణం ఖర్చు పెట్టి చదివింది. యుద్ధ తంత్రాలు శత్రుదేశ జిత్తులు, ఎదుర్కొనే పైఎత్తులు ఆకళింపు చేసుకుంటూ గడిపింది ఈ రెండేళ్ళు. తన భర్త తనతో గడిపిన పదిరోజులలో పంచుకున్న ఎన్నో విషయాల ఆధారంగా, సాన పెట్టిన వజ్రమయింది ఇపుడు.



ఈరోజు వెళ్లి డ్యూటీలో జాయిన్ కావాలి.. ఇంట్లో అందరినీ ఓసారి కళ్ళనిండా చూసుకుంటూ గుండెల్లో ముద్రించుకుంది. తన బిడ్డని గట్టిగా హత్తుకుని ఒక్క కన్నీటి బొట్టు రాలకుండా జాగ్రత్త పడి "అమ్మ డ్యూటీ అయిపోగానే వచ్చే తీరుతుంది నాన్నా! నువ్వు బుద్దిగా చదువుకోవాలి.. అల్లరి చేయకూడదు.." అర్థంకాకున్నా అమ్మ చెప్పిన దానికి తలూపాడు బాబు.

కళ్ళ నిండా బాబు ప్రతిరూపం నింపుకుంటూ తల్లికి అప్పజెప్పింది.

"చిన్నలోటు కూడా రానివ్వం!" ఇంట్లో అందరూ ముక్తకంఠంతో అంటున్నట్లే వాళ్ల చూపుల్లో అర్థం అయింది. చిన్ని భరోసాతో కూడిన నవ్వు ఆమె పెదాలని తాకింది..

తర్వాత లోపలికి వెళ్ళి భర్త ఫోటోకి ముద్దు పెట్టింది. భర్త యూనిఫామ్ బ్యాగ్‌లో పెట్టుకుంది, భక్తిగా స్పృశించి. బ్యాగ్‌కి జిప్ వేసి

ఇంటి ముందు కొచ్చి నిలుచుండగానే మిలిటరీ వెహికల్ వచ్చి ఆగింది. ఆమె భర్త వీరోచిత సాహసాలకి, ఆమె సాహసోపేత నిర్ణయానికి భార త ప్రభుత్వం ఇచ్చిన గౌరవవేమో అది!

తన ఇంటి ముందు ఉన్న నేలని భక్తిగా తాకి, ఆ మట్టిని తన కుడిచేతి మధ్య వేలితో రెండు కనుబొమల మధ్య దిద్దుకుంది! బ్యాగ్ వెహికల్‌లో పెట్టి, అందర్నీ ఓసారి చూసుకుని వెహికల్ ఎక్కుతుంటే... అప్పుడు గమనించింది తనకు సెండాఫ్ ఇవ్వటానికి కదలివచ్చిన వూరు ఊరు అంతటినీ! అందర్నీ చూసి ఆశ్చర్య పోయేంతలో యూనిఫామ్‌లో ఉన్న సోల్జర్స్‌కి అందరికి సెల్యూట్ కొట్టింది. ఊరు మొత్తం తిరిగి సెల్యూట్ చేసి వారికందరికి టా.. టా.. చెప్పి బయలుదేరింది.

'ఈ ఉద్యోగం వద్దు' అని ఇంట్లో వారు ఎంత చెప్పినా వినలేదు. అది గుర్తుకు వచ్చి, వారి హృదయాలు భారమైనా చేయగలిగేది ఇక ఏమి లేదు. ధీరలానే తాను నిర్ణయం తీసుకుంది. తనని చూసి గర్వించాలో, బాధపడాలో తెలీని స్థితిలో ఉండిపోయారు వారు.

అప్పుడే తూరుపు దిక్కున సూర్యోదయం అయింది.

"సుధీర ధీర నిర్ణయంలో రణకౌశల రణ్ వీర్ ఎప్పటికీ 'చిరంజీవే'!

# దేవుడు

ఎన్. రేవతి

✆ 7781020483



***ధర్మం ఇంకా నాలుగు కాళ్లపై నడుస్తుందనడానికి ఇలాంటి వాళ్ళే కారణం ఏమో! ఈ కలికాలంలో.. మనిషి తోటిమనిషికి సాయం చేయడానికి ఎన్నో రకాలుగా ఆలోచిస్తున్నాడు. అందులో ఎంతో స్వార్థం ఉంటేనే గానీ సాయం చేయడు. కనీసం తెలిసిన వాళ్ళకి, దగ్గర బంధువులకి కూడా సాయం చేయడానికి ఎన్నో రకాలుగా ఆలోచిస్తాడు. అలాంటిది ఈయన..***

నాకు చచ్చిపోవాలని ఉంది.

నేను చచ్చిపోయినా, నా ఆత్మ క్షోభిస్తూనే ఉంటుంది. నా ఆత్మే ఏంటి.. ఎవరు చచ్చిపోయినా వారి ఆత్మలు క్షోభిస్తూనే ఉంటాయి. కాదంటారా? అసలు క్షోభించని ఆత్మలు ఉంటాయా? నాకు సందేహమే! ఉండవనే అనుకుంటున్నాను. ఎందుకంటే ఈ భూమ్మీద పుట్టిన ప్రతీ ప్రాణికి బాధలు ఉంటాయి కదా? అవి ఎలాంటి బాధలయినా సరే.. బాధలు లేని మనిషెవ్వడు ఈ లోకంలో!

నాకూ ఒక బాధ ఉంది. అదే నా చింత! నేను చచ్చాకా నన్నెవరు కాలుస్తారు? లేదా ఎవరు పూడుస్తారు? ఎందుకంటే నాకు ఎవరూ లేరు. చిన్నప్పుడే తల్లిదండ్రులు పోయారు. పెద్దయ్యాక పెళ్ళాం పోయింది. పిల్లలు లేరు. ఎవరూ లేని అనాథని. కష్టపడి బ్రతకలేని అర్భకుడ్ని! అడుక్కుంటూ జీవిత ప్రయాణం సాగిస్తున్న బాటసారిని! వృద్ధాప్యంలో అడుగిడిన వాడ్ని!

నాకెవరూ లేరు కాబట్టి, నేను చచ్చాక నా అంత్య సంస్కారాల కోసం అడుక్కుంటూ కొంత డబ్బు కూడబెట్టాను. అవి ఒకసారి లెక్క బెట్టాను. దాదాపుగా పదివేల వరకూ పోగయ్యాయి. అయితే ఆ డబ్బులు నేను ఎక్కడ దాచుకోవాలి? నాకు బేంకిల్లో ఎలా వేయాలో తెలియదు. తెలిసినా.. నా వాలకం చూసి నన్ను కనీసం బేంకి లోపలికి కూడా అడుగుపెట్టనివ్వరు.

తైల సంస్కారం లేని జుట్టు. చిరిగిన బట్టలు. పెరిగిన గడ్డం. పీక్కుపోయిన మొహం. లోతుకు పోయిన కడుపు. నల్లగా.. అసహ్యంగా.. ఇదీ నా అవతారం! అయితే ఇప్పుడు నేను బాధ పడేది ఎందుకంటే.. నేను ఎంతో కష్టపడి రాత్రనకా, పగలనకా, ఎండనకా, వాననకా కూడపెట్టిన పైసలు నేనుంటున్న ఓ గుడిసెలో దాచాను. రోజూ ఒకసారైనా వాటిని చూసుకొని మురిసిపోయేవాడ్ని. వాటితో నా అంత్యక్రియలు జరుగుతున్నట్టు కలలు కనేవాడ్ని. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యేవాడ్ని!

ఇప్పుడు నాకు ఆ ఆనందం లేదు. ఎవడో నా డబ్బులు కనిపెట్టి, వాటిని కాస్తా కాజేసాడు. అదే నా బాధ! ఆ పైసలు లేకపోతే నా అంత్యక్రియలు ఎలా జరుగుతాయి? ఎవరూ పట్టించుకోక, నన్ను అనాథప్రేతంలా వదిలేస్తారా? దాన్ని కాకులు, గ్రద్దలు, కుక్కలు, నక్కలు పీక్కు తింటాయా? ఆ ఆలోచనకే నాకు కళ్ళమ్మట నీళ్లు వస్తున్నాయి! లేదు.. నేనలా కాకూడదు. నేను బాగా బ్రతకలేకపోయినా కనీసం చచ్చాకయినా శాంతిని పొందాలని అనుకుంటున్నాను!

కానీ ఇప్పుడది అసాధ్యంగా అనిపిస్తోంది. నేను అనాథప్రేతంలా మిగిలిపోకూడదు. ఎలాగైనా నేను పోగొట్టుకున్న ఆ పైసలు దక్కించుకోవాలి. నేను మళ్ళీ కష్టపడి సంపాదించుకోవడానికి నా జీవితం చాలదు. నాకు ఎవరు సహాయం చేస్తారు? నా పోయిన డబ్బులు ఎవరు తీసుకొస్తారు? ఈ రోజుల్లో మనుషుల్లో అంతటి ఉదార స్వభావులేరి? ఉత్తములేరి? పక్కవాడు తగలబడిపోతుంటేనే ఎవరూ పట్టించుకోరు. అలాంటిది నాకు.. అదీ ఒక ముసలి బిచ్చగాడికి ఎవరు సహాయం చేస్తారు? అనుకుంటూనే ఓ ప్రయత్నం చేద్దామనిపించింది.

మెల్లగా నడచుకుంటూ ముందుకు వెళ్లాను. అక్కడికి చేరాను. అక్కడున్న ఓ వ్యక్తితో నా బాధ చెప్పుకోబోయాను. అతడు ముందు నన్ను చూస్తూనే అసహ్యించుకున్నాడు. ఛీ.. ఛీ.. అన్నాడు. దూరంగా పో.. పో.. అన్నాడు. అయినా నేను పోలేదు. కదల్లేదు. అక్కడే నిల్చున్నాను రాయిలా! అలా ఏడుస్తూనే ఉన్నాను.

ఇంతలో మరొకడు వచ్చాడు. మొదటోడు నా గురించి అతనికి చెప్పినట్టున్నాడు. అతడు కాస్త మంచివాడిలా ఉన్నాడు. నన్ను దగ్గరికి రమ్మని సైగ చేసాడు. వెళ్ళాను. ఆ కాకిబట్టలాయనికి దండాలెట్టాను. జరిగిన విషయం చెప్పమన్నాడు. చెప్పాను!

"సరే..లోపల పెద్దయ్యగారున్నారు.వెళ్లి చెప్పుకో!" అని లోపలికి పంపించాడు. లోపలికెళ్లాను. ఎస్.ఐ.గారికి నమస్కరించాను. ఆయన నా గురించి అడిగాడు. నా గోడంతా ఆయనతో వెళ్లబోసుకున్నాను. ఆయన కూడా మంచివాడిలానే ఉన్నాడు. నా వివరాలు రాసుకున్నాడు. వారం పోయాక వచ్చి కలవమన్నాడు. నాకు సంతోషం వేసింది. అప్పుడే నా పదివేలూ దొరికినంత సంబర పడిపోయాను. ఆయనకి దండాలు పెట్టి బయటికి కదిలాను.



నాకు బాగా ఆకలిగా ఉంది. అడుక్కున్న డబ్బులతో ఓ బన్ తిన్నాను. టీ తాగాను. అప్పటికే చీకటి పడింది. తిన్నగా గుడిసెకు పోయాను.

వారం గడిచింది. మళ్ళీ వెళ్లి ఎస్.ఐ.గార్ని కలిసాను. ఆయన ఇంకా దొంగ దొరకలేదని మరో వారం తర్వాత రమ్మని చెప్పి పంపించేశాడు. అలా రెండు మూడు నాలుగు వారాలు గడిచిపోయాయి. దొంగ దొరకలేదు. నా డబ్బులు దొరకలేదు. నాకు బెంగొచ్చింది. ఆ బెంగతో నా ఆరోగ్యం పాడయ్యింది. మంచం పట్టాను.

ఓ రోజు ఆ ఎస్.ఐ.గారు నన్ను వెదుక్కుంటూ నా గుడిసెకొచ్చాడు. అప్పటికే నన్ను బయట వేసేసారు. అందరికీ నాపైన అనుమానం కలిగింది. నేను రోజులు లెక్కబెడుతున్నానని! ఆయన నన్ను చూసారు. ఎవరో నా గురించి ఆయనకి చెప్పారు. ఆయన నా దగ్గరకొచ్చాడు. నన్ను "తాతా!" అంటూ ప్రేమగా పిలిచాడు. నేను ఆయన గొంతు గుర్తుపట్టాను. కళ్ళు తెరుద్దాం అనుకున్నాను. కానీ తెరవలేకపోయాను. ఆయన మళ్ళీ పిలిచాడు. నేను కాస్త కళ్ళు విప్పాను. నా కళ్ళల్లో ప్రశ్న! ఆయన గ్రహించినట్టున్నాడు.

'బాబూ! దొంగ దొరికాడా? నా డబ్బులు దొరికాయా?!'

అతనికి నా పరిస్థితి అర్థం అయినట్టుంది. అతను నాకేసి బాధగా చూసాడు. అతని కళ్ళల్లో కన్నీళ్లు! ఈ నెల రోజుల్లో ఆయనకి నేనంటే ఎంత అభిమానం? ఎంత ఆపేక్ష?.. అనుకున్నాను. చాలు! నాకోసం రెండు కన్నీటిబొట్లు రాల్చే ఓ మనసున్న మనిషి ఉన్నాడు. అది చాలు అనిపించింది నాకు! ఇక నేను చచ్చిపోయినా చాలు అనుకున్నాను!

ఓ వైపు నా ప్రాణం పోతున్నట్టే అనిపిస్తోంది నాకు. ఇంతలో ఓ మాట. ఓ చల్లని మాట. నన్ను ఆనందపరిచే మాట. నన్ను ఉత్తేజ పరిచే మాట. అతడు చెప్పాడు.

"తాతా! నువ్వు బెంగపడకు. దొంగని పట్టుకున్నాం. నీ పదివేలూ దొరికాయి. నా దగ్గర భద్రంగా ఉన్నాయి. నేను నీ చివరి కోరిక తప్పక తీరుస్తాను. వాటితో నీ అంత్యక్రియలు జరిపిస్తాను!" అంటున్నాడు.

ఆ మాటలు నా చెవుల్లో అమృతం పోసినట్టుగా అనిపించాయి!

ఇప్పుడు నాకు బ్రతకాలని ఉంది. "దేవుడా.. నన్ను బ్రతికించు!" అనుకున్నాను. ఎదురుగా ఉన్న ఆ దేవుడ్ని చూసి మెల్లగా కళ్ళుమూసుకున్నాను. తర్వాత అతడు ముందుకి కదిలాడు. ఎవరో అతడ్ని అడుగుతున్నారు.

"అయ్యా! నిజంగా దొంగ దొరికాడా? తాత డబ్బులు మీకు తిరిగి దొరికాయా?" అని.

అతడు సమాధానం చెప్పాడు. లీలగా అతడు చెప్పిన మాటలు నా చెవిన పడ్డాయి!

నేను ఆశ్చర్యపోయాను. 'ఇలాంటి మహానుభావులు కూడా ఉన్నారా' అని! ధర్మం ఇంకా నాలుగు కాళ్లపై నడుస్తోందనడానికి ఇలాంటి వాళ్ళే కారణం ఏమో! ఈ కలికాలంలో.. మనిషి తోటిమనిషికి సాయం చేయడానికి ఎన్నోరకాలుగా ఆలోచిస్తున్నాడు. అందులో ఎంతో స్వార్థం ఉంటేనే గానీ సాయం చేయడు. కనీసం తెలిసినవాళ్ళకి, దగ్గర బంధువులకి కూడా సాయం చేయడానికి ఎన్నో రకాలుగా ఆలోచిస్తాడు. అలాంటిది ఈయన.. నాతో ఎలాంటి సంబంధం, అనుబంధం లేని ఈయన.. ఇలాంటి గొప్ప సహాయం చేయటాన్ని నేను నమ్మలేకపోతున్నాను. ఇతడు మనిషి కాదు. మనుషుల్లో దేవుడు! అతడు చెప్పిన మాటలు మళ్ళీ గుర్తుచేసుకున్నాను.

"నిజానికి మాకు ఆ దొంగ దొరకలేదు. అలా అని కొన ఊపిరితో ఉన్న ఆ తాతకి చెబితే, అతని ఊపిరి ఆగిపోవచ్చు. కనీసం చివరి క్షణాల్లో అయినా అతనికి ఆత్మశాంతిని కల్గించాలనుకున్నాను. అందుకే ఆ తాతకి అబద్ధం చెప్పాను. నా దగ్గరున్న డబ్బులు దొంగ నుంచి తిరిగి రాబట్టినవి కాదు. అవి.." ఈ సమాధానం విన్నాక, నా మనసు చాలా తేలికపడింది.

నాకు ఊపిరి మళ్ళీ అందుతున్నట్టుంది!

అతని పాదాల్ని నా కన్నీళ్లతో అభిషేకించడానికయినా నేను బ్రతకాలనుకుంటున్నాను!

నేనిప్పుడు చావును కోరుకోవడం లేదు!

ఈ పత్రిక నిర్వహణకు ప్రతి నెలా ఒకరు ఆర్థికంగా సహాయపడుతున్నారు. ఆసక్తితో పాటు అవకాశం ఉన్నవారిని కథామంజరి కథాయజ్ఞంలో పాలుపంచుకోవలసినదిగా సవినయంగా కోరుతున్నాం. వివరాల కోసం సంప్రదించండి.

అవసరాల వెంకటరావు
*9989976688*

జయంతి ప్రకాశ శర్మ
*9848629151*

✱

సద్విమర్శ ఒక రచన ఆరోగ్యాన్ని పరిరక్షించే ఔషధం. కథకులకి మార్గదర్శి వంటిది.
కథామంజరి కథల పైన మీ అభిప్రాయాలను, విశ్లేషణలను, విమర్శలను ఆహ్వానిస్తున్నాం.

మీ అభిప్రాయాలను పంపవలసిన చిరునామా
*submit@kathamanjari.in*

మంచి రచనలతో కూడిన సంచికను రూపొందించే కార్యక్రమానికి చేయూతనివ్వండి.

✱

కథామంజరి పాఠకులను పెంచండి. కథామంజరిని కథాభిమానులకు చేరువ చేయండి.
వారి ఇమెయిల్ లను నమోదు చేసుకొనడానికి..
*www.kathamanjari.in*

✱

కొత్త, పాత రచయితలు, రచయిత్రుల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం.
మీ రచనలను పంపవలసిన చిరునామా
*submit@kathamanjari.in*